





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



తెంపరి ట్రంప్ ప్రపంచాన్ని ఎటు లాక్కెళ్తాడో!

రాష్ట్రాన్ని విధ్వంసం చేసినవారే ప్రభుత్వంపై విమర్శలా?

ప్రతి అర్హుడికీ రేషన్‌కార్డు అందజేయాలన్నదే లక్ష్యం



సంపుటి 08, సంచిక: 51 | ఆదివారం | 19-01-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## త్వరలో హైదరాబాద్ డేటా సెంటర్ల రాజధాని

● రాష్ట్రంలో రూ.3,500 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన ఎస్‌టి టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ● ఎఐ ఆధారిత క్యాంపస్‌ను స్థాపించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం ● సింగపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం రెండో రోజు పర్యటన





ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్‌కు చెందిన ఎస్‌టి టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లోని ఫోర్త్ సిటీ ముచ్చర్ల సమీపంలోని మీర్‌ఖాన్‌పేటలో అత్యాధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్‌ను స్థాపించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో ఎస్‌టి టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారధ్యంలో 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం రెండో రోజు సింగపూర్ పర్యటన విజయవంతమైందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు సింగపూర్‌లోని ఎస్‌టి టెలీ గ్లోబల్ డేటా సెంటర్ ఆఫీస్‌ను శనివారం సందర్శించి కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అదే సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌టి టెలీ గ్రూప్ సిఈఓ బ్రూనో లోపెజ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దాదాపు 100 మెగావాట్ల సామర్థ్యంతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే అత్యాధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రెడీ డేటా సెంటర్‌ను ఈ కంపెనీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పనుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డేటా సెంటర్ సామర్థ్యాన్ని పెంచుకునే తరువాయి 2లో

### సెమీకండక్టర్ పరిశ్రమలో పెట్టుబడులకు
## మరో ముందడుగు

ప్రజాపక్షం / హైదరాబాద్

సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుకూలమైన విధానాలు సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆకర్షించాయి. ఈ భాగస్వామ్యం తెలుగు రాష్ట్రానికి కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, ఆర్థికాభివృద్ధికి సహాయపడే అవకాశం ఉంది. సెమీకండక్టర్ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలు భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహపడనుంది. హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడంలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించనుంది. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరువాయి 2లో

## గ్రీన్‌కో ఎండిని విచారించిన ఎసిబి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ–కార్ రేస్ కోసం హెచ్‌ఎండిఎ నుంచి తమ సంస్థకు అందిన నిధులకు అదనంగా మరో రూ.10 కోట్లు కలిపి హెచ్‌ఎండిఎకు చెల్లిస్తామని గ్రీన్‌కో గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ చలమలశెట్టి అనిల్‌కుమార్ ఎసిబి అధికారుల విచారణలో వెల్లడించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో ఎసిబి అధికారులు అనీల్‌కుమార్‌ను నాలుగో నిందితుడిగా చేర్చి శనివారం అతన్ని ఏడు గంటల పాటు ఎసిబి ప్రధాన కార్యాలయంలో దర్యాప్తు అధికారులు విచారించారు. హెచ్‌ఎండిఎ నుంచి ఈ సంస్థకు రూ.45.71 కోట్లు బదిలీ అయ్యాయి. హెచ్‌ఎండిఎకు ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ రూ.8,06,75,404లు ఫైన్ వేసింది. దీంతో పాటు వివిధ ఫీజుల రూపంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్, ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియాకు మరో రూ.1,10,51,014 చెల్లించింది. ఫార్ములా ఈ–కార్ (10వ) రేస్ కోసం హెచ్‌ఎండిఎ సుమారు రూ.56 కోట్లు చెల్లించింది. ఇంత పెద్దమొత్తంలో నిధులు చెల్లించినా కార్ రేస్ మాత్రం జరగలేదు. ఈ అంశంపై ఎసిబి అధికారులు అనిల్‌కుమార్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే బిఆర్‌ఎస్ పార్టీకి రూ.41 కోట్ల విలువైన ఎలక్ట్రోరల్ బాండ్లు ఇవ్వడంపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. ఫార్ములా ఈ–ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్ జెన్, పురపాలక శాఖలు ఫార్ములా ఈ–కార్ రేసింగ్‌పై 2022 అక్టోబరు 25న ఒప్పందంకు సంబంధించిన ఒప్పంద పత్రాలను కూడా అనిల్‌కుమార్ ఎసిబి అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. 9, 10, 11, 12వ సీజన్ల కార్ రేస్లు హైదరాబాద్‌లో నిర్వహించేలా ఒప్పందం కుదిరిందని 9వ రేస్ చేసిన తాము తరువాయి 2లో

### ఆర్‌జి కర్‌లో అత్యాచారం కేసు
## నేరస్థుడు సంజయ్ రాయ్

కోల్‌కతా కోర్టు నిర్ధారణ - రేపు శిక్షలు ఖరారు
ఉరి లేదా జీవితకాల శిక్షకు అవకాశం



**కోల్‌కతా :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఆందోళనకు దారితీసిన ఆర్.జి కర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి కేసులో సంజయ్ రాయ్‌ను కోల్‌కతా న్యాయస్థానం నేరస్థుడుగా ప్రకటించింది. అతడికి ఎలాంటి శిక్ష విధించాలనే విషయాన్ని న్యాయస్థానం సోమవారంనాడు వెల్లడిస్తుంది. భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) చట్టంలోని సెక్షన్ 103 (1) ప్రకారం సంజయ్ రాయ్‌కి మరణశిక్ష లేదా యావజ్జీవ కారాగారశిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. సోమవారంనాడు నేరస్థుడి చివరి వాంగ్మూలం విని శిక్ష ప్రకటించిన తర్వాత న్యాయమూర్తి రాసిన 160 పేజీలకు పైగా తీర్పు పరిపూర్ణమవుతుంది. ఈ కేసులో తనను ఇరికించారని సంజయ్ రాయ్ న్యాయస్థానంలో వాదించారు. ''నేను నా మెడలో రుద్రాక్ష ధరించాను, ఒకవేళ నేను నేరానికి పాల్పడిఉంటే ఈ రుద్రాక్ష తెగిపోయి ఉండేది'' అని పేర్కొన్నారు. మరణించిన వైద్యవిద్యార్థిని తల్లితండ్రులు ఈ సందర్భంగా న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలియజేశారు. న్యాయస్థానంపై తమకున్న విశ్వాసాన్ని కోర్టు గౌరవించిందని వారు అన్నారు. ''వాస్తవాలన్నీ మీముందున్నాయి, మీరు వాటిని గౌరవించారు'' అని మృతురాలి తండ్రి అన్నారు. ఆమె తల్లి తీర్పును హర్షించినప్పటికీ, తన బిడ్డకు తరువాయి 2లో

## ఉగాది నుంచి 'గద్దర్' అవార్డులు

'గద్దర్' సినిమా అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఈ ఏడాది ఉగాది నుంచి గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగిన విధంగా కమిటీ సభ్యులు, అధికారులు వేగంగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన 'గద్దర్ అవార్డుల కమిటీ' సమావేశం శనివారం జరిగింది.ఈ సమావేశంలో టిఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు, ఎండి డాక్టర్ హరీశ్, ఈడి కిషోర్‌బాబు, కమిటీ చైర్మన్ బి.నర్సింగరావు, కమిటీ సభ్యులు జయసుధ, తమ్మారెడ్డి భరద్వాజ్, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి వెన్నెల, అల్లాణి శ్రీధర్, వేణు తదితరులు పాల్గొన్నారు. ఫీచర్ ఫిల్మ్స్, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డులలో నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందచేస్తారు. గద్దర్ అవార్డుకు సంబంధించి లోగోను కూడా రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను తరువాయి 2లో

## త్వరలో 'హౌసింగ్ పాలసీ'

'ఒఆర్ఆర్,ఆర్ఆర్ఆర్'మధ్యలో వంద ఎకరాల్లో టౌన్‌షిప్ : మంత్రి పొంగులేటి




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో త్వరలోనే నూతన హౌసింగ్ పాలసీని ప్రవేశపెట్టనున్నట్టు గృహ నిర్మాణ, రెవెనూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ తరహాలో ఔటర్ రింగ్ రోడ్డు (ఒఆర్ఆర్), రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) మధ్యలో మధ్య తరగతి ప్రజల కోసం ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నామని, ఇందుకు కనీసం వంద ఎకరాలలో టౌన్ షిప్‌లను నిర్మించి, తరువాయి 2లో

### మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి
## బడే చొక్కారావు హతం

ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌లో మృతి
నిర్ధారించిన మావోయిస్టు పార్టీ

ప్రజాపక్షం/భద్రాచలం



ఛత్తీస్‌గడ్‌లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ హతమయ్యారు. ఈ విషయాన్ని ఆ పార్టీ శనివారం విడుదల చేసిన లేఖలో నిర్ధారించింది. ఆ ఎన్‌కౌంటర్‌లో మొత్తం తరువాయి 2లో

## ఇన్‌డోర్‌లోనే ట్రంప్ ప్రమాణం



**వాషింగ్టన్ :** విపరీతమైన చలిగాలుల భయం అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారంనాడు క్యాపిటల్ హిల్స్ భవంతి లోపలే హాలులో జరుగుతుంది. అమెరికా చరిత్రలో అత్యంత దారుణంగా గడ్డకట్టే చలిగాలుల రోజుగా జనవరి 20వ తేదీన నమోదు కానున్నది. సోమవారంనాడు వాషింగ్టన్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ 11 డిగ్రీల సెల్సియస్‌కు అతిదారుణంగా క్షీణించనున్నది. ఈ నేపథ్యంలో 'ట్రూత్ సోషల్ మీడియా' వేదికగా చేసుకుని ట్రంప్ శనివారంనాడు ఈ విషయం ప్రకటించారు. తన ప్రమాణ స్వీకారోత్సవంవల్ల గడ్డకట్టే చలిలో ప్రజలు గాయపడటంలేదా రోగాల బారినపడటం తనకు ఇష్టం లేదని ఆయన ప్రకటించారు. పరిమితంగా ప్రముఖులను మాత్రమే ఈ ఉత్సవానికి హాజరవుతారు. అధ్యక్షుడి ప్రసంగం ఇండోర్‌లోనే ఉంటుంది. 40 ఏళ్ళ తర్వాత మళ్ళీ అమెరికా సంప్రదాయాలకు విరుద్ధంగా క్యాపిటల్ హిల్ భవంతి వెలుపల కాకుండా భవంతి లోపల రొటుండాలో అధ్యక్షుడి పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తారు. వాషింగ్టన్‌లో రాబోయే వారం రోజులపాటు తరువాయి 12లో



### జీతాలకే డబ్బుల్లేవ్
## హామీల అమలు ఎలా?

ఉచితాలకు వ్యతిరేకమని బిజెపి ఎప్పుడూ చెప్పలేదు
చిట్‌చాట్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం /హైదరాబాద్

ఉచితాలకు బిజెపి వ్యతిరేకమని తాము ఎన్నడూ చెప్పలేదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆధారంగా హామీలు ఇవ్వాలని, లేనిపోతే రాష్ట్రం దివాళా తీస్తుందని చెప్పామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ పొంకనాలకు పోయి డబుల్ బెడ్ రూం ఇళ్లను కడుతానని మోసం చేయగా, ఇప్పుడు సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలు చేస్తున్నామని తరువాయి 2లో




# గాజాలో సరికొత్త పొద్దు పొడుపు

## నేటినుండి 737 మంది పాలస్తీనా ఖైదీల విడుదల: ఇజ్రాయెల్ మంత్రివర్గం ఆమోదం



**టెల్అవీవ్ :** గాజాలో కొత్త పొద్దు పొడిచింది. గాజా కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల నుండి, భారత కాలమానం ప్రకారం ఉదయం 8.30 గంటలకు కాల్పుల విరమణ ఒప్పందం అమలు లోకి వచ్చింది. వచ్చింది.దోహాలో మధ్యవర్తుల సమక్షంలో జరిగిన ముసాయిదా ఒప్పందాన్ని ఇజ్రాయెల్ మంత్రివర్గం ఆమోదించింది. మొత్తం 737 మంది ఖైదీలకుగాను తొలివిడతగా 95 మంది పాలస్తీనా ఖైదీల విడుదలకు పేర్ల జాబితాను ఇజ్రాయెల్ విడుదల చేసింది. వీరిలో ఎక్కువమంది మహిళలే ఉన్నారు. అదేవిధంగా హమాస్ కూడా ఒప్పందం ప్రకారం 33 మంది బందీలలో మొదటిరోజు ఆదివారంనాడు ముగ్గురు మహిళా బందీలను, ఏడో రోజున (వచ్చేశనివారం)మరో నలుగురు బందీలను విడుదల చేస్తారు. మిగిలిన 26 మంది ఇజ్రాయెల్ బందీలను రాబోయే ఐదు వారాలలో విడతలవారీగా విడుదల చేస్తారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై సామూహిక దాడిచేసి 1,200 మందిని కాల్చి చంపారు. మరో 250 మందిని బందీలుగా గాజాకు తీసుకువెళ్ళారు. వీరిలో ఇంకా 100 మంది వారిదగ్గరే బందీలుగా ఉన్నారు.

ఇజ్రాయెల్ మంత్రివర్గానికంటే ముందుగానే సెక్యూరిటీ క్యాబినెట్ సమావేశం శుక్రవారంనాడే ఈ ఒప్పందాన్ని ఆమోదించింది. పాలస్తీనా ఖైదీలను విడుదల చేసిన సమయంలో బహిరంగ ఉత్సవాలు జరగకుండా తాము ముందు జాగ్రత్తలు తీసుకుంటామని ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ ప్రకటించింది. ఈ సమావేశంలో కూడా ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ పాల్గొని ఏర్పాట్లను సమీక్షించారు. శిక్షా జైలునుండి ఖైదీలను విడుదలచేసి తీసుకువచ్చినప్పుడు ఆఫ్ఫెర్ సహా ఇజ్రాయెల్‌లోని ఇతర ప్రాంతాలలో ఉత్సవాలు, కేరింతలు లేకుండా అడ్డుకుంటామని ఇజ్రాయెల్ ప్రిజన్ కమిషనర్ కోబీ యాకోబీ ప్రకటించారు.

కాగా శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన ఇజ్రాయెల్ మంత్రివర్గ సమావేశం ఆరుగంటలపాటు సుదీర్ఘంగా కొనసాగింది. నేతన్యాహూ మంత్రి వర్గంలో 24 మంది ముసాయిదా ఒప్పందానికి అనుకూలంగా ఓటు వేయగా ఎనిమిదిమంది వ్యతిరేకించారు. గాజాలో ఉన్న 33 మంది బందీలను కూడా



విడుదల చేసే ప్రక్రియ ఆదివారంనాడే ప్రారంభం అవుతుంది. ఇటు బందీల విడుదల, అటు ఇజ్రాయెల్ సైన్యం గాజాను ఖాళీ చేసే ప్రక్రియ ఆరువారాల పాటు కొనసాగుతుంది. ఆ తర్వాత నుండి గాజా పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభమై కొన్ని సంవత్సరాలపాటు కొనసాగుతుంది. చివరి నిమిషం వరకూ యుద్ధ విరమణపై అందరినీ టెన్షన్‌కు గురిచేసిన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ యుద్ధ విరమణ జరుగుతుందని ప్రకటించారు. దశలవారీగా 737 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ఈ మేరకు ఖైదీల జాబితాను కూడా ఇజ్రాయెల్ ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇజ్రాయెల్ సైన్యం (ఐడిఎఫ్) యుద్ధాన్ని విరమించిందని ఖతార్ విదేశాంగమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మాజెద్ అల్ అన్సారీ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఇదిలా ఉండగా బుధవారంనాడు గాజాలో కాల్పుల విరమణ ముసాయిదా ఒప్పందం గురించి ప్రకటన వెలువడినప్పటినుండి ఇప్పటివరకూ ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 100 మంది పైగా పాలస్తీనియన్లు మరణించారు

ప్రపంచం

# ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ళశిక్ష

## ఆయన భార్యకు ఏడేళ్ళు శిక్ష



**ఇస్లామాబాద్ :** సుమారు 200కు పైగా కేసులు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ (72) కు ఒక న్యాయస్థానం 14 ఏళ్ళు జైలుశిక్ష విధించింది. భూమికి సంబంధించి రియల్ ఎస్టేట్ అక్రమ లావాదేవీల ద్వారా ధనలాభం పొందారన్న ఆరోపణలపై ఆయనకు యాంటీ–గ్రాఫ్ట్ కోర్టు ఈ శిక్ష విధించింది. ఈ కేసులో ఆయన భార్య బుష్రా బీబీకి కూడా ఏడు సంవత్సరాలు జైలుశిక్ష పడింది. ప్రస్తుతం బుష్రాబీబీ బెయిలుపై ఉన్నారు. ఈ తీర్పు వచ్చిన వెంటనే జైలు అధికారులు ఆమెను అరెస్టు చేసి జైలుకు తరలించారు. 2000 నుండీ 2022 వరకూ ప్రధానమంత్రిగా పదవిలో ఉండగా రియల్ ఎస్టేట్ డెవలపర్స్‌కు అక్రమమార్గంలో మేలు చేసి అందుకు బదులుగా ధనలబ్ధి పొందారని కోర్టు నిర్ధారించి ఈ శిక్షలు విధించింది. ఇమ్రాన్‌ఖాన్ అధికారంలో ఉండగా ప్రభుత్వేతర సంక్షేమ విభాగం 'అల్ ఖదీర్ ట్రస్ట్'ను ఆయన ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ ద్వారానే ఈ లావాదేవీలు జరిగాయని కోర్టు పేర్కొంది. దీంతో పాకిస్తాన్‌లో పిటిఐ పార్టీ కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆయనను రాజకీయంగా బలిపశువును చేశారని, ఆయనపై ప్రభుత్వం అక్రమంగా కేసుల్లో ఇరికించి కక్ష తీర్చుకుంటున్నదని పిటిఐ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. ఆయన మద్దతుదారులు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రభుత్వానికీ, ఆ పార్టీ ప్రతినిధులకు మధ్య ఈ కేసులకు సంబంధించి రాజీ ఒప్పంద శాంతి చర్చలు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ తీర్పు వెలువడింది. 2023 ఆగస్టు నుండీ రావల్పిండి జైలులో ఇమ్రాన్‌ఖాన్ శిక్ష అనుభవిస్తున్నారు. అదేజైలులో ఏర్పాటు చేసిన కోర్టు ఈ మేరకు ఆయనకు వ్యతిరేకంగా 14 సంవత్సరాలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఐతే ఈ కేసులో తీర్పులపై పై కోర్టులో సవాలు చేస్తామని ఇమ్రాన్ ఖాన్ సహాయకుడు ఒమర్ అయూబ్ చెప్పారు.

# ఇరాన్‌లో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కాల్చివేత




**టెహ్రాన్ :** ఉగ్రవాది జరిపిన దాడిలో ఇరాన్ దేశ సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు మరణించారు. శనివారంనాడు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఉగ్రవాదులు జరిపిన ఈ కాల్పుల దాడిలో మరో న్యాయమూర్తి తీ వ్రంగా గాయపడి ఆసుపత్రిలో చావుబ్రతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఇంతకూ ఈ దాడి చేసిన ఉగ్రవాది ఎవరో కాదు, ఇరాన్ సుప్రీంకోర్టు కేం ద్ర కార్యాలయంలో ఉద్యోగిగానే పనిచేస్తున్నాడు. న్యాయమూర్తులపై కాల్పులు జరిపిన తర్వాత ఆ ఉగ్రవాది తనను తాను కాల్చుకుని మరణించాడని ఇరాన్ మీడియా పేర్కొంది. ఈ దాడిలో న్యాయమూర్తి మహ్మద్ మొగిశేష్, హొజితొలెస్లా మ్ అలీ రజనీ ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఐతే ఇ రాన్ జ్యుడీషియరీ మీడియా తాజాగా ఈ ఉగ్రవాదిని చొరబాటు దారుడుగా చిత్రీకరిస్తున్నారు.ఉగ్రవాదం, జాతీయ భద్రత , నేరాలు వంటి విషయాలకు సంబంధించిన కేసుల్లో తీర్పులు చెప్పే అనుభవజ్ఞులైన సీనియర్ న్యాయవాదులు ఇద్దరినీ దాడికిఇపాల్పడిన ఉగ్రవాది లక్ష్యంగా ఎంచుకున్నా డు. బహుశా ఈ ఉగ్రవాది మరణించిన న్యాయమూర్తులు విచారించిన కేసులకు సంబంధించిన వ్యక్తిగా లేదా వారి శ్రే యోభిలాషిగా అంచనావేస్తున్నా రు.ఐతే మరణించిన న్యాయమూర్తి మొగిశేష్‌పై 2019లో అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. చాలా అక్రమంగా కేసుల వి చారణ చేస్తున్నార ని, ఇష్టానుసారంగా తీర్పులు ఇ స్తున్నారనీ ఆయనపై ఆరోపణలు చేసింది. మరణించిన మ రో న్యాయవాది రజిని 1998లోనే బాంబు దాడి నుండి త ప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. వీరిద్దరిపై ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారా? అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

# టిక్‌టాక్ నిషేధానికి టైమ్ పడుతుంది!




**వాషింగ్టన్ :** టిక్‌టాక్ యాప్‌ను నిషేధాన్ని సమర్థిస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ యంత్రాంగం స్పందించింది. ఈ నిషేధం అమలుకు ఇంకా సమయం పడుతుందని పేర్కొంది. టిక్‌టాక్ యాప్ సమస్యకు తాము ఒక పరిష్కారం సాధిస్తామని డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. కానీ నిర్ణీత ప్రకారం చైనా యాప్ టిక్ టాక్‌ను అమెరికాకు చెందిన ఏదైనా కంపెనీకి విక్రయించాలి. ఈ విక్రయం జరగకపోతే దానిపై నిషేధం అమలు జరుగుతుంది. టిక్ టాక్ వల్ల అమెరికా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్న వాదనను ఇంతకుముందు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు సమర్థించింది. జో బైడెన్ కూడా దీనిని అమలు చేయబోమని సంకేతాలు పంపించారు. కానీ గడువు దగ్గరపడింది. ఐతే కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టేలోపు టిక్‌టాక్ గొంతులో పచ్చివెలక్కాయపడింది. గడువు గంటల్లోకి రావడంతో టిక్‌టాక్ ఒక ప్రకటన చేస్తూ నిషేధాన్ని అమలు చేయబోమని బైడెన్ ప్రభుత్వం గనుక ఒక స్పష్టమైన వైఖరిని ప్రకటించకపోతే టిక్‌టాక్ ఇక కనిపించకుండా పోతుందని సంబంధిత యాప్ వర్గాలు పేర్కొన్నాయి. టిక్‌టాక్‌పై డోనాల్డ్ ట్రంప్ సానుకూల దృష్టితో ఉన్నారు. టిక్‌టాక్ అధినేత తరపున ప్రతినిధులు కూడా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటున్నారు. ప్రమాణ స్వీకారోత్సవం తర్వాత టిక్‌టాక్‌పై ఒక స్పష్టమైన వైఖరిని ట్రంప్ ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. టిక్ టాక్‌కు అమెరికాలో 170 మిలియన్ల మంది యూజర్లు ఉన్నారు.

# బ్రిక్‌లో భాగస్వామ్య దేశంగా నైజీరియా




**బ్యూనోస్ ఐర్స్ :** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియా 'బ్రిక్' (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణ ఆఫ్రికా) కూటమిలో భాగస్వామ్యదేశంగా మారింది. బ్రెజిల్ శనివారంనాడు ఈ విషయం ప్రకటించింది. వంతులవారీ పద్ధతి ప్రకారం ప్రస్తుతం 'బ్రిక్స్' అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న బ్రెజిల్ విదేశీమంత్రిత్వశాఖ నైజీరియాను బ్రిక్స్‌లో భాగస్వామ్యదేశంగా ప్రకటించింది. ''గ్లోబల్ సౌత్''ను మరింత పటిష్టవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడంలో భాగంగా బ్రిక్స్ వివిధ అంతర్జాతీయ సంస్థలను కూడా బలోపేతం చేసి మరింత విస్తారమైన కార్యకలాపాలకు సిద్ధం చేసేందుకు పాటు పడుతుందని బ్రెజిల్ పేర్కొంది. కజాన్‌లో గడచిన అక్టోబరులో జరిగిన శిఖరాగ్ర సదస్సులో రష్యా నుండి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను తీసుకున్న బ్రెజిల్ అధికారికంగా జనవరి 1 నుండీ ఆ బాధ్యతల అమలును ప్రారంభించింది. బెలారస్, బొలీవియా, కజఖస్థాన్, క్యూబా, మలేసియా, థాయిలాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, ఇండోనేసియా దేశాలను తొలుత భాగస్వామ్య దేశాలుగా ప్రకటించారు.

## 'గద్దర్' అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు. జాతీయ సమైక్యత, ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యం కలిగిన అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో అవార్డులు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని డిప్యూటీ సిఎం సూచించారు. కల్చరల్ ఐకాన్ గద్దర్ ప్రతిష్టను పెంచేలా అవార్డుల లోగోలు రూపొందించాలని తెలిపారు. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వారు చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అవార్డుల పంపిణీ జరగలేదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు భట్టి తెలిపారు.

## బడే చొక్కారావు హతం

(మొదటి పేజీ తరువాయి)

దామోదర్‌తో సహా 18 మంది మావోయిస్టులు హతమైనట్లు మావోయిస్టు బస్తర్ ఏరియా కార్యదర్శి గంగ ఆ లేఖలో పేర్కొన్నారు. అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతితో 30 ఏళ్ల అజ్ఞాతానికి తెరపడినట్లు అయ్యింది. మోస్టువాంటెడ్‌గా ఉన్న ఆయన తలపై రూ.50 లక్షల రివార్డు ఉంది. ఆరు నెలల క్రి తమే రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు చేపట్టిన చొక్కారావు అనేక విధ్వంసకర కార్యక్రమాల్లో పాల్పంచుకున్నారు. ఆయనపై పలు పోలీస్టేషన్లలో కేసులున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెం దిన బడే చొక్కారావు చిన్నతనంలోనే మావోయిస్టు ఉద్యమానికి ప్రభావితమై అ జ్ఞాతంలోనికి వెళ్లాడు. దామోదర్‌తోపాటు మరో తెలుగు మావోయిస్టు నేత న ర్సింహారావు కూడా మృతుల్లో ఉన్నట్లు విడుదలైన లేఖలో పేర్కొన్నారు. బడే చొ క్కారావు మృతితో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగినట్లు అ య్యింది. గత ఏడాది నుండి ఇప్పటి వరకు జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ వరుసగ నష్టాలను చవిచూస్తుండగా ఇప్పుడు అగ్రనేతను కోల్పోయింది. చొక్కారావు మృతితో ఆయన స్వగ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

## విచారించిన ఎసిబి

(మొదటి పేజీ తరువాయి)

10వ రేస్ చేయలేకపోయామని అనీల్‌కుమార్ చెప్పినట్లుగా తెలిసింది. అలాగే లావాదేవీలకు సంబంధించిన బ్యాంక్ పత్రాలను కూడా ఎసిబి అధికారులకు అందించినట్లు తెలిసింది. ఇకార్ రేస్ కోసం హెచ్‌ఎండిఎ నష్టపోయిన డబ్బులను తామ సంస్థ తిరిగి ప్రభుత్వానికి చెల్లించడానికి సిద్దంగా ఉందని అనీల్ కుమార్ సూచించినట్లు తెలిసింది. ఫార్ములాఇ రేస్ కేసులో జరిగిన అవకతవకలపై కొనసాగుతున్న విచారణకు సంబంధించి అనిల్ కుమార్‌కు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) గురువారం సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 2023లో నిర్వహించిన రేసింగ్ ఈవెంట్‌కు గ్రీన్‌కో గ్రూప్‌కు అనుబంధ సంస్థ (Ace Nxt Gen Private Limite) స్పాన్సర్‌గా ఉంది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారణ సాగింది. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని ఎసిబి అధికారులు చెప్పారు.ఈ కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో పాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఎ) చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డిలను ఎసిబి ప్రశ్నించిన వారం తర్వాత అనీల్‌కుమార్‌ను విచారించింది.ఈ కేసులో ఇప్పటికి నిందితుల సంఖ్య నాలుగుకు చేరింది. మరి కొంత మంది నిందితులను ఈ కేసులో చేర్చే అవకాశాలు ఉన్నాయి.

**ఇడి కూడా విచారించనుంది..?**

ఫార్ములా ఇకార్ రేస్ కోసం హెచ్‌ఎండిఎ నుంచి నిధులు అందుకున్న గ్రీన్‌కో గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ చలమలశెట్టి అనీల్‌కుమార్‌ను డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు కూడా విచారించనున్నారు.

## మరో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)



నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పర్యటిస్తున్నది. అందులో భాగంగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సింగపూర్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అసోసియేషన్ (ఎస్‌ఎస్‌ఐఎ)తో ప్రత్యేక రౌండ్ టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థలు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎస్‌ఐఎ ఛైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ ఛైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సి.ఎస్.చుహ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చర్చల్లో రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమ స్థాపనకు అందుబాటులో ఉన్న అనుకూలమైన పరిస్థితులను మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే సహకారం ప్రోత్సాహకాలను వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తెలంగాణ రాష్ట్రం కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానానికి ఎఎస్‌ఐఎ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. సెమీకండక్టర్ల పరిశ్రమల పెట్టుబడులకు ఆ సక్తి ప్రదర్శించారు. ఈ ఏ డాది చివరలో సింగపూర్ నుంచి తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి, పరిశీలన జరుపుతారని తెలిపారు.

**తెలంగాణాకు సహకారానికి సానుకూలం:** తెలంగాణ రాష్ట్రంలో నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయా లు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, స్పోర్ట్స్, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రభుత్వానికి సహకారం అందించేందుకు సింగపూర్ మంత్రి గ్రేస్ పు హైయిన్ సానుకూలంగా స్ప ందించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీ టి వనరుల నిర్వహణ, తెలంగాణ ఎంచుకున్న సుస్థిర వృద్ధి ప్రణాళికలపై ఎ క్కువ ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందు కు అంగీకరించారు. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ వాణిజ్య, ప ర్యావరణ మంత్రి గ్రేస్ పు హైయిన్‌తో భేటీ అయింది. తెలంగాణతో వివిధ ర ంగాలలో సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యంపై ఈ సందర్భంగా చర్చలు జ రిపారు. ముఖ్యమంత్రితో పాటు ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బా బు, ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణలకు పెట్టుబడుల కు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. ప్రధానంగా నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, స్పోర్ట్స్, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఉన్న అనుకూలతలను వివరించారు. ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, వాటిపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను గుర్తించాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో సింగపూర్ అనుభవాలను పంచుకోవాలని, దేశంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణలో సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టుల కార్యాచరణ వేగవంతం చేయాలని నిర్ణయించారు.

## అమలు ఎలా? (మొదటి పేజీ తరువాయి)

పోయి డబుల్ బెడ్ రూం ఇళ్లను కడుతానని మోసం చేయగా, ఇప్పుడు సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలు చేస్తున్నమని ఢిల్లీలో గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు ప్రభుత్వం వద్ద జీతాలకే డబ్బులు లేవని, అప్పుల కోసం ఎదురు చూస్తున్నారని, మరీ హామీలను అమలు చేస్తుందని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మాజీ మంత్రి కెటిఆర్ 10 స్థానాల్లో ఉప ఎన్నికలు రాబోతున్నాయంటూ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆయన సుప్రీంకోర్టు జస్టిస్ అయ్యారంటూ ఎద్దేవా చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా సంఘ్ కు చెందిన వారే ఉండాలనే రూల్ ఏమి లేదని, అయితే రాష్ట్ర అధ్యక్షుడి పదవి చేపట్టేవారికి 2 క్రియాశీల సభ్యత్వాలు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఎంపి ఈటెల రాజేందర్‌కు అధ్యక్షులు అయ్యే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు ఆయన తమ పార్టీ నుంచి 4 సార్లు పోటీ చేశారని , ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. జాతీయ అధ్యక్షులు మీరేనంటగా అన్న ప్రశ్నకు అది పార్టీ నిర్ణయిస్తుందన్నారు. కాంగ్రెస్ మాకు ప్రధాన రాజకీయ శత్రువు కాగా, బిఆర్‌ఎస్ పక్కా కుటుంబ పార్టీ అని అన్నారు. బిఆర్‌ఎస్, బిజెపిఒక్కటే అని ఎవరో ఏదో అంటే ఆ విషయం మమ్మల్ని అడగొద్దన్నారు. విభజన చట్టం ప్రకారమే ఎపికి నిధులను కేటాయిస్తున్నామని, తెలంగాణ అభివృద్ధికి సైతం కేంద్రం అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తోందని చెప్పారు. త్వరలో జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో 3 స్థానాల్లో బిజెపి విజయం పక్కా అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు

## నేరస్థుడు సంజయ్ రాయ్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిన్యాయం జరగలేదన్నారు. ''సంజయ్ నేరస్థుడని రుజువైంది,వైద్యపరమైన సాక్ష్యాలు రుజువు చేశాయి. విచారణ సందర్భంగా అతడు మౌనంగా ఉండిపోయాడు, అతడు నా కుమార్తెను హింసించి చంపాడు, అతడి పాత్ర ఏమిటో ఈ కేసులో రుజువైంది, కానీ అతడొక్కడే కాదు, ఇంకా చాలామంది ఈ కేసులో అరెస్టు చేయాల్సి ఉంది, వారిని విచారణ చేయాల్సి ఉంది, మా పోరాటాన్ని తుది శ్వాస వరకూ కొనసాగిస్తాం'' అని మృతురాలి తల్లి ఆవేదనతో అన్నారు.

ఆర్.జి.కార్ ప్రభుత్వ ఆసుపత్రిలో శిక్షణ పొందుతున్న పోస్టు గ్రాడ్యుయేట్ వైద్యవిద్యార్థిని (31)పై అత్యాచారానికి పాల్పడి ఆ పై హత్యచేసిన 162 రోజుల తర్వాత శనివారంనాడు కోర్టు నేరస్థుడెవరో నిర్ధారించింది. ''ఈ కేసులో సంజయ్ రాయ్ విధుల్లో ఉన్న వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి చేశాడు, ఆమె గొంతు నులిమి చంపాడు, అతడిపై వచ్చిన ఆరోపణలను కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ ఆధారాలతో రుజువు చేసింది. దీంతో న్యాయమూర్తి సంజయ్ రాయ్‌ను నేరస్థుడుగా నిర్ధారించారు, సోమవారంనాడు సీల్దా కోర్టు తీర్పు ప్రకటిస్తుంది'' అని అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి అనిర్బన్ దాస్ చెప్పారు. సంజయ్‌రాయ్‌ను ఇదే కోర్టులో విచారణ జరిపారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు న్యాయస్థానం అతడి వాంగ్మూలాన్ని వింటుంది. ఆ తర్వాత శిక్ష ప్రకటిస్తుంది. గత ఏడాది నవంబరునెలలో ఇతరులెవరికీ అనుమతిలేని పద్ధతులలో కోర్టు విచారణ ప్రారంభమైంది. రెండు నెలలపాటు విచారణ జరిపిన అనంతరం నిందితుణ్ణి నేరస్థుడుగా నిర్ధారించారు. బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ 64 కింద సంజయ్‌రాయ్‌ను నేరస్థుడని గుర్తించారు. జనవరి 9న కోర్టు విచారణ పూర్తయింది. సంజయ్‌రాయ్ వాంగ్మూలం తీసుకునేందుకు మీడియా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, పోలీసులు మాత్రం అతడిని వారికి కనిపించకుండా కట్టుదిట్టమైన బందోబస్తుమధ్య కోర్టు గది నుండి బయటకు తరలించారు.

సంజయ్‌రాయ్ 2019లో కోల్‌కతా ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ విభాగంలో తాత్కాలిక ప్రాతిపదికపై పౌర వాలంటీరుగా ఉద్యోగంలో చేరాడు. అతడికి నెలకూ రూ.12,000 వేతనం లభిస్తుంది. పోలీసులు విధులన్నీ అతగాడు కూడా నిర్వహించినప్పటికీ పర్మినెంటు పోలీసు ఉద్యోగులకు లభించే ఆర్థిక ప్రయోజనాలేమీ సంజయ్‌రాయ్‌కు ఉండవు. ఉద్యోగంలో చేరిన కొన్నాళ్ళకు అతడిని ఆర్.జి.కార్ ఆసుపత్రిలో ఔట్ పోస్టు బాధ్యతల నిర్వహణకు పంపించారు. దీంతో ఆసుపత్రిలోని అన్ని విభాగాలతో అతడికి పూర్తి పరిచయం ఏర్పడింది. పూర్తి స్వేచ్ఛ లభించింది. ఒక సివిక్ వాలంటీరుగా పోలీసు శాఖతో ఉన్న అనుబంధాన్ని, ఆ అవకాశాన్ని సంజయ్ రాయ్ తన స్వప్రయోజనాలకోసం దుర్వినియోగం చేశాడని సిబిఐ తన ఛార్జిషీటులో పేర్కొంది. ప్రభుత్వ ఆసుపత్రిలో శిక్షణ పొందుతున్న వైద్యవిద్యార్థినిపైఅతి దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడని పేర్కొంది. తొలుత ఈ కేసును కోల్‌కతా పోలీసులు దర్యాప్తు చేశారు. ఆగస్టు 10న అతడిని అరెస్టు చేశారు. తర్వాత కోర్టు ఈ కేసు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేసింది.

పోలీసుల తరపున స్వచ్ఛంధ పౌర వాలంటీరుగా ఆర్.జి.కార్ ప్రభుత్వ కాలేజీ ఆసుపత్రి ఔట్‌పోస్ట్‌లో పనిచేస్తున్న సంజయ్ రాయ్ అదే ఆసుపత్రిలో శిక్షణ పొ ందుతున్న పోస్టు గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థినిపై 20 24 ఆగస్టు 9వ తేదీన అత్యాచారం చేశాడు. ఆ తర్వాత ఆమెను గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె మృతదేహం ఒక రోజు తర్వాత ఆసుపత్రి సెమినార్ గదిలో లభించింది. దీంతో నిందితుణ్ణి శిక్షించాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఆందోళనోద్యమం చెలరేగింది.

## 'హౌసింగ్ పాలసీ'

(మొదటి పేజీ తరువాయి)

మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, సాంకేతిక విద్య శాఖ మంత్రి ఎస్ .హెచ్.రాజేష్ ధర్మాని శనివారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా రాజేష్ ధర్మానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.హౌసింగ్ నియమ నిబంధనల మేరకు, అందుబాటులో ఉన్న బోర్డు స్థలాలలో కొత్తగా గృహనిర్మాణానికి సంబంధించిన స్కీములను అమలు చేయాలని యోచిస్తున్నామని, ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో 'అఫర్డబుల్ గృహ పథకాల' అమలుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే, మరోవైపు వివిధ కోర్టులలో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాష్ట్ర పునర్వ్యవస్తీకరణ చట్టం 2014ను సవరించి ఆస్తుల, అప్పులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు శాశ్వత గృహాలు నిర్మించాలన్న సంకల్పంతో వచ్చే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో ఇప్పటికే మొదటి దశలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చిందని,వీలైనంత త్వరలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నామని,లబ్ధిదారులే స్వయంగా ఇళ్లు నిర్మించుకునే సౌలభ్యం కూడా కల్పించినట్టు ఆయన వివరించారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇందిరమ్మ ఇంటిని నిర్మిస్తున్నామని, ఇందులోవంటగది, టాయిలెట్ సౌకర్యం ఉంటుందని, ఇందుకు ప్రభుత్వమే రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుందని, హైదరాబాద్, సికిందరాబాద్, సైబరాబాద్ మూడు సిటీలు ఉండగా,కొత్తగా ఫోర్త్ సిటిగా 15 వేల ఎకరాలలో 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## డేటా సెంటర్ల రాజధాని

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయం ఇందులో ఉంటుంది. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఇది ఒకటిగా నిలుస్తుందని సంస్థ వెల్లడించింది. దాదాపు రూ.3,500 కోట్ల పెట్టుబడులతో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఆ కంపెనీ ముందుకురావ టం తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలను, ప్రపంచస్థాయి అనుకూలతలను చాటి చెప్పిందని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే హైదరాబాద్ డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుందని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నందుకు ఎస్‌టి టెలీ గ్లోబల్ కంపెనీ ప్రతినిధులను అభినందించారు. తెలంగాణతో కలిసి పనిచేయడం గౌరవంగా ఉందని ఎస్‌టి టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ ప్రెసిడెంట్, గ్రూప్ సిఈఓ బ్రూనో లో పెజ్ అన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతిశీల విధానాలు సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహకంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థిక వృ ద్ధితో పాటు ఉపాధి కల్పన, స్థిరమైన డిజిటల్ భవిష్యత్తు నిర్మించాలనే ఉమ్మడి లక్ష్యం నెరవేరుతుందని అ న్నారు. ప్రపంచానికి హైదరాబాద్ డేట్ హబ్‌గా మారుతుందని ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎఐ ఆధారిత రంగంలో వస్తున్న వినూత్న మార్పులలో హైదరాబాద్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రస్తుతం ఈ కంపెనీ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో డేటా సెంటర్‌ను నిర్వహిస్తోంది. కొత్త క్యాంపస్ ఏర్పాటుతో కంపెనీ కార్యకలాపాలను విస్తరించనుంది. ఈ కంపెనీ పదేండ్లలో భారతదేశంలో ఒక గిగావాట్ సామర్థ్యానికి విస్తరించాలనే భవిష్యత్తు లక్ష్యంతో తెలంగాణలో పెట్టుబడులు పెడుతోందని, దశాబ్దంలో ఈ కంపెనీ దాదాపు 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతుందని అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## పార్టీలకతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/కొహెడ : మారుతున్న కాలానికి అనుగుణంగా ఆదాయం వచ్చే పంటలను రైతులు పండించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్ది పేట జిల్లా కొహెడ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు వెన్నుదన్నుగా నిలుస్తుందని, ప్రతి రైతు సహకార సంఘాల్లో సభ్యుడిగా చేరాలని చెప్పారు. మార్క్ ఫెడ్ చైర్మన్‌గా పని చేసినప్పుడు సంఘాల బలోపేతానికి కృషి చేశానని గుర్తు చేశారు. వ్యవసాయ రంగంలో అవినీతికి తావు లేకుం డా విత్తనాలు, ఎరువులను అందిస్తున్నా మని చెప్పారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రూ.2లక్షలపైన రుణాలు తీసుకున్న రైతులకు షెడ్యూలు ప్రక టించి మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 26వ తేదీన రైతు భరోసా కింద రూ.12వేలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. మహిళలు మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని రంగా ల్లో రాణించేందుకు సాంకేతిక రంగాన్ని ఉపయో గించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల స్కూల్ యూనిఫార్మ్స్ కుట్టేందుకు మహిళా సంఘాలకు ఇచ్చామని, నెట్ ద్వారా శిక్షణ తీసుకున్న వారికి మండలాల వారిగా యూనిట్‌గా ఏర్పాటు చేసి పనిని కల్పిస్తామని చెప్పారు. ఆదాయ మార్గాన్ని అన్వేషించి పని చేసుకుంటూ పోతే ఆర్థిక అభి వృద్ధి సాధ్యమవుతుందని మహిళలకు పిలుపుని చ్చారు. అనంతరం శిక్షణ పొందిన 30 మంది మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు అందజే శారు. ఈ కార్యక్రమంలో కేడిసిసి బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో రామ్మూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, దేవేందర్ రావు, కొహెడ, సైదాపూర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, బోయిని నిర్మల, దొంత సుధాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ప్రజా ప్రతినిధులు, తది తరులు పాల్గొన్నారు.

## అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి డిమాండ్




ప్రజాపక్షం/ కరీంనగర్ ప్రతినిధి : అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని సిపిఐ జాతీ య కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐటియుసి ప్రజా సంఘాల జనరల్ బాడీ సమావేశాన్ని కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చాడ వెంకట రెడ్డి హాజరై మాట్లాడుతూ దేశంలో అసంఘటితంగా కార్మికుల కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని కోరారు. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం సంస్కరణల పేరుతో 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజన చేసి కార్మికులు సమ్మె చేసే హక్కుతో పాటు పోరాటాలు చేసి సాధించుకున్న అనేక హక్కులను కాల రాస్తున్నా యని వెంటనే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని విమర్శిస్తూ రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కార్మికవర్గాన్ని ఐక్యం చేసి బిజెపి ప్రభుత్వంపైన పోరాటాలు చేయక తప్ప దని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఎఎన్ఎం, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకట స్వామి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రంగాల కార్మికులను ఐక్యం చేసి ఎఐటియూసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని కార్మిక వర్గం కలిసి కట్టుగా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, జిల్లా ఆఫీస్ బేరర్స్, కార్యవర్గం కాసెట్టి లక్ష్మ య్య, పిట్టల సమ్మయ్య, పిట్టల శ్రీనివాస్, డి.రజిత, ఎ.రజిత, సాయిలు, రజిత, అంజయ్య, రాజయ్య, కొము రయ్య, నరసయ్య, శ్రీనివాస్, వీరయ్య, పోషయ్య, ఉమా శంకర్, ఐలయ్య, లింగయ్య, బాలయ్య, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రైతులు, రైతు కూలీలకు పంచాయితీ పెట్టేలా బిఆర్ఎస్ కుట్రలు

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను విఫలం చేసే కుట్రలు అడ్డుకోవాలి

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : కూలీ భరోసాను విఫలం చేసే కుట్రకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తు న్నాయని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూర్య సీతక్క అన్నారు. రైతులకు కూలీలకు పంచాయతీ పెట్టేలా బిఆర్ఎస్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై అనవసర రాజకీయాలు తగ దని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హితవు పాలికారు. కూలీలకు రూపాయి సహాయం చేయని బిఆర్ఎస్ పెద్దలు సైతం విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అర ఎకరం ఉన్న రైతు కన్నా, ఏ భూమి లేని కూలీకే అధిక లబ్ధి చేకూరు తుందని కూలీలను అవమానపరిచేలా బిఆర్ఎస్ మాట్లాడుతోందని విమర్శించారు. రైతులకు రుణ మాఫీ చేయని బిఆర్ఎస్ ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తోందని మంత్రి దుయ్యబట్టారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై వంకలు పెడుతూ బిఆర్ఎస్ పెద్దలు అభివృద్ధి నిరోధకులుగా మారు తున్నారని మంత్రి సీతక్క దుయ్యబట్టారు. గ్రామ సభల్లో కవ్వింపు చర్యలకు పాల్పడే అవకాశాలు న్నాయని, కూలీలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలే దేవుళ్లు.. అందుకే అధికారులంతా భక్తితో పని చేయాలన్నారు. బాధ్య తగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సభ ల్లో రెచ్చగొడితే అధికారులు రెచ్చిపోవద్దన్నారు. మీకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మీ వ్యక్తిగత అభిమానాలతో నిమిత్తం లేకుండా ప్రజా శ్రేయస్సు కోసం పని చేయాలని అధికారులకు మంత్రి సీతక్క సూచించారు.

**గణతంత్ర దినోత్సవం ప్రతిష్టాత్మక పథకాలు ప్రారంభించబోతున్నాం..**

గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు ప్రతిష్టాత్మక పథకాలను ప్రభుత్వం ప్రారంభించబోతోందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూర్య సీతక్క అన్నారు. సొంత భూమిలేని ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థికచేయూత అందించబోతున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇటువంటి పథకం లేదన్నారు. కూలీల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేస్తామన్నారు. కుటుంబంలో ఉండే ఉపాధి హామీ మహిళా కూలీ బ్యాంకు ఖాతాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని జమ చేస్తామన్నారు. తమది మహిళా పక్షపాతి ప్రభుత్వమని, అందుకే మహిళల ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తున్నామన్నారు. ఇలాంటి పథకాన్ని తీసుకురావడం పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు ఎంతో సంతోషం కలిగించిందని చెప్పారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ ద్వారా కూలీలకు ఆర్థిక చేయూత అందించడం సంతోషంగా ఉందన్నారు. చిన్న పొరపాటు జరిగినా పేదలకు నష్టం వాటిల్లుతోందన్నారు. అందుకే జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చారిత్రాత్మక ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను విజయవంతం చేయాలని కోరారు.

**గ్రామసభ నిర్ణయమే ఫైనల్..**

గ్రామ సభ వేదికగానే అర్హుల గుర్తింపు, లబ్ధిదారుల ఎంపిక జరగాలని మంత్రి సీతక్క అన్నారు. శాంతియుత వాతావరణంలో గ్రామ సభలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసభ నిర్ణయమే ఫైనల్ అని స్పష్టం చేశారు. గ్రామసభ నిర్ణయాన్ని శిరసావహించి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలన్నారు. మానవీయ దృక్పథంతో, సామాజిక స్పృహతో అధికారులు వ్యవహరించాలన్నారు. సాంకేతిక కారణాలతో పేదలకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. పేదలకు లబ్ధి చేకూర్చేలా, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా సామరస్య పూర్వక వాతావరణంలో గ్రామసభలు జరిపించాలన్నారు. రైతులకు రైతు భరోసా, పంటబోనస్ ద్వారా కౌలు రైతులకు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా కూలీలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమల్లో తలెత్తే లోటుపాట్లను సవరిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరా ఆత్మీయ భరోసా అందిస్తామన్నారు.

**గ్రామ సభలకు సమాయత్తం కావాలి..**

గ్రామ సభలకు ఎంపిడిఓలు, ఇతర సిబ్బందిని సమాయాత్తం చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీల ఆధార్ నెంబర్లను సరిగ్గా నమోదు చేయలేదని, డేటా నమోదులో జరిగిన పొరపాట్లను సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్లగొండలో 99 మంది పంచాయతీ కార్యదర్శులు అనుమతులు లేకుండా విధులకు నెలల తరబడి గైర్హజరయ్యారని, అందుకే వారి సర్వీస్ బ్రేక్ చేయాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. ఏ స్థాయి అధికారులైనా అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరి, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి కూడా గ్రామ సభ వేదికల ద్వారానే జరగాలన్నారు. అర్హులైన వారికి వెంటనే ఇందిరమ్మ ఇండ్ల ప్రోసిడింగ్స్ ఇవ్వాలన్నారు. అర్హుల గుర్తింపులో, లబ్దిదారుల ఎంపికలో గ్రామ సభలు వ్యక్తం చేసే అభ్యంతరాలను తమకు నివేదించాలన్నారు. గ్రామ సభ నిర్ణయాలను గౌరవించాలన్నారు.

**ములుగు నియోజకవర్గానికి నిధుల వరద**

ములుగు నియోజకవర్గానికి నిధుల వరదలా విడుదలవుతున్నాయి. మంత్రి సీతక్క కృషితో పెండింగ్ సమస్యల పరిష్కారం కొలిక్కి వస్తున్నాయి. సీతక్క చొరవతో నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేరుతున్నాయి. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం లభిస్తోంది. ఏటూరునాగరంలో బస్సు డిపో నిర్మాణానికి రూ.6.28 కోట్లు, ములుగు బస్ స్టాండ్ నిర్మాణానికి రూ.5.11 కోట్లు, మంగపేట బస్ స్టాండ్ నిర్మాణానికి రూ.51 లక్షలు, మంత్రి సీతక్క ప్రతిపాదనలకు టిజిఎస్ ఆర్‌టిసి ఆమోదం తెలిపింది. త్వరలో నిధుల విడుదల, నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని మంత్రి సీతక్క కార్యాలయ అధికారులు వెల్లడించారు.

## హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడే కార్మికులకు జీతాలు రాలే

మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలను ఖండించిన మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్: హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడే నెలల తరబడి జీతాలు రాక పంచాయతీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రి సీతక్క అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వ్యాఖ్యలను సీతక్క ఖండించారు. పంచాయతీ కార్మికుల వేతనాలపై మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావుకు లేదని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె అన్నారు. మార్చి 13, 2023న పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ల ముందు వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపిన వార్త కథనాలను మరిచారా? అని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు జీతాలియ్యకుండా అవస్థలకు గురి చేసి ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం వల్ల ప్రయోజనం శూన్యమన్నారు. పంచాయతీ కార్మికులు, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల వంటి వేల మంది చిరు ఉద్యోగులను కనీసం మీ ప్రభుత్వం గుర్తించలేదన్నారు. బిఆర్ఎస్ చేసిన తప్పులను తాము సరిదిద్దుతున్నామన్నారు. బిఆర్ఎస్ హయాంలో అన్యాయానికి గురైన వర్గాలను ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా చేస్తున్నామన్నారు. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగులకు సైతం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించే విధానాన్ని రూపొందించి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. ఇకపై 92 వేల మంది పంచాయతీ స్థాయి సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జీతాలు ఇస్తామన్నారు. అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని హరీశ్ రావుకు మంత్రి సీతక్క హతవు పాలికారు.

## కుటుంబ ఆదాయ పరిమితిని పెంచిన తర్వాతే కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: పెరిగిన ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కుటుంబ ఆదాయ పరిమితిని గ్రామీణ ప్రాంతాల్లో రూ.2.55 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.3.40లక్షలుగా సవరించిన తర్వాతనే పేదలందరికీ కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పటి వరకు రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను వాయిదా వేయాలన్నారు. ఈ విషయమై ప్రజలు గ్రామ సభలలో ప్రభుత్వాన్ని నిలదీయాలని, ఇందుకు బిఆర్ఎస్ శ్రేణులు అండగా నిలువాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులకు మళ్లీ దరఖాస్తులు పెట్టాలని చెబుతున్నారని, ఇది వరకు ఆన్‌లైన్‌లో, ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తుల పరిస్థితి ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. షరతులు లేకుండా మీసేవ, ప్రజా పాలన, కుటుంబ సర్వే దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవాలని, అందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోటి మంది వ్యవసాయం కూలీలు ఉంటే, ఆరు లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తరనడం ఇదేం న్యాయమని, కంప్యూటర్ డేటా ఆధారంగా కోతలు విధించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇజిఎస్‌తో నిబంధనలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఆదిలాబాద్, బేల మండలం సైదాపూర్ గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్, అధికారంలోనికి రాగానే అర హామీనే అమలు చేసిందని ఎద్దేవా చేశారు.

## 'రైతుబంధు' పేరుతో రైతులను నట్టేట ముంచిన బిఆర్ఎస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో రైతులకు చేసిన రుణమాఫీ మొత్తం రూ.28,053.94 కోట్లుకాగా ఇందులో నుంచి వడ్డీ రూపంలో తిరిగి రూ.11,145 కోట్లు బ్యాంకులకే రైతులు చెల్లించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2.00 లక్షల లోపు రుణాలున్న అర్హులైన 25,35,964 మంది రైతులకు సంబంధించి ఉన్న రూ.20,616.89 కోట్లు నెలలోపే రుణ మాఫీ చేయగా, ఆ తర్వాత మరో 3,13,896 మంది రైతులకు రూ. 2747.67 కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. మిగిలిన అర్హులైన రైతులకు రుణ మాఫీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అదే బిఆర్ఎస్ నాయకులు రైతు బంధు పేరుతో రైతులను పూర్తిగా నట్టేట ముంచి ఇప్పుడు రైతు దీక్షలతో పేరుతో చేస్తున్న కొత్త కొత్త విన్యాసాలను చూసి రాష్ట్ర రైతాంగం నవ్వుకుంటోందని ఎద్దేవా చేశారు. 10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని రైతులు బిఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు గుర్తుకు రావడం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు. రైతు బంధును నాట్లు వేసేటప్పుడు ఇచ్చాం అంటున్న బిఆర్ఎస్ నాయకులు గడిచిన 10 ఏళ్లలో కాలంలో ఒక్కటి రెండు సార్లు మినహా ఎప్పుడెప్పుడు ఇచ్చారో ఓసారి గుర్తు చేసుకుంటే బాగుంటుందన్నారు. రైతుబంధు పేరు చెప్పి బిఆర్ఎస్ నేతలు పంటల భీమా, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలకు తిలోదకాలు ఇవ్వడమే కాకుండా రైతులు పంట నష్టపోయిన పుడు ఏనాడైన వారిని ఆదుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. గత 10 ఏళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఏమి చేసింది, ఈ ఏడాదికాలంలో కాంగ్రెస్ ఏమి చేసిందో రైతన్నలు అంతా గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

**దశలవారిగా రుణమాఫీతో రైతులపై రూ.11,145 కోట్లు వడ్డీ భారం :**

బిఆర్ఎస్ 2014లో అధికారం చేపట్టిన 5 ఏళ్ల కాలంలో 2014–15లో రూ.4040 కోట్లు, 2015–16లో రూ.4040 కోట్లు , 2016–17లో రూ. 4025 కోట్లు, 2017–18లో రూ.4038 కోట్లు, రుణమాఫీ చేశారన్నారు. రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత 2018 రుణమాఫీకి సంబంధించి నాలుగు విడతలుగా 2021 లో రూ.408 కోట్లు, 2022 లో రూ.1339 కోట్లు,2023 24లో ఎన్నికల వేళ ఓఆర్ఆర్‌ను కుదువపెట్టి రూ. 10162 కోట్లు మొత్తం 21,35,557 మంది రైతులకు రూ. 11,909.31 కోట్లు మాత్రమే రుణ మాఫీ చేశారని తెలిపారు. మరో 20,85,832 మంది రైతులకు సంబంధించిన రూ.8378.97 కోట్లు రుణమాఫీ చేయనేలేదన్నారు. ఆ రుణమాఫీని కూడ ఏకకాలంలో చేయకపోవడంతో రైతులపై రూ.8515 కోట్లు అధిక వడ్డీ భారం పడిందని, దీంతో రైతుల అప్పులు తీరింది కేవలం రూ. 3530.34కోట్లు మాత్రమేనని మిగతాదంతా వడ్డీ కిందికే పోయిందన్నారు. 2014 రుణమాఫీకి సంబంధించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం 35,31,913 మంది రైతులకు రూ. 16,143.94 కోట్లను 4ఏళ్ల వ్యవధిలో చేయడంతో రైతులపై రూ.2630 కోట్లు అధిక వడ్డీ భారం పడిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

**నెలలోపే రూ.20,616.89 కోట్లు రుణమాఫీ :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామి మేరకు 2024 రుణ మాఫీ కింద ఏక కాలంలో రూ. 2.00 లక్షల లోపు రుణాలున్న అర్హులైన 25,35,964 మంది రైతులకి రూ. 20,616.89 కోట్లు నెలలోపే మాఫీ చేసిందని తెలిపారు.

**రైతు దీక్ష పేరుతో కొత్త కొత్త విన్యాసాలు**

అదేవిధంగా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి అర్హులైన 3,13,896 మంది రైతులకు రూ. 2747.67 కోట్లు రుణ మాఫీ చేశామని చెప్పారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం భారతదేశంలోనే ఏ ఒక్క రాష్ట్రంలో ఖర్చు పెట్టని విధంగా ఏడాది కాలంలోనే రైతుసంక్షేమం కోసం ప్రత్యక్షంగా 29,897 కోట్లు, మరో 32,000 కోట్లు మద్ధతు ధరలో పంటల సేకరణకు, ఉచిత విద్యుత్‌కి ఖర్చు చేశామని వెల్లడించారు. పచ్చి రొట్ట విత్తనాల సబ్సిడి 64.65 కోట్లు బకాయిల విడుదల, ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహక సబ్సిడి 156 కోట్లు. ఇలా వివిధ పథకాల కింద గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలన్నింటిని ఒక్కొక్కటిగా చెల్లిస్తూ, గత పదేళ్ల కాలంలో నిలిచిపోయిన అన్ని పథకాలను పునరుద్ధరిస్తున్నామన్నారు. పామాయిల్ మద్ధతు ధర రూ.12,000కు పడిపోతే మద్ధతు ధరను పెంచేందుకు గత ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాల వల్ల మద్ధతు ధర టన్నుకు రూ.12,300 నుండి రూ. 20,506కి పెరిగిందని తెలిపారు. వీటితో పాటు యాంత్రీకరణ 2020–21 నుండి యంత్రాల మరియు పనిముట్ల సరఫరా నిలిపివేయగా, ఈ పథకాన్ని పునరుద్ధరించి, రైతులకు సబ్సిడీపై యంత్రాలను అందిస్తున్నామని మంత్రి తుమ్మల చెప్పారు.

## పేర్ల మార్పు, పర్యాయ పదాల చేర్పునకు.. ముగిసిన అభ్యంతరాల గడువు




ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి కమిషన్ ఈనెల 3వ తేదీన ఎనిమిది కులాలకు సంబంధించి పేర్లలో మార్పు, పర్యాయ పదాలు జోడింపునకు నోటిఫికేషన్ ఇచ్చింది. విజ్ఞప్తుల స్వీకరణకు 15 రోజుల సమయం కేటాయించింది. ఈ గడువు శనివారంతో ముగిసింది. మొత్తంగా ఆయా కుల సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని తమ తమ అభ్యంతరాలను, విజ్ఞప్తులను అఫిడవిట్ రూపంలో ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో సమర్పించారు. దాదాపుగా 500కు పైగా అభ్యంతరాలను, విజ్ఞప్తులను అఫిడవిట్ రూపంలో కమిషన్ స్వీకరించింది. కమిషన్‌కు వచ్చిన ఈ అఫిడవిట్‌లను కూలంకషంగా పరిశీలించి, తెలంగాణ కులాల సంస్కృతికి భంగం కలగకుండా, ముఖ్యంగా సమాజంలో తిట్టు పదాలుగా ఉన్న కొన్ని కులాల పేర్ల మార్పు విషయంలో ఒక నిర్ణయం తీసుకోవాలని కమిషన్ భావిస్తుంది. భవిష్యత్‌లో ఆయా కులాలకు సంబంధించిన విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు ఎలాంటి న్యూనత భావానికి గురికాకుండా ఉండేలా కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా బూంజువ కులం విషయంలో జిల్లాల పరిమితులను ఎత్తివేయాలని, గొర్రెలు, మేకలు పెంపకం కుల వృత్తిగా గల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ధన్గర్ అనే కులం వారిని బిసి జాబితాలో చేర్చాలని ఆయా కులాల ప్రతినిధులు కోరారు. కుల సంఘాలతో జరిగిన ఈ చర్చలలో బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, సతీష్ కుమార్, స్పెషల్ ఆఫీసర్, లక్ష్మి నారాయణ, రీసెర్చ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## అరణ్యాన్ని వీడండి ఆదరిస్తాం: ఎస్‌పి

లొంగిపోయిన 22 మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు



ప్రజాపక్షం/భద్రాచలం : అరణ్యాన్ని వీడి జన జీవనంలోనికి వస్తే తప్పకుండా ఆదరిస్తామని, మీ జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు బాధ్యత తీసుకుంటామని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. శనివారం చర్ల పోలీస్ స్టేషన్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా, ఎర్రపల్లి ఆర్‌పిసికి చెందిన 22 మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు ఎస్‌పి ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ ఆవరణలో లొంగిపోయి, అజ్ఞాతంలో ఉన్న మావోయి స్టు పార్టీ సభ్యుల కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభు త్వం పునరావాసాన్ని అందిస్తుందని, ఇందుకు ఆకర్షితులై 22 మంది మిలీషియా సభ్యులు లొంగిపోయారన్నారు. లొంగిపోయిన వారికి వెంటనే పునరావాస ప్యాకేజీని అందించేందుకు కృషి చేస్తామని, గత ఏడాది అజ్ఞాతాన్ని వీడి 36 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారని, మిగతా వారు కూడా లొంగిపోయి కుటుంబాలతో సంతోషంగా గడపాలన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాం తంలో నివశించే ఆదివాసీ ప్రజలకు జిల్లా పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విద్య, వైద్యం, రవాణా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తూ చదువుకునే యువత ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేస్తామని, ప్రధానంగా వారు ఎదుర్కొంటున్న కుల ధృవీకరణ పత్రాల మంజూరీ విషయంలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా ప్రయత్నిస్తామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివశించే ప్రజలకు అన్ని రకాల పథకాలు అందేలా చూస్తామని చెప్పారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని ఆయన ఈ సందర్భంగా కోరారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో ఏర్పాటు చేసిన సహపంక్తి విందులో పోలీసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు కృషి చేసిన చర్ల, దుమ్ముగూడెం సిఐలు రాజువర్మ, అశోక్, ఎస్ఐ నర్సిరెడ్డిని, పోలీస్ సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

## బిజెపితో రాజ్యాంగానికి ప్రమాదం



మీడియా సమావేశంలో రేణుకాచౌదరి

ప్రజాపక్షం/ఖమ్మం : బిజెపితో భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన కేంద్ర మంత్రులు రాజ్యాంగాన్ని గౌరవించడం లేదని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజల కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీని బదనాం చేస్తుందని, బిజెపి కండ బలం ప్రదర్శిస్తుందని ఆమె ఆరోపించారు. శనివారం ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరుతో బిజెపి ప్రజలను మభ్యపెడుతుందని రాహుల్ గాంధీపై అనవసర ఆరోపణలు చేస్తుందని ఆమె తెలిపారు. రాజ్యాంగాన్ని వక్రీకరిస్తూ ఈడి, సిబిఐలను ముఖ్యమంత్రులపైకి, ప్రజాప్రతినిధులపైకి ఉసిగొల్పుతుందన్నారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఈడి, సిబిఐలను విపక్ష నాయకులపైకి ఉసిగొల్పుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ నేతలు భారత రాజ్యాంగాన్ని నమ్మి ప్రమాణం చేరని అటువంటి వ్యక్తులు భారత రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షిస్తారని రేణుకాచౌదరి ప్రశ్నించారు. పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను దూషిస్తే ఇంతవరకు చర్యలు తీసుకోకపోగా దానిని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్ధవంతంగా పని చేస్తుందని ఈ ప్రభుత్వానికి సహకరిస్తే బిఆర్ఎస్‌కు మనుగడ ఉంటుందని లేదంటే అంతర్థానమవుతుందని ఆమె హెచ్చరించారు. జైలుకు వెళ్లేందుకు కేసిఆర్ కుటుం బం క్యూలో నిలబడిందని కూతురు వెళ్లి వచ్చిందని ఇంకా వెళ్లాల్సిన వారు ఉన్నారని ఆమె తెలిపారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టు సర్వేకు ఈనెల 23న కేంద్ర బృందం వస్తుందని పలు మార్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రిని కలిసి కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుపై చర్చించినట్లు ఆమె తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటైతే కార్గో ద్వారా ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశం ఉందని ఆమె తెలిపారు. సేంద్రియ ఎరువులను వినియోగించి సాగు చేయాలని, ఆర్గానిక్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని ఆమె తెలిపారు. భారతదేశ ప్రతిష్టతకు, ఆర్థికాభివృద్ధికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కృషి చేశారని ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నాయకులు మానుకొండ రాధాకిషోర్, వెంకటరత్నం పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **THOUTAM SHIRISHA (old name),** R/o.H. No. 1-1-786, Siddartha Nagar, Kazipet, Hanumkonda Dist, pin-506004, Telangana State, India. here by declare that I have changed my name **USHAKOYALA SHIRISHA (new name)** for all purpose.

**వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయము, హైదరాబాద్.**

నెం.వ్య.మా.క./హై / MMC/A/c/2024-25 తేది. /01/2025

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ పరధిలో గల మహబూబ్ మాన్షన్ కాంప్లెక్స్, మలక్‌పేట్ మార్కెట్ యార్డు యందు ఒక్క సంవత్సరం కాల వ్యవధికి గాను ఈ దిగువ తెలిపిన టెండర్ నిర్వహణకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్ర. సం. | టెండరు పేరు | టెండరు షెడ్యూలు ఫారం ధర | ధరావత్తు (EMD) రూ. | టెండరు షెడ్యూలు సరఫరా చేయు తేది మరియు సమయము | టెండరు షెడ్యూలు దాఖలు చేయు చివరి తేది మరియు సమయము | టెండరు తెరువబడు తేది మరియు సమయము |
|---|---|---|---|---|---|---|
| 1 | వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ మలక్‌పేట్ మార్కెట్ యార్డు నందు గల 42.00 ఎకరములు (శ్రీ కృపా మార్కెట్ మలక్ పేట్ గంజ్) లో చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుట మరియు చెత్తను మార్కెటు బయటకు తరలించుటకు గాను | రూ. 3,000/- | రూ. 2,00,000/- | 23-01-2025 నుండి 24-01-2025 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు | 25-01-2025 రోజున మధ్యాహ్నం 11.00 గంటల వరకు | 25-01-2025 రోజున మధ్యాహ్నం 11.30 గంటలకు |

నిబంధనలు:-

1. ఇట్టి టెండర్ షెడ్యూలు కొరకు పై తెలిపిన ప్రకారం డి.డి. రూపేన సెలక్షన్ Selection Grade Secretary, Agril. Market Committee, Hyderabad గారి పేరున తీసి వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్, మలక్‌పేట్ కార్యాలయము నందు లిఖితపూర్వ ధరఖాస్తుతో జతపరచి టెండర్ షెడ్యూల్ ఫారం పొందవచ్చును. DD లను టెండర్ వేయువారి పేరున మాత్రమే ఉండవలెను. ఇతరుల పేరు పై ఉన్న DD లను తిరస్కరించబడును.
2. పై తెలిపిన టెండర్ నిర్వహణకు కొరకు, టెండర్ షెడ్యూల్ ఫారం ధర మరియు ధరావత్తు (EMD) లను డి.డి. రూపేన మాత్రమే Selection Grade Secretary, Agril. Market Committee, Hyderabad పేరున మాత్రమే డి.డి.లు తీయవలెను, అట్టి డి.డి.లను ధరఖాస్తుతో పాటు జతపరిచి టెండర్ షెడ్యూలు ఫారంను పొందవలెను.
3. 42.00 ఎకరములు (శ్రీ కృపా మార్కెట్ మలక్‌పేట్ గంజ్) యందు ఏర్పడిన చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయుటకు గాను స్వంత / లీజుకు తీసుకొనబడిన డంపింగ్ యార్డు ఉండవలెయును. దాని ఒప్పంద పత్రములను టెండర్ ఫారంతో పాటు సమర్పించవలెను.
4. గార్బేజ్ లిఫ్టింగ్ కొరకు 200 సి.సి.టి capacity గల రెండు టిప్పర్ వాహనములు ఉండవలెయును అట్టి వాహనముల ఆర్.సి జిరాక్స్ కాపీలను మరియు 10 మందికి తక్కువ కాకుండా లేబర్ కలిగియుండవలెను. వారి యొక్క ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను టెండర్ ఫారంతో పాటు సమర్పించవలెను.
5. GST రిజిస్ట్రేషన్, లేబర్ లైసెన్స్ మరియు కాలుష్య నియంత్రణ బోర్డు వారి యొక్క ధ్రువికరించిన పత్రములను పత్రములను టెండర్ ఫారంతో పాటు సమర్పించవలెను.
6. పై తెలిపిన టెండర్ నిర్వహణకు ఏదైనా ప్రభుత్వ సంస్థలో కనీసం (2) సంవత్సరముల అనుభవం కలిగి ఉండవలెయును.


అసంపూర్తిగా ఉన్న టెండర్ గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు గాని చెక్కులు సమర్పించిన టెండర్ గాని, టెండర్ దారు పేరున DD లేని DD లను తిరస్కరించబడును మరియు ఎలాంటి కారణము చూపకుండా టెండర్ రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు. ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు దినములలో ఉదయము 10.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ నందు సంప్రదించవచ్చును.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్.

DIPR R.O. No. : 9270-PP/CL/ADVT/1/2024-25, Date: 18-01-2025




## ఎక్కడ చూసినా ఇదే వార్త!



ఇప్పుడు ఎక్కడ చూసినా 'గ్రహాల పరేడ్' వార్తే. సోషల్ మీడియా హోరెత్తిస్తున్నది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు కూడా ఊదరగొడుతున్నాయి. ఈ ఏడాది రెండు పర్యాయాలు ఆరు గ్రహాలు ఒకే వరుసలో కనువిందు చేయనున్నాయని క్రమం తప్పకుండా గుర్తుచేస్తునే ఉన్నాయి. ఇది తరచు సంభవించని ఘటనే తప్ప, అత్యంత అరుదైనది మాత్రం కాదు. ఏదిఏమైనా, ఈనెల 21వ తేదీన ఆకాశంలో ఆరు గ్రహాలు ఒకే వరుసలో దర్శనమివ్వనున్నాయి. శని (Saturn), బృహస్పతి (Jupiter), అంగారకుడు(Mars), శుక్రుడు (Venus), నెప్ట్యూన్ (Neptune), యురేనస్ (Uranus) గ్రహాలు ఒకే వరుసలో కనువిందు చేయనున్నాయి. యురేనస్, నెప్ట్యూన్‌లను చూడాలంటే టెలిస్కోప్ తప్పనిసరి. ఈ గ్రహాలన్నీ ఒకే వరుస క్రమంలో దర్శనం ఇవ్వడం ఒక గొప్ప అనుభూతినిస్తుంది. అంటే ఆ సమయం లో ఈ గ్రహాల అమరిక సూర్యుడికి ఒకవైపున జరుగుతుంది. ఈ ఖగోళ అద్భుతం ఫిబ్రవరి 2వ తేదీన కూడా కనిపిస్తుంది. ఈ గ్రహాల పరేడ్ దాదాపుగా నాలుగు వారాల పాటు ఆకాశంలో కనువిందు చేస్తుంది. సూర్యాస్తమయం అయ్యాక ఈ గ్రహాలు ఆకాశంలో చాలా స్పష్టంగా కనిపిస్తాయి. అంటే, రాత్రి 8:30 గంటల ప్రాంతంలో ఈ ప్లానెట్ పరేడ్ అత్యంత సుందరంగా గోచరిస్తుంది. అయితే ఇవి స్పష్టంగా కనిపించడం అనేది కొన్ని అంశాలపై ఆధారపడి ఉంటుంది. స్థానిక వాతావరణం, ఆ ప్రాంతంలో కాలుష్యం వంటి అంశాలు కీలకం కానున్నాయి. కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఈ సుందర దృశ్యం స్పష్టంగా కనిపించే అవకాశాలు తక్కువ. అయితే కాంతి, కాలుష్యం తక్కువ స్థాయిలో ఉండే ప్రదేశాల్లో ఈ గ్రహాల అమరిక స్పష్టంగా కనిపిస్తుంది కాబట్టి, వీలైనంత వరకూ గ్రామీణ ప్రాంతాల నుంచి వీక్షించడం మేలు.

**8 గ్రహాల కవాతు ఎప్పుడు?**

మన సౌర కుటుంబంలోని ఆరు గ్రహాల కవాతును చూసే అవకాశం చాలా సందర్భాల్లో సాధ్యమవుతుంది. అయితే, ఎనిమిది గ్రహాలను ఒకే క్రమ వరుసలో ఎప్పుడు చూస్తాం? శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం కనీసం 396 బిలియన్ సంవత్సరాలకు ఒకసారి ఇలాంటి అద్భుతం జరిగే అవకాశం ఉంది. కానీ, ఖచ్చితంగా జరుగుతుందని చెప్పలేం. ఇది సంభావ్యతను సూచిస్తుందే తప్ప వాస్తవాన్ని కాదన్నది నిజం. సూటిగా చెప్పాలంటే, ఎనిమిది గ్రహాలు ఒకే వరుసలో గతంలో ఎన్నడూ కనిపించలేదు... భవిష్యత్తులో ఎప్పుడూ కనిపించదు.

## వీధి కుక్కల వీరంగం..



వీధి కుక్కలు సృష్టించే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. చిన్నారులపై దాడిచేసి చంపేసిన ఘటనలు లేకపోలేదు. తాజాగా ఓ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. జలంధర్ (పంజాబ్)లో జరిగినట్టు చెప్తున్న ఈ వీడియోలో, ఒక వృద్ధ మహిళపై కుక్కలు దాడి చేస్తాయి. వాటి నుంచి తప్పించుకోవడానికి ఆమె ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. నలువైపుల నుంచి దాడి కొనసాగడంతో ఆ వృద్ధురాలు కిందపడిపోయింది. ఆమెను అవి కొంతదూరం ఈడ్చుకుపోయాయి. అదృష్టవశాత్తు ఈ దారుణాన్ని గమనించిన స్థానికులు కర్రలు తీసుకొని బెదిరించడంతో కుక్కలు పారిపోయాయి. అత్యంత భయానకంగా, హృదయవిదారకంగా కనిపిస్తున్న ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో, నెటిజన్లలో ఆగ్రహం, ఆందోళన వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఉన్న ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## తాతతో పరాచికాలా..




అతను 84 ఏళ్ల వృద్ధుడు... పైగా ఒక లాండ్రీలో ఒంటరిగా ఉన్నాడు... అదే అదను అనుకున్న ఓ ముసుగు దొంగ ఆయుధాన్ని చూపిస్తూ, అతన్ని బెదిరించే ప్రయత్నం చేశాడు. నిలువు దోపిడీ చేయవచ్చని ఆశించాడు. కానీ, అనుకోని ఘటనకు విస్తుపోయాడు. ఆ



వృద్ధుడు తిరగబడడంతో ఏం చేయాలో అర్థం కాలేదు. కనీసం చేతికి దొరికిన జీన్స్ ప్యాంట్లను తీసుకొని ఉడాయించాలని అనుకున్నాడు. కానీ, అది కూడా సాధ్యం కాలేదు. జీన్స్‌ను గట్టిగా పట్టుకున్న ఆ వృద్ధుడి నుంచి తనను తాను కాపాడుకోవడానికి దొంగ నానా తంటాలు పడ్డాడు. అతి కష్టంమీద పట్టు వదిలించుకొని, బతుకు జీవుడా అనుకుంటూ బయటకు పరుగులు తీశాడు. ఈ దృశ్యాలన్నీ సిసిటివిలో రికార్డు కావడంతో, ఆ వృద్ధుడు ఎవరనే ఆరా మొదలైంది. ఆ తర్వాత టైమ్స్ పత్రిక వివరాలు ప్రకటించడంతో, వివరాలు తెలిశాయి. ఉత్తర ఇంగ్లాండ్‌లోని రోథర్‌హామ్ సమీపంలోని మాల్ట్‌బైలో ఉన్న కాయిన్‌అప్ లాండ్రీలో ఈ ఘటన చోటు చేసుకుంది. దొంగను ఎదిరించిన వృద్ధుడిపేరు రాన్ క్రోకర్. మీడియా ప్రతినిధులంతా ఇప్పుడు క్రోకర్ ఇంటర్వ్యూ కోసం క్యూ కడుతున్నారు. మరోవైపు రోథర్‌హామ్ పోలీసులు 42 ఏళ్ల అనుమానితుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. తాత ధాటికి పారిపోయిన ఆ వ్యక్తిని చూడడానికి కూడా మీడియా ప్రతినిధులు ఆసక్తి చూపుతున్నారు. ఏదిఏమైనా, క్రోకర్‌తోపాటు ఆ దొంగ కూడా సెలబ్రిటీగా మారిపోయాడు.

## వేలానికి ఒలింపిక్స్ పతకం!




ఒలింపిక్స్ పతకం ఒకటి వేలానికి వచ్చింది. అత్యంత అరుదైన ఆ పతకం 545,371 డాలర్లు (సుమారు 4,72,16,312 రూపాయలు) ధర పలికింది. అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రం, బోస్టన్ నగరంలోని ఆర్‌ఆర్ కేంద్రంలో ఈ పతకాన్ని వేలం వేశారు. 1904 సెయింట్ లూయిస్ ఒలింపిక్స్ పురుషుల 110 మీటర్ల హార్డిల్స్‌కు సంబంధించిన పదాలు ఆ పతకంపై లిఖించి ఉన్నాయి. 'ఒలింపియాడ్ 1904' అనే రాసి ఉన్న ఆ స్వర్ణ పతకంపై, విజేత అథ్లెట్ పుష్పగుచ్ఛాన్ని పట్టుకున్న బొమ్మ ఉంది. మరోవైపు గ్రీకు పురాణాలలోని విజయ దేవత నైట్, దేవతల పాంథియోన్ రాజైన జోస్‌తోపాటు కనిపిస్తాడు. అమెరికా అథ్లెట్ ఫ్రెడ్ షులేకు దక్కిన ఈ స్వర్ణ పతకాన్ని, అతని కుటుంబ సభ్యులు వేలానికి ఉంచారు. ఇప్పుడు ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం అంటే, వెండి పతకంపై బంగారు పూతతో ప్రదానం చేస్తున్నారు. అప్పట్లో పతకం సైజు చిన్నదిగా ఉన్నప్పటికీ, దానిని పూర్తి మేలిమి బంగారంతో తయారు చేసేవారు. 120 సంవత్సరాల చరిత్ర ఉన్న ఆ పతకాన్ని మెడలో వేసేందుకు ఉపయోగించిన రిబ్బన్, దానిని దాచేందుకు ఇచ్చిన లెదర్ కేస్‌ను కూడా వేలం పాడుకున్న వ్యక్తికి నిర్వాహకులు అందచేశారు. 1904 ఒలింపిక్స్‌లో అమెరికా 96 ఈవెంట్స్‌లో పాల్గొని, 78 ఈవెంట్స్‌లో పతకాలు కైవసం చేసుకుంది.

## అంతులేని నిర్లక్ష్యం!




క్రాకోవ్ (పోలాండ్)లోని బాలిస్ విమానాశ్రయంలో ఓ మహిళను అధికారులు నిలిపివేశారు. దేశంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. వివిధ దేశాలను పర్యటిస్తూ, లండన్ చేరుకున్న అమెరికాకు చెందిన ఆ మహిళా ప్రయాణికురాలు, అక్కడి నుంచి క్రాకోవ్‌లోని బాలిస్ విమానాశ్రయానికి వచ్చింది. ఆమెవద్ద పాస్‌పోర్ట్‌తోసహా అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. అయినప్పటికీ పోలాండ్ భద్రతా సిబ్బంది ఆమెను దేశంలో అడుగుపెట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు. విషయం ఏమిటంటే, ఆమె తాను తిరిగిన వివిధ ప్రదేశాల వివరాలన్నీ పాస్‌పోర్ట్ కాగితాలపై నోట్స్ రూపంలో రాసుకుంది. నిబంధనలను అనుసరించి పాస్‌పోర్ట్ కాగితాలపై, వీసా స్టాంపింగ్ కింద ఖాళీగా ఉన్న ప్రాంతంలో రాయడం నిషిద్ధం. కానీ, ఆ మహిళ అంగుళం ఖాళీ లేకుండా పాస్‌పోర్ట్ కాగితాల నిండా తన యాత్ర విశేషాలు రాసుకుంది. ఈ అంతులేని నిర్లక్ష్యం పట్ల పోలాండ్ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పాస్‌పోర్ట్ లేదా ధ్రువీకరణ పత్రాలపై రాయడానికి అనుమతి లేదనే విషయం తనకు తెలియదంటూ సదరు మహిళ ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోలేదు. ఆమెను తిరిగి లండన్ పంపించేశారు. వ్యక్తిగత గోప్యత కారణాలతో ఆమె పేరును అధికారులు వెల్లడించలేదు.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# అర్హులకే పథకాలు

ప్రజాపక్షం
19-01-2025, ఆదివారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో వివిధ ప్రజా విభాగాలకు ఎన్నో ఉచిత సహాయ పథకాలు ప్రకటించినప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా అమలు చేసే సమయంలో 'అర్హులకే' ఉచిత సంక్షేమ, సహాయ కార్యక్రమాలు అనే సరైన విధానాన్ని ధైర్యంగా నిర్ణయించింది. ధైర్యం అనే పదం ఎందుకు ఉపయోగిస్తున్నామంటే గత టిఆర్‌ఎస్/బిఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో పాలక పార్టీగా ఉన్న బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వం పై, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఊపిరి సలుపుకోనివ్వకుండా పథకాల అమలుపై, అమలుకై దాడిచేస్తున్నాయి. బిఆర్‌ఎస్ ప్రభుత్వకాలంలో గొర్రెలైనా–బర్రెలైనా, రైతుబంధు అయినా, రైతు బీమా అయినా, దళితబంధు అయినా – ఇంకా అనేక ఉచితాల పంపిణీ కార్యక్రమాలైనా ఏదీ ఒక ముందస్తు ప్రణాళిక, పార్టీలో, ప్రభుత్వంలో చర్చ – ఆమోదం ద్వారా అమలులో పెట్టినవికావు. అన్నీ నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సమయోచిత నిర్ణయాలే. లక్ష కోట్లు ఖర్చు పెట్టినా నిరుపయోగంగా ఉన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రూపశిల్పి, నిర్మాణంలో మార్పు–చేర్పులు అన్నిటికీ కర్త, భర్త కెసిఆర్‌గారే కదా! ఆయన ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న యువనేత తారక రామారావు తండ్రిచాటులోనే ఇ–కార్ రేస్‌ను హైదరాబాద్‌కు రప్పించినందుకు రూల్సును తుంగలోతొక్కి హెచ్‌ఎండిఎనుండి రూ.50 కోట్లను ఏకపక్షంగా విదేశీ కంపెనీకి తరలింపజేయటంలో ఆశ్చర్యమేముంది? పైగా ఆ తప్పును 'ఘనత'గా సమర్థించుకుంటూ రేవంత్ రెడ్డిపై ఎదురుదాడి చేయటం, సవాళ్లు విసరటం అపహాస్యంగా ఉంది. రైతు బంధు అమలూ అంతే. భూమి ఎవరిపేరుతో ఉంటే వారికి, అది వారి అనుభవంలో ఉందా లేదా, సాగులో ఉందా లేక వినియోగరూపం మారిందా పరిశీలనలేకుండా ప్రభుత్వ ధనాన్ని దుబారా చేశారు. 'మీరూ మినహాయింపులు లేకుండా మా లెక్కనే ఇవ్వాలంటూ' కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ వారు లొల్లి పెడుతున్నారు. రుణ మాఫీ కూడా అట్లనే నిక్కి నీల్గి రెండు ప్రభుత్వాల్లో రెండేళ్లలో అమలు చేశారు. 5 ఎకరాలలోపు సాగుభూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకే వర్షాభావ కాలాల్లో భూమిశిస్తు రద్దు, సహాయ పథకాలు వర్తింపజేసే ప్రణాళికాసంఘం నిర్దేశన దేశంలో ఎప్పటి నుంచో అమలులో ఉంది. రెండోవైపున, అట్టడుగు, బలహీన తరగతుల కు ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలు ఉచిత సహాయ పథకాలు ప్రకటించటాన్ని 'రేవడీ'లని (మితాయిలు) ఎద్దేవా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు–పదేళ్లలో నిర్మాణం చేసే అనేకానేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయటంతోపాటు ప్రతిపక్ష పార్టీల వాగ్దానాలను మించిన 'రేవడీలు' ప్రకటిస్తున్నారు. కాగా రాష్ట్ర బిజెపి నాయకులు రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు సహాయం చేయక పోగా, ఎన్నికల హామీలు సంపూర్ణంగా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయటంలో బిఆర్‌ఎస్‌తో పోటీపడు తున్నారు. మూసీనది 'పునరుజ్జీవ' ప్రాజెక్టును ఆదిలోనే అడ్డుకునేందుకు బిజెపి, బిఆర్‌ఎస్‌లు చేసిన కుటిల ప్రయత్నాలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయటానికి రెండు పార్టీలు పోటీపడుతున్నాయనటానికి ఒక మచ్చుతునక.

రెండు బలమైన ప్రత్యర్థి పార్టీలను రేవంత్‌రెడ్డి చాకచక్యంతో ఎదుర్కొంటూ తమ వాగ్దానాల అమలు చేయటానికి, రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే ప్రాజెక్టుల అమలుకు ప్రయత్నిస్తున్నారు. మూసీ పునరుజ్జీవం, ఫోర్త్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్‌రోడ్ నిర్మాణం, పేదలకు ఇందిరమ్మ గృహనిర్మాణం తమ ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలుగా ఆయన ప్రకటించారు.

మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లవరకు ఉచిత గృహ విద్యుత్, పేదలకు రూ.500లకే వంటగ్యాస్ సిలెండర్లు, రూ.21వేల కోట్ల మేర రైతులకు 7 నెలల్లోనే రుణమాఫీ, రైతు బీమా పునరుద్ధరణ వగైరా వాగ్దానాలు అమలు జరిపిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ జనవరి 26 నుండి మరో నాలుగు పథకాల అమలు కు శ్రీకారం చుడుతున్నది. అవి – రైతులకు పెట్టుబడి తోడ్పాటుగా అందించే రైతు భరోసా, భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు సంవత్సరంలో రూ.12వేలు సహాయం, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం లో జరిగిన దుబారా వ్యయాన్ని అరికట్టి వ్యవసాయ భూమికి మాత్రమే సంవత్సరానికి ఎకరా కు రూ.12వేలు 'రైతు భరోసా' (పూర్వం రైతు బంధు) కింద చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని బిఆర్‌ఎస్ తప్పుబట్టటం ఆక్షేపణీ యం. ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లు ఎకరాకు – కోతలు పెట్టకుండా – రూ.15వేలు చెల్లించాలని ఆ పార్టీ రోడ్డు కెక్కింది. గతంకన్నా ఎకరాకు రూ.2వేలు ఎక్కువే చెల్లిస్తున్నా ఆ పెరుగుదలను మభ్యపెట్టి రైతులను తప్పుత్రోవ పట్టించాలని చూస్తోంది. టిఆర్‌ఎస్‌కు అధికారమిస్తే దళితుణ్ణి ముఖ్యమంత్రిని చేస్తాం, దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తాం అన్న వాగ్దానాల భంగంనుంచి టిఆర్‌ఎస్ ఎన్ని వాగ్దానాలు తుంగలో తొక్కిందో, ఎన్ని అరకొరగా అమలు జరిపిందో ప్రజలు మరిచిపోయి ఉంటారని వారి నమ్మకం. భూమి పట్టా కలిగిన వారికే రైతుబంధు అని సమర్థిస్తూ, కౌలు రైతులు అనర్హులని ఘంటాపథంగా కెసిఆర్ చెప్పలేదా? ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం – గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన పనిదినాల ఆధారంగా కౌలు రైతులను గుర్తించి వారిలో కొందరికైనా రూ.12వేలు ఇవ్వనుంది. బిఆర్‌ఎస్ వారు దీనిగూర్చి మాట్లాడరేమి?

రైతు భరోసా కింద దాదాపు 65లక్షల మంది రైతులకు, 10– 11లక్షలమంది కౌలురైతులకు మేలు జరుగుతుందని అంచనా. సాగు భూమి నిర్ధారణకు 21వ తేదీనుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలకు రూ.45 వేల కోట్లు వ్యయమవుతుందని అంచనా. ఎప్పుడో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తర్వాత నిలిపివేయబడిన కొత్త రేషన్ కార్డుల మంజూరు కార్యక్రమం అదనంగా అనేక లక్షల కుటుంబాలను ప్రభుత్వ పథకాలకు అర్హులను చేస్తుంది. నియోజకవర్గానికి సంవత్సరానికి 3500 ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు (ఒక్కో ఇంటికి రూ.5లక్షలు వ్యయం) లబ్దిదారుల ఎంపిక యాప్ ద్వారా పేదల్లోకెల్లా పేదలకు ముందు లబ్ది చేకూర్చుతూ అమలు ప్రారంభిస్తున్నారు. బిఆర్‌ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూం అపార్టుమెంట్‌ల నిర్మాణం ప్రచారంలో పదోవంతు కూడా జరగలేదు. పైగా అత్యధికభాగం పంపిణీ దశకు చేరుకోలేదు. అందువల్ల బిఆర్‌ఎస్ వారి ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం, ఆందోళన ఒక స్థాయిని మించితే అది వారికే బెడిసి కొడుతుందని గ్రహించగలరు.

# తెంపరి ట్రంప్ ప్రపంచాన్ని ఎటు లాక్కెళ్తాడో?

## రేపు అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం

పెట్టుబడిదారి వ్యవస్థకు స్వర్గధామం అమెరికా సంయుక్త రాష్ట్రాల 47వ అధ్యక్షుడిగా సోమవారం నాడు ప్రమాణస్వీకారం చేయబోతున్నాడు డోనాల్డ్ ట్రంప్. జాతీయవాద, మితవాద, సామ్రాజ్యవాద ధోరణుల కలబోతతో ఇప్పటికే ఒక సారి 45వ అమెరికా అధ్యక్షుడిగా 2017–2021 వరకు తన పరిపాలన రుచిచూపించాడు ట్రంప్. తరువాతి ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు, దానిని అంగీకరించని ఉన్మత్తులైన ఆయన అభిమానులు శాసన, పరిపాలన కేంద్రాలైన క్యాపిటల్ భవనంపై ఏకంగా దాడికే దిగడం ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేసింది. అలాంటి ట్రంప్ ఈ సారి ఏమి చేస్తాడో అని ప్రపంచ దేశాలు, ప్రజలు ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆయన అధ్యక్షుడయ్యాక తన ప్రాధాన్యాంశాలను ఎన్నికల ప్రచారంలో, గెలిచిన తరువాత కూడా పునరుద్ఘాటిస్తున్నాడు. అందులో ప్రముఖమైనవి సర్వసత్తాక పొరుగుదేశం కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చేసుకుంటానని, సహజవనరులు, అరుదైన మూలకాల నిధి గ్రీన్‌ల్యాండ్స్‌ను అమెరికాలో కలుపుకుంటానని, కీలకమైన పనామా కెనాల్‌ను వెనక్కి తీసేసుకుంటామని ప్రకటించడం కలవరం రేపుతున్నది. ఇది వెర్రితలలు వేసిన ట్రంప్ సామ్రాజ్యవాద విస్తరణ కాంక్షకు దర్పణం. అంతే కాకుండా చైనా దిగుమతులపై ట్యారిఫ్‌ను 60 శాతం, కెనడా దిగుమతులపై 20 శాతం పెంచడంతో పాటు, ఇతర విదేశాల నుంచి వచ్చే వస్తువులపై కూడా టారిఫ్‌ను విపరీతంగా పెంచుతామంటున్నారు. ఇది ప్రపంచ ఆర్థిక పెట్టుబడి కేంద్రమైన అమెరికా ప్రవచిత ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలకు పూర్తిగా విరుద్ధమైనది.

### కెనడా, గ్రీన్‌ల్యాండ్స్‌ను కలుపుకోవడం సాధ్యమా?


ప్రపంచంలో విస్తీరణం(9.98 మిలియన్ స్క్వేర్ కి.మి.)లో రెండవ అతి పెద్ద దేశమైన కెనడాను తమలో కలిపేసుకుంటే అమెరికా భౌగోళికంగా రష్యాను మించి అతి పెద్ద దేశంగా మారుతుంది. ఆ దేశాన్ని అమెరికాలో విలీనం చేసుకోవాలంటే మూడు మార్గాలు ఉన్నాయి. అందులో ఒకటి ఉభయ దేశాల మధ్య ఒడంబడిక చేసుకోవడం, అందులో బ్రిటీష్ రాజు పాత్ర కూడా ఉంటుంది. లేదంటే మెజారిటీ కెనడా పౌరులు రెఫరెండం ద్వారా అమెరికాలో కలిసేందుకు అంగీకారాన్ని తెలియజేయడం రెండవ మార్గం. అదీ కాదంటే చివరగా అమెరికా బలవంతంగా కెనడాను కలిపేసుకోవాలి. ప్రస్తుత కాలంలో కాలిఫోర్నియా, నెవడా, ఉటాహ్, న్యూ మెక్సికో, ఆరిజోనా, కొలొరాడో, ఒక్లాహోమా, కాన్సాస్, వ్యోమింగ్‌లను అమెరికా ఎలా ఆక్రమించుకుందో ప్రపంచ చరిత్రకారులకు తెలిసిందే. ఇప్పుడు ఆ జాబితాలో కెనడా, గ్రీన్‌ల్యాండ్స్‌ను కూడా చేర్చాలని ట్రంప్ భావిస్తున్నాడు. ఇతర భూభాగాలను విభజించటం లేదా జయించడం ద్వారా స్వాధీనం చేసుకునే గత అనుభవా లు, అవకాశాలు అమెరికా కు పుష్కలంగా ఉన్నాయి. కెనడాను బలవంతంగా విలీనం చేసుకునే యత్నాన్ని ప్రపంచంలోని ఇతర మిలిటరీ శక్తులు అడ్డుకునే అవకాశం కూడా లేదు. ఎందుకుంటే గతంలో అమెరికా సహా మిలిటరీ శక్తిశాలి దేశాలైన రష్యా, చైనా, యుకె, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ బలవంతంగా లేదా స్వల్ప ప్రతిఘటనతో మూడవ పార్టీ భూభాగాలను తమ లో కలుపుకోవడమో, ఆక్రమించుకోవడమో చేశాయి. 1950 నుంచి 1952 వరకు టిబెట్‌పై చైనా అతిక్రమణ అత్యంత నిశ్శబ్దంగా జరిగింది. ఎందుకంటే ఈ విషయం టిబెట్ వాసులకు 1952 సంవత్సరంలో కానీ తెలియలేదు. ఇక భారతదేశంలో హైదరాబాద్, గోవా, డయ్యూ డామన్, సిక్కిం భూభాగా లు స్వాతంత్ర్యానంతరం భాగమయ్యాయి. ఇప్పటికీ యుకె ఆధీనం లో 14, అలాగే ఫ్రాన్స్‌కు యూరోప్ వెలుపల 13 విదేశీ భూభాగాలు ఆధీనంలో ఉన్నాయి. రష్యా కూడా ఉక్రెయిన్‌లో అనేక ప్రాంతాలను ఆక్రమించింది. గతంలో కెనడా బ్రిటీష్ ఆధీనంలో ఉన్నందున, ఇప్పటికీ ఆ దేశం బ్రిటీష్ రాజునే తమ రాజుగా భావిస్తుంది.

గ్రీన్‌లాండ్స్ ప్రస్తుతం డెన్మార్క్ దేశంలో స్వయంప్రతిపత్తితో కొనసాగుతుంది. దానిపై చాలా కాలంగా అమెరికా కన్నేసింది. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా కొనకుండా అడ్డుకుంటే డెన్మార్క్‌పై మరింత ట్యారిఫ్ విధిస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నాడు. డెన్మార్క్‌పై ప్రేమ కంటే ఆ దేశంలోని అపారమైన చమురు నిల్వలు, జింక్, ఐరన్, కాపర్, నికెల్, కొబాల్ట్, యురేనియంలతో పాటు నియోడైమియం, డైస్ప్రోసియం, ప్రాసియోడైమియం అనే అరుదైన మూలక నిల్వలపై ట్రంప్ కన్ను పడింది. వీటిలో బ్యాటరీ, సౌర, వాయు ఇంధన సాంకేతిక పరిజ్ఞానాలకు అవసరమైన మూలకాలు ఉన్నాయి. అలాగే ప్రపంచంలోనే అత్యధిక యురేనియం కూడా అక్కడ లభిస్తుంది. ఆర్కిటిక్ ప్రాంతంలో వ్యూహాత్మక ప్రదేశంలో ఉన్న గ్రీన్‌ల్యాండ్స్ మిలిటరీ అవసరాలకు కూడా ఉపయోగపడుతుంది. అంతే కాకుండా గతంలో అక్కడ ఖనిజాలను వెలికితీసేందుకు అనుమతించిన ఆస్ట్రేలియన్ కంపెనీలో అత్యధిక షేర్‌లను చైనా దక్కించుకుంది. ఒకవైపు గ్రీన్‌ల్యాండ్స్ భూమి పొరలలో దాగున్న అరుదైన ఖనిజాలు, మరోవైపు తమ పక్కనే ఇతర దేశం ఆధిపత్యం ఉండొద్దనే ఉద్దేశ్యం కూడా ఆ ప్రాంతాన్ని కలుపుకోవాలనే ట్రంప్ పన్నాగానికి మూలం.

ఏదైనా దేశాన్ని సైనిక శక్తితో బలవంతంగా దురాక్రమించడానికి అంతర్జాతీయ చట్టం అనుమతించదు. చాలా తక్కువ దేశాలే ఆ చట్టాన్ని పట్టించుకుంటున్నాయి. అమెరికా రాజ్యాంగంలోని ఆర్టికల్ 2, రెండవ సెక్షన్ సైతం మూడింట రెండొంతుల సెనెటర్‌ల మద్దతుతో మాత్రమే విదేశీ భూభాగాలను కలుపుకునే వెసులుబాటు కల్పిస్తున్నది.

### ఇతర దేశాలలో పరోక్షంగా దేశభక్తి రగులుస్తున్న ట్రంప్

ఇతర దేశాలకు సంబంధించి ట్రంప్ అడ్డూ అదుపూ లేకుండా చేస్తున్న తెంపరి ప్రకటనల పట్ల మొదట్లో ఆ దేశాలలో ఆందోళన వ్యక్తమైంది. నెమ్మదిగా ఆ దేశాలలోని ప్రజల్లో దేశభక్తి రగిలి, అమెరికా ఆంక్షలను, బెదిరింపులను ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్నారు. కెనడా దిగుమతులపై ట్యారిఫ్‌ను 20 శాతానికి పెంచుతామని, ఆ దేశాన్ని 51వ రాష్ట్రంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కలిపేసుకుంటామన్న ప్రకటన కెనడావాసులలో భయాన్ని కలిగించింది. ఎందుకుంటే ఆ దేశం ఆర్థిక విషయాలలో అధికంగా ఆధారపడింది అమెరికా మీదనే. ట్రంప్‌ను కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో మర్యాదపూర్వకంగా కలిసిన తరువాత తనను అమెరికా 51 రాష్ట్ర గవర్నర్ కలిసారంటూ ట్రంప్ పెట్టిన సోషల్ మీడియా సందేశం కెనడా దేశస్తులలో ఆత్మాభిమానాన్ని తట్టి లేపింది. కెనడాను 51వ రాష్ట్రంగా చిత్రికరిస్తూ అమెరికా మ్యాప్‌ను సోషల్ మీడియాలో పెట్టడంతో కెనడా వాసుల్లో ఒక్కసారిగా ఐక్యత, దేశభక్తి, అమెరికాపై ఆగ్రహం వ్యక్తమైంది. కెనడాపై టారిఫ్‌ల పెంపు ప్రతిపాదన అమెరికన్‌లకే హాని చేస్తుందని, అమెరికన్‌ల ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయని ట్రుడో ఘాటుగా ప్రతిస్పందించారు. కెనడా అమెరికా 51వ రాష్ట్రంగా మారేందుకు ఈషణ్మాత్రం అవకాశం కూడా లేదని గట్టిగా బదులిచ్చారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికా అని మారుస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలకు మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షిన్‌భామ్ దిమ్మదిరిగే జవాబిచ్చింది. తాము కూడా అమెరికాను ఇకపై మెక్సికన్ అమెరికా అని పిలుస్తామని ఎందుకుంటే గతంలో ఆ పేరుతోనే పిలిచేవారని చెప్పింది. గ్రీన్‌ల్యాండ్స్ అమ్మకానికి లేదని డెన్మార్క్ స్పష్టంగా ప్రకటించింది. నాటో దేశాలు రక్షణ బడ్జెట్‌ను పెంచాలనే ట్రంప్ ప్రతిపాదనను సైతం ఐదు యూరోపియన్ దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. జర్మనీ, బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, పోలాండ్ దేశాలు




ఇందుకు సుముఖంగా లేవు. వీటిలో మొదటి నాలుగు దేశాలు ఐరోపాలో అత్యధిక మిలిటరీ వ్యయం చేసే దేశాలు కావడం గమనార్హం.

### ప్రపంచ మితవాద నేతలకు ఆశాజ్యోతి

ప్రపంచవ్యాప్తంగా పచ్చి మితవాదులుగా ఉన్న వివిధ దేశాధిపతులు, పార్టీల అధినేతలకు ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాజ్యోతిగా కనిపిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ ఉన్నంత కాలం మితవాదులతో ప్రత్యక్ష సంబంధాలు నెరిపిన దాఖలాలు పెద్దగా లేవు. దీంతో వారంతా ఒకరికొకరుగా మిత్రత్వం కొనసాగించారే తప్ప ఒక్కతాటిపై లేరు. తాజాగా ట్రంప్ అమెరికా పగ్గాలు చేపడుతుండడంతో ప్రపంచ మితవాద శక్తులకు ఊతం దొరికినట్లయింది. వారిలో ఉత్సాహం ఉరకెలెత్తుతున్నది. ఇప్పటికే ఇటలీ ప్రధాని జియోర్జియా మిలోనీ బహిరంగంగానే ట్రంప్, మస్క్‌లతో తన సఖ్యతను చాటుకుంటున్నారు. అలాగే ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు మోపిన తీవ్ర మితవాద పాలకుడు, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలై ఏకంగా ట్రంప్ గెలిచిన తరువాత కలిసిన మొదటి విదేశీ ప్రభుత్వాధినేతగా నిలిచారు. హంగేరి ప్రధాని విక్టర్ ఆర్బన్ అమెరికాకు ట్రంప్ రాకతో స్వర్ణయుగం ప్రారంభమైందని ప్రశంసలతో ముంచెత్తారు. వీరితో పాటు మితవాద పార్టీ అధినేతలైన బ్రిటన్‌కు చెందిన రిఫామ్ యుకె పార్టీ అధినేత నిజెల్ ఫారాజ్, ఫ్రెంచ్ జాతీయ వాద పార్టీ రీకాంక్వెట్ వ్యవస్థాపకుడు ఎరిక్ జెమ్మౌర్, జర్మనీకి చెందిన ఎఎఫ్‌డి పార్టీ నేత టినో క్రౌపల్లాలకు ట్రంప్ అధ్యక్ష పదవీస్వీకారోత్సవానికి సాదర ఆహ్వానం లభించింది. ట్రంప్ గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనకు బలమైన మద్దతుదారుడిగా నిలిచిన నాటి బ్రెజిల్ ప్రధాని జెయిర్ బొల్సొనారోకు కూడా పిలుపు వచ్చింది. పోయినసారి అధ్యక్ష ఎన్నికలల్లో ట్రంప్‌కు మద్దతుగా హౌడీ మోదీ కార్యక్రమా న్ని నిర్వహించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ట్రంప్‌కు మిత్రుడే. కానీ ఆయనకు ఆహ్వానం లేదు. విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్ హాజరవుతున్నారు.



### కొత్త యుద్ధాలకు దారి తీస్తుందా?

ట్రంప్ వైఖరి, వివాదాస్పద ప్రకటనలు, విస్తరణవాద కాంక్ష ఎంతవరకు ఆచరణలోకి వస్తాయనే దాని ఆధారం గా కొత్త యుద్ధాల సంభావ్యతను తెలియజేస్తుంది. ఇప్పటికే సుదీర్ఘకాలంగా సాగుతున్న రష్యా – ఉక్రెయిన్ దాడులు, పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాలకు తోడుగా మరో యుద్ధం తోడైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు కుదేలవడం ఖాయం. ప్రస్తుతం జరుగుతున్న రెండు యుద్ధాలు ఆ నాలుగు దేశాలకే పేరుకే పరిమితమైనప్పటికీ, అందులో అమెరికా పాత్ర, సైనిక సహాయం అందిరికీ తెలిసిందే. ఇక ఉక్రెయిన్ పేరుకే యుద్ధరంగం లో ఉంది, దాని పోరాటానికి కర్మ, కర్త, క్రియ అంతా నాటో దేశాలదే. తాజాగా ట్రంప్ నాటో మిత్ర దేశాల రక్షణ రంగ బడ్జెట్‌లను జిడిపిలో 2 శాతం నుంచి 5 శాతానికి పెంచాలని కోరుతానని ప్రకటించారు. ప్రపంచ మిలిటరీ వ్యయం ఇప్పటికే 2022లో 2240 బిలియన్ డాలర్లకు చేరింది. అందులో 82.6 బిలియన్ డాలర్లు అణ్వాయుధాలపైనే ఖర్చవుతుంది.

నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థ, దానికి కొమ్ముకాస్తున్న దేశాలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నవి. ఆ ఆర్థిక భారాన్ని ఇతర దేశాలపై నెట్టి బతికి బట్టకట్టేందుకు జాతీయవాదం, సామ్రాజ్యవాదం యుద్ధాలను మార్గంగా ఎంచుకోవడం చరిత్రలో కొత్తేమి కాదు. గతం లో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న జర్మనీలో ప్రజలకు మభ్యపెట్టే మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడు హిట్లర్. వాగ్దానాలు, సమస్య ల నుంచి దృష్టి మళ్ళించేందుకు ప్రజలలో జాతీయవాదం, ఒక వర్గం పై ఏహ్యాభావం, సామ్రాజ్యవాదాన్ని రేకెత్తించాడు. అందుకు ఒక అబద్ధాన్ని వంద సార్లు పదే పదే చెబితే నిజమవుతుందనే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి ప్రజలను నమ్మించాడు ఆయన సమాచార మంత్రి గోబెల్. చివరకు హిట్లర్ ప్రపంచాన్నే యుద్ధంలోకి దింపాడు. కోట్లాదిమంది మరణాలకు, ఘోర హింసకు కారణమయ్యాడు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు కూడా చరిత్ర పునరావృతమవుతున్న దిశగా సాగుతున్నాయి. తన సోషల్ మీడియా వేదికను ప్రజల ను తప్పుదోవ పట్టించేందుకు దుర్వినియోగం చేస్తున్నారని బ్రిటన్ ప్రధాని కీత్ స్టార్మర్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వాల నుంచి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న, ఆధునిక గోబెల్, 'ఎక్స్' అధిపతి ఎలన్ మస్క్ ఇప్పుడు ట్రంప్‌కు తోడయ్యాడు. వారి బృందంలో ప్రపంచంలో నే అగ్రగామి కార్పొరేట్‌లు జతయ్యాయి. వారి అధిక లాభాపేక్ష, ధన దాహం ఎటు దారి తీస్తుందోననే ఆందోళన అంతటా నెలకొంది. కానీ, ఇప్పటికే రెండు యుద్ధాలతో విసిగి వేసారిన దేశాలు, వాటికి ఆజ్యం పోస్తూ తమ ఆర్థిక వనరులను కూడా కరిగించుకున్న నాటో, ఐరోపా దేశాలు మరో యుద్ధానికి ఎంతవరకు సిద్ధంగా ఉంటాయో కాలమే చెబుతోంది. అమెరికా 47వ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేసే అడుగులే ఒక విధంగా ప్రపంచ దిశను నిర్దేశిస్తాయనడం అతిశయోక్తి కాదు.

**బొమ్మగాని కిరణ్ కుమార్**

# కేజ్రీవాల్ 'అన్‌బ్రేకబుల్'కు పోలీసుల అడ్డంకి



**న్యూఢిల్లీ :** తన పార్టీ నాయకుల అరెస్టు వెనుక ఉన్న 'రహస్యాలు', 'కుట్రలను' బహిర్గతం చేసే డాక్యుమెంటరీ ప్రదర్శనను ఢిల్లీ పోలీసులు నిరోధించారని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఢిల్లీలో మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పటికీ, ప్రదర్శన కార్యక్రమానికి ఎవరి అనుమతి తీసుకోలేదని ఢిల్లీ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. అయితే ప్రైవేట్ ప్రదర్శన కార్యక్రమానికి ఎందుకు అనుమతి అవసరమని కేజ్రీవాల్ ప్రశ్నించారు. అన్‌బ్రేకబుల్ అనే డాక్యుమెంటరీని ప్రైవేట్ కార్యక్రమంలో మీడియాకు చూపించాల్సి ఉందని, అది ఏ రాజకీయ కార్యక్రమం కాదని ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ఓట్లు అడగబోవడం లేదు, ఏ పార్టీకి కూడా వ్యతిరేకంగా చెప్పడంలేదని కేజ్రీవాల్ అన్నారు. ఐటిఒలోని ప్యారేలాల్ భవన్‌లో ప్రదర్శన వేదిక చిత్రాన్ని ఆప్ కన్వీనర్ పంచుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన దృశ్యాలు అందులో ఉన్నాయి. బిజెపి ఆదేశం మేరకు పోలీసులు ప్రదర్శనకు అనుమతించలేదని ఆయన ఆరోపించారు. గత రెండు సంవత్సరాలలో ఆప్ నాయకుల అరెస్టు వెనుక ఉన్న రహస్యాలు, కుట్రలను ఈ డాక్యుమెంటరీ బయటపెడుతుంది కాబట్టే బిజెపి భయపడుతోందని చెప్పారు. ఈ చర్య బిజెపి చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన కార్యకలాపాలను బహిర్గతం చేస్తుందని ఆయన ఆరోపించారు. శనివారం నిర్వహించిన మరో మీడియా సమావేశంలో సీనియర్ ఆప్ నాయకుడు సౌరభ్ భరద్వాజ్ డాక్యుమెంటరీ ట్రైలర్‌ను మీడియాకు ప్రదర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ డాక్యుమెంటరీని ప్రదర్శించకుండా వెనుకాడదని, దానిని ప్రజలకు చేరేలా చూస్తుందని ఆయన అన్నారు. ఈ చిత్రం ప్రజలకు చేరేలా చూడాలని ఆప్ నిర్ణయం తీసుకుందన్నారు. మిమ్మల్ని నా ఇంటికి ఆహ్వానించి మొబైల్ ఫోన్‌లో ఒక గదిలో మీకు చూపించినా లేదా వాట్సాప్ ద్వారా మీకు పంపినా, మీరు ఈ చిత్రాన్ని చూసేలా చేస్తానని, ఏదో ఒక విధంగా, ఈ చిత్రం అందరికీ చేరుతుందని అని ఆయన అన్నారు. కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, సత్యేంద్ర జైన్ వంటి ప్రముఖ ఆప్ నాయకులను 2023–24 సమయంలో అవినీతి కేసులలో కేంద్ర సంస్థలు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, మోడల్ కోడ్ ఉన్న సమయంలో ఏదైనా కార్యక్రమాన్ని నిర్వహించడానికి రాజకీయ పార్టీలు జిల్లా ఎన్నికల అధికారి (డిఇఒ) కార్యాలయంలో సింగిల్ విండో వ్యవస్థ ద్వారా ముందస్తు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

**అద్దె ఇళ్లల్లో నివసించే వారికీ ఫ్రీ కరెంట్, నీరు**

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార ఆమ్ ఆద్మీ ఢిల్లీ ప్రజలకు వరుస హామీలను ప్రకటిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ తాజాగా మరో హామీని ప్రకటించారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజధానిలోని అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వాంచల్‌కు చెందిన అనేక మంది కౌలుదారులకు సైతం ఉచిత విద్యుత్, నీటి సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు. 'నేను ఢిల్లీలో ఎక్కడికి వెళ్లినా కిరాయిదారులు నాతో ఇలా చెబుతారు. మీ పాఠశాలల వల్ల మేం లబ్ధి పొందుతున్నాం. మొహల్లా క్లినిక్స్, ఆస్పత్రుల వల్ల, ఉచిత బస్సు సేవలు, ఉచిత తీర్థయాత్ర సేవలు పొందుతున్నామని చెబుతారు. కానీ ప్రభుత్వం నుంచి ఉచిత విద్యుత్, నీళ్లు మాకు రావడం లేదని వాపోతున్నారు. నేను ఏం చెప్పదలచుకున్నానంటే ఈ ఎన్నికల్లో మా ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే కిరాయిదారుల కోసం పథకాలు, వ్యవస్థను తీసుకొస్తాం. వాటి నుంచి కిరాయిదారులకు విద్యుత్, నీళ్లు ఉచితంగా వస్తాయి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

## కేజ్రీవాల్‌పై ఇటుకలు, రాళ్లతో దాడి



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఇటుకలు, రాళ్లతో దాడి జరిగింది. శనివారం నాడు న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఆయన ఎన్నికల ప్రచారంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బిజెపి 'గూండాలే' ఈ దాడికి పాల్పడినట్లు ఆప్ ఒక ట్వీట్‌లో ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేసింది. 'ఓటమి భయంతో బిజెపి అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి గూండాలను ఉసిగొల్పింది. ఎన్నికల ప్రచారంలో ఉండగా కేజ్రీవాల్‌ను గాయపరిచి ప్రచారం నుంచి దూరంగా ఉండేలా చేసేందుకు బిజెపి అభ్యర్థి పర్వేష్ గూండాలు ఇటుకలు, రాళ్లు ఆయనపై విసిరారు. బిజెపి పిరికిపంద దాడులకు కేజ్రీవాల్ భయపడే ప్రసక్తేలేదు. ఢిల్లీ ప్రజలు మీకు గట్టి గుణపాఠం చెబుతారు'' అని ఆ పోస్ట్‌లో ఆప్ పేర్కొంది.

# ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

### బీహార్‌లో కుల సర్వే ప్రజలను మోసం చేసే ప్రక్రియ

### కులగణన డిమాండ్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది : రాహుల్‌గాంధీ



**పాట్నా :** బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వే రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి నిర్వహించిన ఒక ప్రక్రియ అని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే కుల గణన చేయాలన్న డిమాండ్‌కు తమ పార్టీ కట్టుబడి ఉందని, దేశంలో అభివృద్ధి పనుల కోసం ప్రణాళికలు రూపొందించడానికి ఇలాంటి చొరవ అవసరమని రాహుల్ పేర్కొన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నాయని, దేశంలోని అణగారిన వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ 'నిజమైన స్వాతంత్ర్యం' వ్యాఖ్యలు మన రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. శనివారం రాహుల్‌గాంధీ పాట్నాలోని బాపు సభగర్ వద్ద నిర్వహించిన 'సంవిధాన్ సురక్ష సమ్మేళన్' కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. దళితులు, మైనారిటీలు, సామాజికంగా వెనుకబడిన తరగతుల ప్రజలు దేశ జనాభాలో 90 శాతం ఉన్నారని, అయినా వారు వ్యవస్థలో భాగస్వామ్యం కావడం లేదన్నారు. ఈ కారణాల వల్లే తాము కుల గణన చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తాను పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్రమోదీజీ ఎదుటే వర్గీకరణపరంగా చెప్పానని, ఏ పరిస్థితుల్లో అయినా తమ పార్టీ కులగణన నిర్వహించడంలో విజయవంతమవుతుందన్నారు. దేశం వ్యాప్తంగా కులగణన చేయడం అత్యంత ముఖ్యమన్నారు. దీని వల్ల ఎంతమంది ఒబిసిలు, దళితులు, ఎంతమంది కార్మికులు బ్యూరోక్రసి, ఇతర రంగాల్లో ఉన్నారో వెల్లడవుతుందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. వివిధ కులాల లెక్క తేల్చడం కోసమే కులగణన కాదని, దేశం సంపదలో వారి భాగస్వామ్యం కూడా తెలుస్తుందని చెప్పారు. బీహార్ ప్రభుత్వం చేసిన మాదిరి కుల సర్వే తమకు అవసరం లేదన్నారు. కేవలం ప్రజలను మోసం చేసేందుకు బీహార్ ప్రభుత్వం రాష్ట్రంలో కుల గణన నిర్వహించిన రాహుల్‌గాంధీ విమర్శించారు. ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిలకు 50 శాతం రిజర్వేషన్ పరిమితి చాలదన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలకు లబ్ధి జరిగేలా పరిమితిని పెంచుతామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, దాని కార్యకర్తలు, పరిశ్రమలకు చెందిన ఇళ్లు సహా కొన్ని ఎంపిక చేసిన సంస్థలే దేశాన్ని నడుపుతున్నాయన్నారు. దేశ రాజ్యాంగం కేవలం పుస్తకం మాత్రమే కాదని, దళితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దాడులను కూడా వివరిస్తుందన్నారు. మోహన్ భగవత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ రామాలయం పునఃప్రతిష్ఠ తరువాతే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందనడం రాజ్యాంగ వ్యతిరేకమని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అణగదొక్కుతున్నాయని, అణగారిన వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు.

# ఢిల్లీ 7వ అసెంబ్లీ నడిచింది 74 రోజులే!



**న్యూఢిల్లీ :** గత ఐదేళ్ల కాలంలో 7వ ఢిల్లీ అసెంబ్లీ కేవలం 74 రోజులు మాత్రమే సమావేశమైంది. ఇది గత అసెంబ్లీలతో పోలిస్తే అత్యల్పమని థింక్ ట్యాంక్ పిఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ నివేదిక తెలిపింది. ప్రతి సంవత్సరం అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి అనేక భాగాలుగా విభజించారని నివేదిక పేర్కొంది. ప్రతి సంవత్సరం, సమావేశాలను ప్రోరోగ్ లేకుండా వాయిదా వేసి, భాగాలుగా విభజించారు. దీని ఫలితంగా అనేక సందర్భాల్లో ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే సభ సమావేశమైంది. లెఫ్టినెంట్ గవర్నర్ సమావేశాలను ప్రోరోగ్ చేస్తారు. అయితే సెషన్ సమయంలో సమావేశాలను నిర్వహిచేంది స్పీకర్ అని నివేదిక జోడించింది. 7వ ఢిల్లీ అసెంబ్లీ మొదటి సమావేశం ఫిబ్రవరి 20, 2020న ప్రారంభమైంది. ఐదు విడతలుగా జరిగిన తర్వాత మార్చి 3, 2021న ప్రోరోగ్ చేయబడింది. రెండవ సెషన్ మార్చి 3, 2021న ప్రారంభం కాగా, నాలుగు దఫాలుగా జరిగిన తర్వాత మార్చి 8, 2022న ప్రోరోగ్ అయింది. మూడవ సెషన్ మార్చి 8, 2022న ప్రారంభమైం నాలుగు భాగాల తర్వాత మార్చి 9, 2023న వాయిదా వేయబడింది. నాల్గవ సెషన్ మార్చి 9, 2023న ప్రారంభమై, ఫిబ్రవరి 7, 2024న వాయిదా పడి మళ్ళీ నాలుగు భాగాలుగా జరిగింది. ఐదవ సెషన్ ఫిబ్రవరి 7, 2024న ప్రారంభమై ఇంకా వాయిదా వేయబడలేదు. ఐదు సంవత్సరాలలో, కేవలం 14 బిల్లులు మాత్రమే ఆమోదించబడ్డాయి. ఇతర సెషన్‌లతో పోల్చితే ఇది అత్యల్పం. 14 బిల్లులలో, ఐదు బిల్లులు శాసనసభ్యుల జీతాలకు సంబంధించనవికాగా, అన్ని బిల్లులు ఒకే రోజు లేదా మరుసటి రోజు ఆమోదించబడ్డాయని నివేదిక పేర్కొంది. మొత్తం 74 సమావేశాల రోజుల్లో ప్రశ్నోత్తరాల సమయం కేవలం తొమ్మిది రోజులు మాత్రమే జరిగింది. 2020–2025 మధ్య ఎమ్మెల్యేలు సంవత్సరానికి సగటున 219 ప్రశ్నలు అడిగారు. 2019–2024 మధ్య, లోక్‌సభలో ఎంపిలు సంవత్సరానికి సగటున 8,200 ప్రశ్నలు అడిగారు.

# వికాస్ ఇంజిన్ రీస్టార్ట్ డెమో విజయవంతం: ఇస్రో



**బెంగళూరు :** ఇండియన్ స్పేస్ రీసెర్చి ఆర్గనైజేషన్ (ఇస్రో) మరో మైలురాయిని సాధించింది. తాజాగా వికాస్ లిక్విడ్ ఇంజిన్ రీస్టార్ట్ చేసే డెమోను విజయవంతంగా నిర్వహించింది. మహేంద్ర గిరి లోని ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లోని టెస్ట్ ఫెసిలిటీలో దీనిని చేపట్టినట్టు శనివారం వెల్లడించింది. వివిధ దశల్లో ఇంజిన్ రీస్టార్ట్‌ను ధ్రువీకరించుకోవడానికి ఇస్రో ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇస్రో ప్రయోగ వాహక నౌకలకు లిక్విడ స్టేజ్‌లకు శక్తినిచ్చేదే ఈ వికాస్ ఇంజిన్. ఈ నెల 17న వికాస్ లిక్విడ ఇంజిన్‌ను మళ్లీ మండించినట్టు ఇస్రో పేర్కొంది. తొలుత ఇంజిన్‌ను 60 సెకన్ల పాటు, ఆ తర్వాత 120 సెకన్ల పాటు ఆపివేసి, మళ్లీ 7 సెకన్ల పాటు మండించారు. పరీక్ష సమయంలో ఇంజిన్ లోని అన్ని పారామీటర్లు సాధారణంగా ఊహించిన విధంగానే ఉన్నాయని ఇస్రో ప్రకటించింది. ఇంజిన్ పనితీరును మరింత మెరుగుపర్చేందుకు అదనపు పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపింది. అంతరిక్షంలో ఉపగ్రహాలను ప్రయోగించిన వాహకనౌకలను మళ్లీ వినియోగించేందుకు ఇస్రో చేస్తోన్న పరీక్షల్లో ఇదో సానుకూల పరిణామం. రాకెట్‌లో ద్రవ ఇంధన దశలో వికాస్ ఇంజిన్ ఉంటుంది.

# నాటికీ – నేటికీ తేడా ఏంటి?

### జమిలి ఎన్నికలపై కేంద్రమంత్రి మేఘ్‌వాల్ ప్రశ్న



**న్యూఢిల్లీ:** జమిలి ఎన్నికలు దేశంలో సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకం కాదని కేంద్ర న్యాయశాఖామంత్రి అర్జున రామ్ మేఘ్‌వాల్ అన్నారు. ఒకప్పుడు దేశంలో జమిలి ఎన్నికలు జరిగాయని, నాటికీ నేటికీ తేడా ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థను ఈ విధంగా సవరించడంవల్ల ప్రభుత్వపరిపాలనావ్యవస్థ ఎంతగానో మెరుగుపడుతుందని అన్నారు. పిటిఐ వీడియోలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గురువారంనాడు ఆయన మాట్లాడుతూ, ''ఒకే దేశం, ఒకే ఎన్నిక'' నినాదాన్ని వ్యతిరేకించేవారంతా కేవలం రాజకీయ కారణాలతోనే వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. చరిత్రలో వెనక్కు తిరిగి చూసినప్పుడు 1952వ సంవత్సరం నుండి కొన్నేళ్ళపాటు కేంద్రంలో లోక్‌సభకు, రాష్ట్రాలలో శాసనసభలకూ ఏకకాలంలో ఎన్నికలు జరుగుతూ ఉండేవని గుర్తుచేశారు. ఆనాడు అలా జరగడం దేశ సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకం కానప్పుడు, అవే జమిలి ఎన్నికలు ఏ విధంగా ఈనాడు సమాఖ్యవ్యవస్థకు వ్యతిరేకంఅవుతాయి? ఎందుకు చెడ్డవైపోతాయి? అని మేఘ్‌వాల్ ప్రశ్నించారు. లోక్‌సభకు, రాష్ట్రాలలో శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులను పరిశీలన చేయడంకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అప్పగించామని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా పార్లమెంటరీ కమిటీ ఈ ముసాయిదా బిల్లును పరిశీలించాల్సిందేనంటూ ఎంతో ఆసక్తి చూపిస్తున్నారనీ మేఘ్‌వాల్ అన్నారు. లోక్‌సభ–శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడంవల్ల వివిధ దృక్కోణాలలో కలిగే ప్రయోజనాలు, దేశంలో వీటికున్న పూర్వ చరిత్రను శాసనవిభాగం కార్యదర్శి రాజీవ్ మణి సంయుక్త పార్లమెంటరీ కమిటీ మొదటి సమావేశంలో వివరించారు. ''ఒకేదేశం, ఒకే ఎన్నిక నినాదాన్ని వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు ఇప్పుడు చేస్తున్న అతిపెద్ద ఆరోపణ ఏమిటంటే, ఈ జమిలి ఎన్నికలు దేశ సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకం అని. కానీ 1952, 957, 1962, 1967 సంవత్సరాలలో ఏకకాలంలో లోక్‌సభ, శాసనసభలకు ఎన్నికలు జరిగాయి, మరి ఇప్పుడు ఎందుకు హఠాత్తుగా దేశ సమాఖ్య వ్యవస్థకు ఈ ఎన్నికలవల్ల చెడు జరుగుతుంది?'' అని మేఘ్‌వాల్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళివల్ల ఎదురయ్యే సమస్యలను, కష్టాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం'' అని ఉద్ఘాటించారు. లోక్‌సభ, శాసనసభలకు జరిగే ఎన్నికలను సవరించడం అంటే ఏమిటి? ఆ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? లోక్‌సభను నియమించిన తేదీ అంటే ఏమిటి? అనే ప్రతిఒక్క విషయాన్నీ ప్రతిపక్షాలు అర్థం చేసుకోవాలని అన్నారు. ఎవరో ఒకరు దీనిని వ్యతిరేకిస్తే దానిని ప్రతిపక్షాలు రాజకీయ కారణాలకు ముడిపెట్టి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లుపై అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ, ఒక సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఈ ముసాయిదా చట్టాలకు సంబంధించి సంప్రదింపులు చేస్తోందన్నారు. ''ఏదైనా ఒక గ్రామంలో ఒక ఆస్తి ఉంటే, ఏదో ఒకరోజు మీరు వచ్చేసి ఈ ఆస్తి వక్ఫ్ బోర్డుది, ఇది వక్ఫ్ బోర్డుకే చెందుతుంది అని చెప్పేస్తే సరిపోతుందా? నిజంగా ఏదైనా ఆక్రమణలు జరిగితే ఇక్కడ ఒక వ్యవస్థ ఉంది, పరిశీలిస్తుంది, కమిటీ తన నివేదికను సమర్పించిన తర్వాత ఆ నివేదిక పార్లమెంటు ముందుకు వస్తుంది, అప్పుడు దానిని పరిశీలిస్తాం, తర్వాత ఆమోదిస్తాం'' అన్నారు. ప్రార్థనా స్థలాల చట్టం సమస్య గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, ఈ విషయం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఈ సమస్యపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయకుండా ఉండాలన్నారు.

# ఢిల్లీలో చిన్న పార్టీల ముమ్మర ప్రచారం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, రాజకీయ కార్యకలాపాలు జోరందుకున్నాయి. నగరంలోని ఎఐఎంఐఎం, బిఎస్‌పి వంటి పార్టీలు సహా ఇతర చిన్న పార్టీలు వీధి నాటకాలు, వాల్ పెయింటింగ్స్, పిల్లలతో క్రికెట్ మ్యాచ్‌లు వంటి సాధారణ ప్రచారాల ద్వారా ఓటర్లను ఆకర్షిస్తున్నాయి. ఫిబ్రవరి 5న ఢిల్లీ ఎన్నికలు జరగనున్నాయి, అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బిజెపి, కాంగ్రెస్‌లు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. ఈ మూడు పార్టీల మధ్య గట్టి పోరు ఉండగా, ఇతర చిన్న పార్టీలు కూడా తమ ఉనికిని చాటుకునేందుకు రంగంలోకి దిగాయి. ఇతర రాష్ట్రాల్లో గణనీయమైన ప్రభావం చూపిన అసదుద్దీన్ ఒవైసీ ఆల్ ఇండియా మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎఐఎంఐఎం), మాయావతి బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి), మునీష్ కుమార్ రైజాదా భారతీయ లిబరల్ పార్టీ (బిఎల్‌పి)లు దేశ రాజధానిలో తమ ఉనికిని చాటుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక ఎఐఎంఐఎం విస్తృతంగా ఇంటింటి ప్రచారం ప్రారంభించింది. ముఖ్యంగా ఓఖ్లాలో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థి షఫా–ఉర్–రెహమాన్, ఆయన భార్య జామియా మిలియా ఇస్లామియా విద్యార్థి కార్యకర్తతో కలిసి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. నుక్కడ్‌డు సభలు (వీధి సమావేశాలు) కూడా క్రమం తప్పకుండా జరుగుతున్నాయని, పార్టీ తన వ్యూహంలో భాగంగా సోషల్ మీడియాకు ప్రాధాన్యతనిస్తోందని ఢిల్లీ పార్టీ చీఫ్ సొయిబ్ జామిమా పిటిఐకి వెల్లడించారు. ఆప్ ఎమ్మెల్యే అమంటుల్లా ఖాన్ గతంలో చేసిన వ్యాఖ్యలు, చర్యలను ఎత్తిచూపుతూ, అభివృద్ధి చెందని ప్రాంతాల వీడియోలను ఓటర్లకు చూపించడానికి తమకు సోసిల్ మీడియా బృందం ఉన్నట్లు ఆయన చెప్పారు. ఒకప్పుడు కేజ్రీవాల్ స్నేహితుడు అయిన న్యూఢిల్లీ నియోజకవర్గం అభ్యర్థి, బిఎల్‌పి మునీష్ కుమార్ రైజాదా అట్టడుగు స్థాయి ప్రచారంపై దృష్టి సారించారు. అతని బృందం జెజె క్లస్టర్లు, మొత్తం16 ధోబీ ఘాట్‌లు, ముస్లిం కాలనీలు, వాల్మీకి సదన్‌లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తోంది. అదే విధంగా పార్టీ వాల్ పెయింటింగ్ ద్వారా, కరపత్రాలు, బిల్‌బోర్డ్‌లు, స్టిక్కర్‌లను పంపిణీ చేస్తోంది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లను కూడా ఉపయోగిస్తోంది. ఇక ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాల్లోనూ పోటీ చేయాలని యోచిస్తున్న బిఎస్‌పి ఓటర్లతో అనుసంధానం కావడానికి సాంప్రదాయ విధానాన్ని అవలంబించింది. పార్టీ సీనియర్ మద్దతుతో ఇంటింటికీ ప్రచారం చేయడం, నుక్కడ్ సమావేశాలు నిర్వహించడంపై పార్టీ దృష్టి సారించిందని బిఎస్‌పి కేంద్ర సమన్వయకర్త నితిన్ సింగ్ పిటిఐకి తెలిపారు. పార్టీ పోస్టర్లు, కరపత్రాలతో పాటు, ప్రజలను చేరుకోవడానికి మీడియాను ఉపయోగిస్తోంది. తాము ఇతర పార్టీల మాదిరిగా సోషల్ మీడియా గేమ్‌లో పాల్గొనడం లేదని, అందుకు బదులుగా సాంప్రదాయ విధానాన్ని అనుసరిస్తున్నామన్నారు. వ్యక్తిగతంగా ప్రజల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నామని చెప్పారు.

### అభివృద్ధి ఎజెండాలో వాతావరణ సేవల కీలకపాత్రను

# బాగా అర్థం చేసుకున్న భారత్

### డబ్ల్యుఎంఒ చీఫ్ సెలెస్టో సాలో

**న్యూఢిల్లీ :** దేశాభివృద్ధి ఎజెండాలో వాతావరణ సేవల ప్రాముఖ్యత ఎంత కీలకమైనదో భారతదేశం బాగా అర్థం చేసుకుందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నదనీ ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) ప్రధానాధిపతి సెలెస్టో సాలో చెప్పారు. వాతావరణ సేవల నాణ్యతా ప్రమాణాలను, సంబంధిత నిబంధనలను పాటించడంలో భారతదేశం ఉత్తమస్థానంలో ఉందని, వాతావరణ ప్రాధాన్యతను భారత్ బాగా అర్థం చేసుకుందని అన్నారు. భారత వాతావరణ విభాగం (ఐఎండి) 150వ సంవత్సరం వేడుకలకు హాజరైన సందర్భంగా న్యూఢిల్లీలో గురువారంనాడు పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో సెలెస్టో సాలో మాట్లాడుతూ, రవాణారంగం, పర్యాటక రంగం, ఇంధనం, వ్యవసాయంతోపాటు ఆర్థికవ్యవస్థలోని అన్ని రంగాలలో వాతావరణ శాస్త్రం, వాతావరణ సేవలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఐనప్పటికీ భారత్‌లాగా కాకుండా చాలా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇప్పటివరకూ ఈ వాతావరణ సేవలను వివిధ రంగాలతో సంపూర్ణంగా సమీకృతం చేయలేదని అన్నారు. పునర్వినియోగ ఇంధనంలో వాతావరణ సేవల పాత్రను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. ''పునర్వినియోగాల గురించి మీరు ఆలోచించినప్పుడు, పవన, సౌర, జల వనరులన్నీ వాతావరణంపైనే ఆధారపడి ఉన్నాయి. ఇంధనాన్ని పరివర్తనం చేయించాలంటే బలమైన వాతావరణ సేవలు ఎంతో అవసరం, అందువల్ల యావత్ అభివృద్ధి ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళడంలో వాతావరణశాస్త్రం, వాతావరణ సేవలను భారతదేశం అర్థం చేసుకున్నంతా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇప్పటివరకూ సరిగ్గా అర్థం చేసుకోలేదు'' అని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత వాతావరణ విభాగం ఆవిర్భవించి నేటికి 150 సంవత్సరాలు పూర్తయ్యాయనీ, ఈ విధంగా కొద్ది దేశాలు మాత్రమే తమ వాతావరణశాఖను ఏర్పాటు చేసి ఇన్ని సంవత్సరాలైందని చెప్పగలుగుతున్నాయని, ఈ విధంగా చెప్పడంవల్ల చరిత్ర తెలుస్తుందిగానీ, దేశంలో అనుసరిస్తున్న సంబంధిత విధానాలను కూడా దీనిబట్టి అర్థం చేసుకోగలిగి ఉండాలని, దేశంలో ఉపయోగించే నూతన సాంకేతిక పరిజ్ఞానం, వాతావరణ ప్రాముఖ్యతలను కూడా చెప్పగలిగి ఉండాలని, వాటిపై పెట్టుబడులు పెట్టగలగాలనీ, ఆ అవసరం ఎంతో ఉందని ఆమె చెప్పారు. ''భారత్‌లాగానే అన్ని దేశాల నుండి నేను వాతావరణ సేవలను కోరుకుంటున్నాను, కేవలం రాబోయే వాతావరణ సూచనలను టీవీల ద్వారా ఇతర వార్తా మాధ్యమాలద్వారా చెప్పడం వరకూ పరిమితం కాకూడదు, ప్రతిదేశంలోని వాతావరణ శాఖా వాతావరణానికి సంబంధించిన కీలకమైన యావత్ సమాచారాన్ని సమకూర్చగలిగి ఉండాలి, వాతావరణాన్ని తమ సొంతం చేసుకుని దాని ఉత్పాదకతను, ఇంధన పరివర్తనను, ప్రజల జీవితాల భద్రతను వివరించాలి'' అన్నారు.

# 65 లక్షల స్వమిత్వ ఆస్తి కార్డులు పంపిణీ



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సుమారు 65 లక్షల స్వమిత్వ ఆస్తి కార్డులు పంపిణీ చేశారు. అవి ఆర్థిక కార్యకలాపాలను పెంపొందిస్తాయని, దారిద్ర్య నిర్మూలనకు దోహదం చేస్తాయని ప్రధాని మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా లబ్ధిదారులు కొంత మందితో మాట్లాడారు. ఈ పథకం రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి తోడ్పడుతుందని ఆయన చెప్పారు. పది రాష్ట్రాలు, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, మిజోరామ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలోని 50 వేల పైచిలుకు గ్రామాల్లో లబ్ధిదారులకు ఈ ఆస్తి కార్డులు పంపిణీ చేశారు. 'శనివారం 65 లక్షల కార్డుల పంపిణీ దృష్ట్యా గ్రామాల్లోని సుమారు 2.24 కోట్ల మంది లబ్ధిదారుల వద్ద ఇప్పుడు స్వమిత్వ ఆస్తి కార్డులు ఉంటాయి' అని ప్రధాని తెలిపారు. 'ఆస్తి హక్కులు ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సవాల్. కొన్ని ఏళ్ల క్రితం ఐక్యరాజ్య సమితి (యుఎన్) ఒక సర్వే నిర్వహించింది. పలు దేశాల్లో ఆస్తి హక్కులకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలు జనం వద్ద లేవని ఆ సర్వే వెల్లడించింది. దారిద్ర్య నిర్మూలనకు ఆస్తి హక్కులు ముఖ్యం అని యుఎన్ స్పష్టం చేసింది' అని మోడీ తెలియజేశారు. గ్రామాల్లో ఆస్తి ఒక 'వృథ మూలధనం' అని, దానితో ప్రజలు ఏమీ చేయలేరని, వారి ఆదాయం పెంపునకు అది తోడ్పడదని ప్రముఖ ఆర్థికవేత్త ఒకరు అభిప్రాయం వ్యక్తం చేశారని ప్రధాని చెప్పారు. 'భారత్‌పై ఈ సవాల్ ప్రభావం పడింది. గ్రామాల్లో ప్రజల వద్ద లక్షలాది రూపాయలు విలువ చేసే ఆస్తి ఉంది, కానీ వారి వద్ద ఆ ఆస్తి పత్రాలు లేవు. వివాదాలు ఉన్నాయి, ఆస్తులు లాక్కున్నారు, తుదకు బ్యాంకులు సైతం దానిపై రుణాలు ఇవ్వడం లేదు' అని ఆయన వివరించారు. 'పూర్వపు ప్రభుత్వాలు దాని గురించి ఏదైనా చేయడానికి చర్యలు తీసుకున్నాయి. కానీ అంతగా ఏదీ జరగలేదు' అని ఆయన చెప్పారు. దళితులు, వెనుకబడిన తరగతులవారు, ఆదివాసీలు దీని వల్ల దారుణంగా నష్టపోయారని మోడీ తెలిపారు. 'చట్టబద్ధమైన ఆస్తి హక్కులు పొందిన తరువాత లక్షలాది మంది ప్రజలు రుణం తీసుకున్నారు. తమ వ్యాపారాలు ప్రారంభించేందుకు వారు ఈ డబ్బు ఉపయోగించుకున్నారు. వారిలో అనేక మంది రైతులు, వారికి ఈ ఆస్తి కార్డులు ఆర్థిక భద్రతకు గ్యారంటీ' అని మోడీ చెప్పారు. స్వమిత్వ, భూ ఆధార్ గ్రామాల అభివృద్ధికి పునాది అవుతాయని కూడా ప్రధాని మోడీ తెలిపారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్', సహాయ మంత్రి ఎస్‌పి సింగ్ భాఘెల్, కార్యదర్శి వివేక్ భరద్వాజ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు సిఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు వర్చువల్‌గా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

### విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తి

# ఎన్‌కౌంటర్‌లో మృతి



**కోల్‌కతా :** మూడు రోజుల క్రితం కస్టడీ నుండి తప్పించుకుంటూ పోలీసులపై కాల్పులు జరిపిన విచారణలో ఉన్న వ్యక్తి శనివారం తెల్లవారుజామున పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడని ఒక సీనియర్ అధికారి తెలిపారు. సజ్జక్ ఆలం జిల్లాలోని గోల్‌పోఖర్‌లోని కిచక్తలా వద్ద జరిగిన కాల్పుల్లో పోలీసు సిబ్బంది కాల్చి చంపారని ఆయన అన్నారు. 'అతను కిచక్తలా ప్రాంతంలో దాక్కున్నాడని అందిన సమాచారం మేరకు, మేము అక్కడ దాడి చేసాము. ఆ సమయంలో, నిందితుడు పోలీసు సిబ్బందిపై కాల్పులు జరపడం ప్రారంభించాడు, మా బృందం ప్రతీకారం తీర్చుకుంది. ఆలం గాయపడ్డాడు. అతన్ని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ అతను మరణించాడు' అని అధికారి పిటిఐకి తెలిపారు. ఉత్తర్ దినాజ్‌పూర్‌లోని రాయ్‌గంజ్‌లోని ఇద్దరు పోలీసులు బుధవారం గాయపడ్డారు, ఆలం, మరొక విచారణలో ఉన్న వ్యక్తి వారిని బలవంతంగా లాక్కొని, వారి సర్వీస్ రివాల్వర్లను లాక్కొని, పారిపోయే ముందు వారిపై కాల్పులు జరిపారు. ఇస్లాంపూర్‌లోని కోర్టు నుండి పోలీసుల రక్షణలో జైలు వ్యాన్‌లో రాయ్‌గంజ్ లోని సెంట్రల్ కరెక్షనల్ హోమ్‌కు ఖైదీలను తీసుకెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. 'జనవరి 15న జరిగిన సంఘటనలో ప్రధాన నిందితుడు బంగ్లాదేశ్‌కు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అతనికి సహాయం చేస్తున్న వారిని కనుగొనడానికి మేము ప్రయత్నిస్తున్నాము' అని అధికారి తెలిపారు. ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని కరండిఘిలో 2019లో జరిగిన హత్య కేసులో కూడా ఆలం ప్రధాన నిందితుడు.



## ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తాం

**ప్రజాపక్షం/చిట్యాల(కట్టంగూర్)/నార్కట్‌పల్లి :** ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. నియోజకవర్గంలోని కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను సంభందిత అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల సహకారంతో అయిటిపాముల లిఫ్ట్ మంజూరయ్యిందని, ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే 8వేల ఎకరాలకు సాగునీరందుతుందని అన్నారు. వచ్చే 8 నెలల్లో ఈ ప్రాజెక్ట్ పూర్తి అవుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత రైతుల దశాబ్ధాల కళ ఈ ప్రాజెక్ట్ తో నెరవేరుతుందని అన్నారు. అన్ని సమస్యలను పూర్తి చేసుకుని రాబోయే రెండు, మూడు రోజులలో పనులను ప్రారంభిస్తామని, ప్రాజెక్ట్ పూర్తి కోసం అధికారులు, రైతులు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని వీరేశం కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ముందుగా వెళ్తున్న ప్రైవేట్ బస్సును వెనుక నుండి వస్తున్న మరో ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హైద్రాబాద్‌విజయవాడ జాతీయ రహదారి ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నుండి హైద్రాబాద్‌కు వెళ్తున్న యోలో ట్రావెల్ బస్సు స్పీడ్ బ్రేకర్ ఉండడంతో నెమ్మదిగా వెళ్తుండడంతో వెనుక నుండి వేగంగా వచ్చిన జింగ్ ట్రావెల్ బస్సు బలంగా ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. దీంతో జింగ్ ట్రావెల్ బస్సు ముందు అద్దం ద్వంసమై క్లినర్ సాయి ప్రమాదంలో ముందు చక్రాల కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. యోలో ట్రావెల్ బస్సులోని ప్రయాణికుడు పాషా ప్రమాద ధాటికి గుండెపోటు వచ్చి మరణించాడు. వీరితో పాటు మరో ఐదుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పట్టణ సిఐ వీరరాఘవులు ఆధ్వర్యంలో క్షతగాత్రులను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా బస్సులను అక్కడి నుండి పక్కకు తొలగించారు. యోలో బస్సు నిర్వహకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి జి సురేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ సుధాకర్ పివిసి ఫ్యాక్టరీలో పని చేస్తున్న సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే వ్యక్తితో పాటు పక్కన ఉన్న వ్యక్తి తప్పనిసరిగ్గా సీటు బెల్టు ధరించడంతో ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక ఆచరించాలన్నారు. వాహనదారుడు తన వాహనాన్ని నిర్దేశిత స్థలంలోనే పార్కింగ్ చేయాలన్నారు. వాహనాలు యూటర్న్ తీసుకునేటప్పుడు ప్రమాదాలను నివారించడానికి సిగ్నల్ ఇస్తూ ముందు వెనక చూసుకొని నెమ్మదిగా వెళ్లాలని తెలిపారు. క్రమం తప్పకుండా మెయింటెనెన్స్ సరిగ్గా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పివిసి కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, మోటార్ రవాణా అధికారి జయప్రకాష్ రెడ్డి, ఎ ఆదిత్య, వెంకటేష్, సహాయ వాహన అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.


## బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

**ప్రజాపక్షం/ఉండవల్లి:** బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాధికారి రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో ప్రభుత్వ పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు బడికి రాని పిల్లల కొరకు గ్రామాల్లో పర్యవేక్షణ చేసి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుపోయినట్లు వారు తెలిపారు. ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు బడికి 30 రోజుల వరకు రాని పిల్లల వివరాలను ప్రతి నెల సమాచారము మండల కేంద్రానికి అందించాలని వారు కోరారు. ప్రభుత్వ పాఠశాలను విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలలకు వచ్చి ప్రభుత్వ ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు తప్పనిసరిగా విద్యార్థులు భోధించు బోదనభ్యాసాలు ప్రక్రియలు నేర్చుకోవాలని వారు కోరారు. ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలు మధ్యాహ్నం భోజనం నాణ్యతమైన ఆహారం అందించడం వలన పేద విద్యార్థులకు ఎంతో ప్రయాణకరంగా మారిందని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకొని 10/10 మార్కులు సాధించి మన జిల్లా కలెక్టర్ తో ప్రశంస పత్రాలు అందుకోవాలని వారు పిలుపు నిచ్చారు. తగ్గట్టుగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కృషి చేయా లని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లేబర్ అధికారి భాష చైల్డ్ ప్రొటెక్షన్ టి అధికారి ప్రకాష్ ఎస్సై విజయ్ పోలీస్ సిబ్బంది ప్రధానోపాధ్యా ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్యంకు పలువురు పరామర్శ



**ప్రజాపక్షం/ మునుగోడు :** సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాతృమూర్తి నెల్లికంటి పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం మండలంలోని ఎల్గలగూడం గ్రామంలో మాజీ రాజసభ్య సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షులు, రమావత్ రవీంద్రకుమార్ ,మాజీ ఎమ్మెల్యే నోముల భగత్,భువనగిరి పార్లమెంటు బిఆర్‌ఎస్ ఇంచార్జ్ క్యామ మల్లేష్ లు పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యంను పరామర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్, బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి నీల వెంకటేష్, జిల్లా అధ్యక్షులు దుడుక లక్ష్మీనారాయణ, మిర్యాల యాదగిరి,యాదవ విద్యావంతుల వేదిక జిల్లా నాయకులు నాగరాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరస్వామి, వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, ఆర్‌టిసి నాయకులు కెవెస్‌రెడ్డి, శంకర్, కైలాస్, లింగస్వామి పాల్గొన్నారు.



# మహిళల లైంగిక వేధింపులపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ

### మహిళ ఉద్యోగులు స్వేచ్ఛగా తమ పనులు చేసుకోవాలి : కలెక్టర్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** జిల్లాలో పని చేసే మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వచ్ఛగా తమ పనులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ నిషేద పరిష్కార చట్టంపై జిల్లా, మండల సమైఖ్య మహిళలకు ఎన్‌జిఓలు, మహిళ ఉద్యోగులకు, శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఎలాంటి లైంగిక వేధింపులకు గురి అయిన వారు అంతర్గత ఫిర్యాదుల కమిటికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మహిళలు స్వచ్ఛగా తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలన్నారు. పదిమంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న ఉన్నచోట మహిళలపై జరుగుతున్న లైంగిక వేదింపులు నిరోధించడానికి మహిళలు ధైర్యంగా వారి పనులు వారు చేసుకోవాలని చెప్పారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ప్రతి శాఖ అధికారి, హోటల్స్, షాపింగ్ మాల్, ప్రైవేట్ ఆసుపత్రులలో కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 10 మంది కంటే తక్కువ ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఎలాంటి వేధింపులు జరిగిన జిల్లా స్థాయిలో ఉన్న స్థానిక ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

**మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీవాణి**

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీవాణి అన్నారు. మహిళ ఉద్యోగి నెల ఇష్టానికి వ్యతిరేకంగా ఉండే ఎటువంటి లైంగిక చర్య అయిన పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల కిందికే వస్తుందని తెలిపారు. మహిళలు తమ ఫిర్యాదులను అంతర్గత ఫిర్యాదుల కమిటీకి అందజేయాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న 90రోజుల్లో పరిష్కారం చూపబడుతుందన్నారు. మహిళలు, వికలాంగులు, పిల్లలకు ఉచిత న్యాయ సేవాలు అందించడానికి టోల్ ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ నరసింహారావు, ఎసిడిపిఓ రూప, స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్మన్ శిరీష, సభ్యులు లత, అనసూయ, జిల్లా మిషన్ కోఆర్డీనేటర్ చైతన్య నాయుడు, జండర్ స్పెషలిస్టులు రేవతి, వినోద్, తేజస్విని, క్రాంతి, సఖీ సిబ్బంది, ఎన్‌జిఓలు, డిఎల్‌ఎస్‌ఎ సభ్యులు పాల్గొన్నారు.

### గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఫరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్, శకటాలు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విధుల్లో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ఉత్తమ ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ఈనెల 21తేదీలోగా ఆయా శాఖల అధిపతులు తమ శాఖలో ఉద్యోగుల వివరాలను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## చేనేత కుటుంబాలకు చేయూతనివ్వాలి

### ఎమ్మెల్యే విజయుడు

**ప్రజాపక్షం/ఉండవెల్లి/ఎర్రవల్లి :** అల్లంపూర్ గద్వాల చేనేత కుటుంబాలకు చేయూత నివ్వాలని అలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను చేనేత కుటుంబాలకు అందజేయాలని వారు కోరారు. అర్హతలు ఉన్నా కూడా ప్రభుత్వం అందించే సాయం అందకపోవడంతో చేనేత కుటుంబాలు విక్షణమై పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తపరిచారు. అల్లంపూర్ నియోజకవర్గం లోని కొరిపాడు రాజోలి అల్లంపూర్ తక్కశిలా మారుమునగాల గ్రామాల్లో 90 శాతం కుటుంబాలు చేనేత పైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు చేనేత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు ప్రభుత్వ రుణాలు రుణమాఫీ సౌకర్యం వంటివి పూర్తిస్థాయిలో అందే విధంగా చూడాలని వారి కోరారు. ఈ సందర్భంగా జిల్లా చేనేత ఏడి గోవిందయ్య ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్వర్ రెడ్డి సంక్రాంతి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## భారీ బందోబస్తు మధ్య ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండలంలోని గణేష్‌పాడు వద్ద గల పెన్నా (అంబుజా) సిమెంట్ పరిశ్రమ గనుల విస్తరణ, సున్నపురాయి ఉత్పత్తి పెంపుపై శనివారం పరిశ్రమ ఆవరణలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ భారీ పోలీసు నడు మ ప్రశాంతంగా ముగిసింది. పలు కారణాల వల్ల రెండు సార్లు వాయిదా పడిన ప్రజాభిప్రాయ సేకరణ రామన్నపేటలో ఇటీవల అదాని గ్రూప్ నిర్మించతలపెట్టిన సిమెంట్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణలో జరిగిన ఉద్రిక్తలను దృష్టిలో ఉంచుకోని గణేష్‌పాడులోని పెన్నా సిమెంట్స్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఎస్పీలు సన్‌ప్రీత్‌సింగ్, శరత్‌చంద్రపవార్‌ల ఆధ్వర్యంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో కూడిన సుమారు 500 మంది పోలీసులతో భారీగా బందోబసుత నిర్వహించారు. గణేష్‌పాడు పరిధిలో 304 హెక్టార్లు, సూర్యాపేట జిల్లా శూన్యపహాడ్ పరిధిలో 50 హెక్టార్ల భూమి ఉండడంతో అనుమతుల కోసం గనుల ప్రదేశంలో ఒకే చోట రెండు సార్లు వేర్వేరు ప్రజాభిప్రాయ సేకరణ సభలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం ప్లాంట్ పరిసర గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని గత పెన్నా సిమెంట్ పరిశ్రమ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని ఈ పరిశ్రమ యాజమాన్యమైన గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. స్థానికులకు ఉపాది కల్పించాలని, స్థానిక ఉద్యోగుల బదిలీలను నిలుపుదల చేయాలన్నారు. కాగా తాగుటి సౌక ర్యం కల్పించాలని కోరడంతో ప్లాంట్ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ విజయలక్ష్మి , సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ తదితరులు ఉన్నారు.



## క్రీడలతో మానసిక ఉల్లాసం

### మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి..

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన పుట్టపాక లయన్స్, పోలీస్ టీం లకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఆరోగ్యాన్ని కాపాడతాయి అని అన్నారు. ఇక ముందు నియోజక వర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయిస్తానని, మండల కేంద్రంలో యువతను ప్రోత్సహించేందుకు క్రీడలు,జాగింగ్ , ఇతర క్రీడలకోసం 5 ఎకరాల భూమిని అనువైన స్థలాన్ని కేటాయించేందుకు స్థానిక తహసీల్దార్ కు తానే స్వయంగా తెలియజేస్తానని హామీ ఇచ్చారు. క్రీడా స్థలం అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి సి సి బి చైర్మన్ కుంభం శ్రీ నివాస్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు,కాంగ్రెస్ జిల్లా నాయకులు జక్కలి ఐలయ్య,కరం టోత్ భిక్షపతి నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీను నాయక్, మాజీ జడ్పీటీసీ వీరమల్ల భానుమతి పాల్గొన్నారు.

# ఆస్తులు అమ్మి అభివృద్ధా?

### పాలన చేతగాని మదర్ డైరీ పాలకవర్గం...




**ప్రజాపక్షం/భువనగిరి :** మదర్ డైరీ చైర్మన్ పదవి చేపట్టి నాలుగు నెలలు గడవకముందే పాలన చేతకాక నష్టాలను పూడ్చివేసే పేరుతో మదర్ డైరీ ఆస్తులను అమ్మి సొమ్ము చేసుకునేందుకు పాలకవర్గం కుట్రలు పన్నుతున్నారని మదర్ డైరీ మాజీ డైరెక్టర్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలువురు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల చైర్మన్లు విమర్శిస్తున్నారు. డైరీ పై అవగాహన లేని నాయకులు రాజకీయ పలుకుబడితో పాలకవర్గంలో పదవులు చేపట్టి అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుల అండదండలతో మదర్ డైరీ ఆస్తులను అమ్మి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తూ నష్టాల మంత్రం జపిస్తున్నారని విమర్శించారు. గత పాలకవర్గాలు అవినీతికి పాల్పడడంతోనే మదర్ డైరీ నష్టాలపాలు అయిందని చెప్పడం అర్థరాహితమని అన్నారు. గత పాలకవర్గాలు పాడి రైతులకు బోనస్ ఇవ్వడమే కాకుండా మదర్ డైరీ అప్పులను వన్ టైం సెటిల్మెంట్ ద్వారా తీర్చివేసిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. గత పాలకవర్గాలు అవినీతికి పాల్పడితే ప్రస్తుత పాలకవర్గం అమ్మేందుకు నిర్ణయించిన 30ఎకరాల భూములు మదర్ డైరీకి ఎలా సమకూరాయని ప్రశ్నిస్తున్నారు. పాడి రైతులకు సబ్సిడీ పైన యంత్ర పరికరాలు ఇవ్వడమే కాకుండా పాడి రైతుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పారితోషకాలు ఇచ్చి ప్రోత్సహించిన విషయం తెలవదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నష్టాలను పూడ్చివేసే పేరుతో మధర్ డైరీ ఆస్తులను అమ్మకాలు చేపడితే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని మదర్ డైరీ మాజీ డైరెక్టర్లు, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పలువురు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల చైర్మన్‌లు హెచ్చరించారు.

## ఉపాధ్యాయులు ... మీ ఓటును వృథా కానివ్వొద్దు: ఎంఎల్‌సి నర్సిరెడ్డి

**ప్రజాపక్షం/నందికొండ:** మార్చిలో జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించి ఉపాధ్యాయ ఎం ఎల్‌సి ఎన్నికలలో మళ్లీ తనను ఎం ఎల్‌సిగా గెలిపించాలని ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. రానున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి శనివారం నందికొండ మునిసిపాలిటీ పరిధిలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుకు అన్నీ నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులు ఎన్నికలకు సన్నద్ధం కావాలని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి సమస్యలు ఏవైతే ఉన్నవో అవి టైం స్కేలుకు సంబంధించి , పాత పెన్షన్ విధానాన్ని మళ్లీ కొనసాగించే విధంగా, అదేవిధంగా డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు యూజీసీ స్కేల్ తో పాటు పాఠశా ల నుంచి డిగ్రీ కాలేజీకి ప్రమోషన్ పై వచ్చిన అధ్యాపకులకు పాత సర్వీసు కలిసే విధంగా చూడాలని ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తప్పక పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు . అయితే ఉపాధ్యాయులందరూ తమ ఓటును వృధా కాని వ్వకుండా తమకు ఎవరైతే మేలు చేస్తారని అనుకుంటారో వారిని ఎన్నుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత,పాఠశాల ఉపాధ్యాయులు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా అర్హుల ఎంపిక : కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జారీకి అర్హులైన లబ్ధిదారులకు ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం బీబీనగర్ మండలంలోని రాఘవపురం గ్రామంలో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీకి అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలనీ, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలన్నారు. పూర్తి శిఖంలోనే ఉన్న వ్యవసాయ యోగ్యము కాని భూముల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందని తెలిపారు. అర్హుల ఎంపిక ఎంత ముఖ్యమో అనర్హుల ఏరి వేత కూడా అంతే ముఖ్యం అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకూ అనుగుణంగా రైతు భరోసా పథకానికి సంబంధించిన వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ భూములకే రైతు భరోసా వర్తించడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి రికార్డులను పరిశీలించారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న వారికీ ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 21న రైతు మహాధర్నా



**ప్రజాపక్షం / నల్లగొండ ప్రతినిధి:** ఈనెల 21న నల్లగొండలో నిర్వహించే రైతు మహాధర్నకు పార్టీలకు అతీతంగా హాజరుకావాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు పిలుపునిచ్చారు శనివారం పట్టణంలోని బిఆరెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు రవీంద్ర కుమార్, బడుగుల లింగయ్య యాదవ్,కంచర్ల రామకృష్ణారెడ్డి లు మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి ఈనెల 21న రైతు మహాధర్నాను నిర్వహిస్తున్నామని. మహా ధర్నాకు మాజీ మంత్రి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి లు ముఖ్య అతిథిలుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం రైతుభరోసా కింద ఒక్క ఎకరాకు 17.500 ఎగగొట్టారని అదేవిధంగా కరెంట్ సమస్య కూడా తీవ్రంగా ఉన్నదని గ్రామాల్లో ను కరెంట్ కోతలు ఉన్నాయని, సాయంత్రం 5 గంటల నుంచి మళ్ళీ ఉదయం వరకు త్రీ ఫేజ్ రావడం లేదన్నారు. కరెంటుకు తోడు యూరియ కొరత కూడా రైతులు వేధిస్తుందనిఇలాంటి రైతు మోసాలపై రైతు మహా ధర్నా నిర్వహిస్తున్నామనీ వారి పేర్కొన్నారు. ఈ మహాధర్నకుపార్టీలకు అతీతంగా రైతులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ కానీ , రైతు భరోసా రాని రైతులు అందరూ తరలి రావాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలోఎమ్మెల్సీ కోటిరెడ్డి, జడ్పి మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, , పార్టీ నేతలు కంచర్ల కృష్ణారెడ్డి, కటికం సత్తయ్య గౌడ్ ,బొర్ర సుధాకర్,రేగట్టె మల్లికార్జున రెడ్డి,మందడి సైదిరెడ్డి,అభిమన్యు శ్రీనివాస్,తండు సైదులు గౌడ్ పాల్గొన్నారు.

# ఉచిత స్టడీ మెటీరియల్స్ పంపిణీ



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రిభువనగిరి జిల్లాలోని 188 పాఠశాలల్లో 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న 5,944 మంది విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ వారి తరుపున ఉచిత స్టడీ మెటీరియల్‌ను (హింది, తెలుగు, ఇంగ్లీషు) కరదీపికలను సంబంధిత ఉపాధ్యాయులచే తయారు చేసి, దీవీస్ లాబోరేటరీ చౌటుప్పల్ వారి ఆర్థిక సౌజన్యంతో ముద్రించారు. ఈ కరదీపికలను కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ హన్మంతరావు, జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ విద్యార్థులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ధానాలకన్నా విద్యాధానం గొప్పదని, వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దీవిస్ యాజమన్యం తరుపున కిషోర్ కుమార్, గోపిలు , కార్యాలయ సహాయ సంచాలకులు ప్రశాంత్ రెడ్డి, డిసిఈబి సెక్రటరీ పాండు నాయక్, ఏసిజిఈ రఘురాంరెడ్డి, బుక్ డిపో మేనేజర్ రంగారాజన్, ఎంఈఓలు నాగవర్ధన్ రెడ్డి, లక్ష్మీ , సెక్టోరల్ అధికారులు జె.శ్రీనివాసులు, రాధ, లింగారెడ్డి, నరహరి , ప్రధానోపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.

## బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్..!

దుర్గ్‌లో అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్..!



**రాయ్‌పూర్ :** బాలీవుడ్ ప్రముఖ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నది. సైఫ్‌పై దాడి చేసిన నిందితుడిని ఛత్తీస్‌గఢ్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. షాలిమార్ జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ప్రయాణిస్తుండగా దుర్గ్ ఆర్పీఎఫ్ అదుపులోకి తీసుకున్నది. ముంబయి పోలీసులు ఆర్పీఎఫ్ పోలీసులకు పంపారు. ఈ క్రమంలోనే ఆర్పీఎఫ్ పోలీసులు సదరు వ్యక్తిని ఆర్పీఎఫ్ అదుపులోకి తీసుకొని వీడియోకాల్ ద్వారా నిందితుడి గుర్తింపు ధ్రువీకరించారు. ప్రస్తుతం అతన్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడి ముంబయి నుంచి బిలాస్‌పూర్‌కు జనరల్ బోగీలో ప్రయాణిస్తున్నాడు. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి చొరబడి ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ క్రమంలో ముంబయి పోలీసులు దుర్గ్ ఆర్పీఎఫ్ ఓ ఫొటో పంపారని.. దాని ఆధారంగా షాలిమార్ జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఓ అనుమానాస్పద యువకుడిని అదుపులోకి తీసుకున్నామని ఆర్పీఎఫ్ ఇన్‌చార్జి సంజీవ్ సిన్హా తెలిపారు. ఆ యువకుడి పేరు ఆకాశ్ కైలాష్ కనౌజియా అని, అతని స్వస్థలం ముంబయి అని తెలిపారు. జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో బిలాస్‌పూర్ వెళ్తున్నాడని.. టిల్దా నెవ్రాలో తెలిసినవారి ఇంటికి వెళ్తున్నానని ఆర్పీఎఫ్ పోలీసులకు తెలిపాడు. ఈ క్రమంలో ముంబయి పోలీసులు రాత్రి 8 గంటల వరకు రాయ్‌పూర్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి దుర్గ్‌కు వస్తారని ఆయన వివరించారు.

## అటవీ అనుమతుల కోసం..

# కేంద్రం వద్ద పెండింగ్‌లో 161 ప్రాజెక్టులు

కేంద్ర అటవీ శాఖ డిజి జితేంద్రకుమార్‌కు వెల్లడించిన తెలంగాణ అటవీ శాఖ అధికారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర అటవీ శాఖలో అనుమతుల కోసం 161 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని తెలంగాణ అటవీ శాఖ ఉన్నతాధికారులు కేంద్ర అటవీ శాఖ డిజి జితేంద్రకుమార్‌కు వెల్లడించారు. తెలంగాణలో ఉన్న అటవీ అనుమతుల పెండింగ్ విషయంపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ జితేంద్ర కుమార్, పిసిసిఎఫ్ (హెచ్‌ఒఎఫ్‌ఎఫ్) ఆర్‌ఎం డోబ్రియల్ అధ్యక్షతన అత్యున్నత సమావేశం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో శనివారం జరిగింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ పర్యావరణ శాఖమంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి రాష్ట్రంలో అటవీ శాఖలో పెండింగులో ఉన్న వివిధ ప్రాజెక్టుల మీద చర్చించడం జరిగింది. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి అందుకు అనుగుణంగా కేంద్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్‌ను హైదరాబాద్‌కు వెళ్లాల్సిందిగా ఆదేశించింది. అందుకు సంబంధించిన సమావేశం శనివారం అరణ్యభవన్‌లో జరిగింది. ఎక్కడెక్కడ ప్రాజెక్టులు పెండింగులో ఉన్నాయో, ఎందుకున్నాయి అనే విషయాల మీద అటవీ, ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల విభాగం అధికారులను డైరెక్టర్ జనరల్ జితేంద్ర కుమార్ సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సత్వరమే ఉపయోగపడే ప్రాజెక్టుల విషయంలో అనుమతులను వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. సంబంధిత ప్రాజెక్టు వివరాలు పూర్తిస్థాయిలో కేంద్రానికి అందజేస్తే అనుమతుల జాప్యం ఉండదన్నారు.తెలంగాణ అటవీ శాఖ పిసిసిఎఫ్ డోబ్రియల్ కేంద్రం దగ్గర తెలంగాణకు సంబంధించి పెండింగ్ ప్రాజెక్టుల విషయాలు డైరెక్టర్ జనరల్ దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం 161 ప్రాజెక్టులు అనుమతుల కోసం పెండింగులో ఉన్నాయని వివరించారు.అందులో ప్రధానంగా జాతీయ రహదారులకు సంబంధించి 12 ప్రాజెక్టులు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా ఉన్నాయని తెలిపారు..

జాతీయ వన్యప్రాణి బోర్డ్(ఎన్‌బిడబ్ల్యుఎల్)లో అనుమతి గురించి మరో 38 ప్రాజెక్టులు పెండింగులో ఉన్నాయని,వీటిలో 12 సెల్ ఫోన్ టవర్స్ కు సంబంధించిన ప్రతిపాదనలుండగా, 18 ప్రతిపాదనలు పంచాయతీ రాజ్, రహదారులు భవనాల శాఖలకు సంబంధించిన రోడ్డు ప్రాజెక్టు ప్రతిపాదనలు పెండింగులో ఉన్నాయని వివరించారు.అనుమతుల విషయంలో చిన్న చిన్న సమస్యలను నేరుగా కలిసి చర్చిస్తే సత్వర పరిష్కారాలు లభిస్తాయని జితేంద్ర కుమార్ తెలిపారు.తెలంగాణ అటవీ అధికారుల పనితీరును ఆయన ప్రశంసించారు. అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా చొరవచూపడం అభినందనీయమన్నారు.అంతకు ముందు దక్షిణ రాష్ట్రాల అటవీ అధికారులతో ఏక్ పేడ్ మా కే నామ్(తల్లి పేరుతో చెట్టు నాటడం), నగర వన్ యోజన పథకాలపై చర్చించారు. ఈ పథకాల్లో ఆయా రాష్ట్రాల యొక్క లక్ష్యాన్ని ఎంతవరకు సాధించారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ అంజన్ కుమార్ మహంతీ, కేరళ పిసిసిఎఫ్ గంగా సింగ్ ,డిప్యూటీ డైరెక్టర్ జనరల్(రీజనల్ ఆఫీసర్ చెన్నై) జార్జ్ జెన్నల్, ఇన్స్‌పెక్టర్ జనరల్ త్రినాథ్ కుమార్, పిసిసిఎఫ్ ఈలు సింగ్ మేరు, పీసీసీఎఫ్(campa) డాక్టర్.సువర్ణ, అడిషనల్ పిసిసిఎఫ్ సునీత భగవత్, ఆర్ అండ్ బి ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన. సిసిఎఫ్ ప్రియాంక వర్గీస్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## సినీ నటుడిగా, నాయకుడిగా

# ఎన్‌టిఆర్ తనకు తానే సాటి : బాలకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సినీ నటుడిగా, నాయకుడిగా ఎన్‌టిఆర్ తనకు తానే సాటి అని సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. బేగంపేట రసూల్‌పుర చౌరస్తాలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ నాయకుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్‌టిఆర్ అమరజ్యోతి ర్యాలీని బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ పేదల కోసం ఎన్‌టిఆర్ టిడిపిని స్థాపించారని, ఆయనతోనే తెలుగువారిలో రాజకీయ చైతన్యం వచ్చిందన్నారు. ప్రజల వద్దకు పాలన కోసం ఎన్‌టిఆర్ ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. మద్రాసు నగరానికి మంచి నీళ్లిచ్చిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అన్నారు.



**ఎన్‌టిఆర్ సేవలు ఎప్పటికీ మరువలేం**

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నటుడు ఎన్టీఆర్ అని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఆమె నివాళి అర్పించి మాట్లాడారు. రాజకీయ రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. ఆయన సేవలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్టీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. దీని ద్వారా పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. 'ఎన్టీఆర్ సిద్ధాంతాలను ట్రస్టు పాటిస్తోంది. ఆయన వర్ధంతికి ఏటా లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తున్నాం. మీరు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు.. మరొకరి జీవితంలో సంతోషాన్ని ఇస్తుంది. నాటి నుంచి నేటి వరకు ట్రస్టుకు 8.70 లక్షల మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ప్రభుత్వ ఆసుపత్రులకు రక్తాన్ని అందించాం. చర్లపల్లి ఎన్టీఆర్ ట్రస్టు స్కూల్‌లో ఉచిత విద్య, వసతి, భోజనం కల్పిస్తున్నాం. మెరిట్ స్టూడెంట్లకు స్కాలర్ షిప్స్ ఇస్తున్నాం. ట్రస్టు ద్వారా ప్రజాసేవకు అందరికంటే ముందుంటాం. తుపాన్లు, కొవిడ్ సమయాల్లో అనేక సేవలు అందించాం' అని నారా భువనేశ్వరి తెలిపారు.

**చార్మినార్‌లో...**

ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం చార్మినార్ నియోజకవర్గంలోని లాల్ దర్వాజామోడ్ వద్ద నిర్వహించారు. టిడిపి రాష్ట్ర నాయకులు పెద్దోజు రవీంద్రచారి ఎన్‌టిఆర్ ఫొటోకు పూలమాలలు వేసి నివాలు అర్పించారు. ఎన్‌టిఆర్ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నవల్ కిషోర్ అగర్వాల్, అలియాబాద్ మాజీ కార్పొరేటర్ జి. శంకర్ ముదిరాజ్, ఎ.చంద్రకుమార్, సల్లా రాజ్ కుమార్, కె.శ్రీకాంత్, బి.వై.శ్రీకాంత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

**దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో..**

ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్ కుమార్ గౌడ్, పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా, నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి పి.బాలరాజ్ గౌడ్, పెద్దోజు రవీంద్రాచారి, ఎస్.ప్రకాష్, కట్ట రాములు, వెంకటేశ్ చౌదరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బి.రాజు, శ్యామ్ సుందర్, భవాని శ్రీనివాస్, జయరాజ్ యాదవ్, సత్యనారాయణ, భాను ప్రకాష్, వినోద్, కిరణ్, సలీమ్, విఠల్, యాదగిరి, చంద్ర మోహన్, శక్తి ప్రేమ్, అన్వర్ హుస్సేన్, జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ ఘాట్ నిర్వహణపై..

# ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అసహనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్‌టిఆర్ ఘాట్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద లోకేశ్ నివాళులు అర్పించారు. అయితే ఘాట్ నిర్వహణను చూసి ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని లోకేశ్ గమనించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్‌ఎండిఏ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్‌టిఆర్ ఘాట్ మరమ్మతు పనులు తన సొంత నిధులతో వెంటనే చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్‌టిఆర్ ఘాట్ నిర్వహణను హెచ్‌ఎండిఏ అధికారులు పట్టించుకోవడం లేదంటూ అక్కడికి వచ్చిన ఎన్‌టిఆర్ అభిమానులు సైతం తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఘాట్ నిర్వహణ తమకు అప్పగించాలని గతంలో పలుమార్లు తెలంగాణ ప్రభుత్వానికి ఎన్‌టిఆర్ ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. తాజాగా ఎన్‌టిఆర్ ఘాట్ నిర్వహణను చూసి ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్ అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఉదయం నుంచి ఎన్‌టిఆర్ ఘాట్ వద్దకు నందమూరి, నారా కుటుంబసభ్యులు, బంధువులు, హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ, రామకృష్ణ, నందమూరి సుహాసిని, జూనియర్ ఎన్‌టిఆర్, కల్యాణ్ రామ్, లక్ష్మి పార్వతి, ఏపి ఉపసభాపతి రఘురామకృష్ణరాజు సహా పలువురు ప్రముఖులు ఎన్‌టిఆర్ అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు.



**తెలంగాణలో పార్టీని పునర్నిర్మిస్తాం : నారా లోకేశ్**

తెలంగాణా పార్టీలో పునర్నిర్మాణం చేయాల్సి ఉందని నారా లోకేశ్ అన్నారు. స్వచ్ఛందంగా ప్రజలే వచ్చి 1.60 లక్షలమంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. టిడిపి ఎమ్మెల్యేలు లేకుండానే ఇంత మంది సభ్యత్వాలు తీసుకోవడం గొప్ప విషయమని చెప్పారు. గతంలో తెలంగాణలో అత్యధిక సభ్యత్వం ఉండేదన్నారు. తెలుగుదేశం పార్టీపై తెలంగాణ ప్రజల్లో ప్రేమ, అభిమానాలు ఉన్నాయన్నారు. తెలంగాణలో పార్టీ పునరుజ్జీవనానికి త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టిడిపి సీనియర్ నేతలు బక్కని నరసింహులు, అరవిందకుమార్ గౌడ్, టిటిడి సభ్యులు నర్సి రెడ్డి, పి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళతామన్నారు. ఎన్‌టిఆర్‌కు 'భారతరత్న' వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

## కావలి అబ్బాయి.. మధ్యప్రదేశ్ అమ్మాయి

# ఓయో రూముల్లో ఉంటూ గంజాయి వ్యాపారం



మూడు కేసుల్లో 3.625 కేజీల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇద్దరు చేసేది ఒకే గంజాయి వ్యాపారం. కావలికి చెందిన దేవేందుల రాజు, మధ్యప్రదేశ్ కు చెందిన సంజనా మాంజా ఎలా కలిశారో తెలియదు కానీ.. ఇద్దరు కలిసి ఓయో రూముల్లో నివాసం ఉంటూ గత కొంతకాలంగా గంజాయి వ్యాపారం చేస్తూ ఎట్టకేలకు ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ పోలీసులకు పట్టుబడ్డారు. ఇద్దరు మధ్య ఎలా స్నేహం కుదిరిందో లేదో తెలియదు కానీ.. కొండాపూర్‌లోని కిమ్స్ హాస్పిటల్ సమీపంలో ఉన్న ఓయో రూములో ఇద్దరూ గత కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ కలిసి వివిధ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువస్తూ అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఎస్‌టిఎఫ్ టీం లీడర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్‌టీం శుక్రవారం రాత్రి దాడి చేసి ఈ ఇద్దరిని పట్టుకున్నారు. వీరి వద్ద నిల్వ ఉన్నటువంటి ఒకటి పాయింట్ రెండు కేజీల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. మరో సంఘటనలో దూల్‌పేట్ జాలి హనుమాన్ టెంపుల్ సమీపంలో రాఖీ భాయ్ అనే మహిళ గంజాయి అమ్ముతుండగా ఎస్‌టిఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 1.225 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాఖీ భాయ్‌ని అరెస్టు చేశారు. ఈ కేసులో రమేష్ సింగ్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశారు. మరో కేసులో ఆఫీస్‌నగర్ గోల్కొండ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు 1.2 కేజీల గంజాయిని ఎస్‌టిఎఫ్ టీం పట్టుకున్నారు. ఈ కేసులో సయ్యద్ గౌస్ మహమ్మద్ షాబుద్దీన్‌లను అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

## భారత్–బంగ్లా సరిహద్దుల్లో రైతుల మధ్య ఘర్షణ

పరిస్థితి అదుపులో ఉంది : బిఎస్ఎఫ్

**మాల్దా :** భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో శనివారం ఉదయం ఇరు దేశాల రైతుల మధ్య వాగ్వాదం చెలరేగింది. పరస్పర దుర్భాషలు, రాళ్ళు రువ్వుకోవడంతో ఈ వాగ్వాదం తర్వాత స్వల్ప ఘర్షణకు దారితీసింది. ఐనప్పటికీ కూడా పరిస్థితి అదుపులోనే ఉందని పారామిలిటరీ దళాలు చెప్పాయి. సరిహద్దులో వివాదాలకు రైతులు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ఒక ప్రకటనలో బిఎస్ఎఫ్ విజ్ఞప్తి చేసింది. ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారాలకు తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేసింది. వివాదాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరింది. ఈ ఘర్షణ తర్వాత బంగ్లాదేశ్ వైపు మధ్యాహ్నంపూట అంతర్జాతీయ సరిహద్దుకు 75 మీటర్ల దూరంలో కొంతమంది గుంపుగా చేరారు. ఐతే వారిని బంగ్లాదేశ్ సరిహద్దు గార్డులు దూరంగా తరిమికొట్టారు.

సరిహద్దు భద్రతాదళం గస్తీ ఔట్‌పోస్టు సమీపంలో ఈ వాగ్వాదం, జరిగింది. దీంతో సరిహద్దు భద్రతాదళం, బంగ్లాదేశ్ సరిహద్దు గార్డులు రెండు వైపుల నుండి సరైన సమయంలో జోక్యం చేసుకోవడంవల్ల ఘర్షణ పెద్దది కాకుండా నివారించగలిగామని బిఎస్ఎఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. సరిహద్దుల్లో సుఖ్‌దేవ్‌పూర్ సరిహద్దుల్లో భారత సరిహద్దు భద్రతాదళం ఫెన్సింగ్ నిర్మిస్తోంది. ఈనెల ఆరో తేదీన ఈ ఫెన్సింగ్ నిర్మాణానికి బంగ్లాదేశ్ గార్డులు అభ్యంతరం ప్రకటించారు. తమ సరిహద్దు భూమిలో ఫెన్సింగ్ నిర్మిస్తున్నారని వారు వాదించడంతో తాత్కాలికంగా ఈ నిర్మాణ పనిని నిలిపివేశారు. ఇప్పుడు అదే ప్రదేశంలో రైతులమధ్య వాగ్వాదం జరిగింది. ఐతే చర్చల ద్వారా ఈ వివాదాన్ని పరిష్కరించామని, ఫెన్సింగ్ నిర్మాణాన్ని ఆ మరునాడే ఎలాంటి ఆటంకాలూ లేకుండా పునరుద్ధరించామని బిఎస్ఎఫ్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రకటన ప్రకారం, శనివారం ఉదయం 11.45 గంటలకు సుఖ్‌దేశ్‌పూర్ సరిహద్దు ఔట్‌పోస్ట్ సమీపంలో రైతుల మధ్య ఈ జగడం ప్రారంభమైంది. వాగ్వాదం చాలా వేగంగా పెరిగి పెద్దదైపోయింది. ఇరువైపులా ఉన్న రైతులు పెద్దసంఖ్యలో అక్కడ గుమిగూడారు. పరస్పరం తీవ్ర దుర్భాషలాడుకున్నారు. రాళ్ళు విసురుకున్నారు. ఐతే వెంటనే ఈ పరిస్థితిని బిఎస్ఎఫ్ అదుపులోకి తెచ్చింది. ఇరువైపులా గుమిగూడిన రైతులను చెదరగొట్టి అందరినీ దూరంగా పంపించేశారు. ఈ విధంగా భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలు వచ్చినా వెంటనే సరిహద్దు భద్రతా దళానికి తెలియజేయాలని రైతులకు బిఎస్ఎఫ్ తెలియజేసింది. శాంతియుతంగా వ్యవహరించాలని భారత రైతులకు విజ్ఞప్తి చేస్తున్నామని ఆ ప్రకటనలో బిఎస్ఎఫ్ పేర్కొంది. సరిహద్దుల్లో వివాదాలకు దూరంగా ఉండాలని భారత రైతులకు విజ్ఞప్తి చేసింది.

## కొత్త బస్ డిపోలు, బస్ స్టేషన్ల నిర్మాణానికి ఆర్‌టిసి అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పలు కొత్త బస్ డిపోలు, బస్ స్టేషన్ల నిర్మాణం, బస్ స్టేషన్ల విస్తరణకు తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి బోర్డు అనుమతినిచ్చింది.హైదరాబాద్ బస్ భవన్‌లో ఆర్‌టిసి బోర్డు శనివారం సమావేశమైంది. ఈ సమావేశంలో కొత్త డిపోలు, బస్ స్టేషన్లకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లిలో కొత్త బస్ డిపో నిర్మాణానికి రూ.11.70 కోట్లను, మంథని బస్ స్టేషన్ విస్తరణకు రూ. 95.00 లక్షలు, ములుగు జిల్లా ఏటూరునాగారంలో కొత్త బస్ డిపో నిర్మాణానికి రూ.6.28 కోట్లు, ములుగు జిల్లా ములుగులో కొత్త బస్ స్టేషన్ నిర్మాణానికి రూ.5.11 కోట్లను,అలాగే మంగపేటలో కొత్త బస్ స్టేషన్ నిర్మాణానికి రూ.51 లక్షలు, సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్‌లో కొత్త బస్ స్టేషన్ కోసం రూ. 3.75 కోట్లను, కోదాడ్ వద్ద ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి రూ.17.95 కోట్లు, ఖమ్మం జిల్లా మధిరలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి రూ.10 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి, రాబోయే సరస్వతి పుష్కరాల దృష్ట్యా రూ.3.95 కోట్లను కేటాయిస్తూ ఆర్‌టిసి బోర్డు అనుమతులను మంజూరు చేసింది. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త డిపోల ఏర్పాటుతో పాటు ప్రస్తుతం ఉన్న 97 డిపోలు, బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్‌టిసి బస్సులో రద్దీ పెరిగిందని, అందుకు అనుగుణంగా కొత్త బస్ స్టేషన్ల నిర్మాణంతో పాటు ఉన్నవాటిని విస్తరిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు రవాణాపరంగా ఎటువంటి ఇబ్బందులు రాకుండా, కొత్త బస్సులను కొనుగోలు చేస్తూనే, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని వివరించారు. ఆర్‌టిసి బోర్డు అనుమతించిన నూతన డిపోలు, బస్ స్టేషన్లను త్వరతిగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

## అక్రమ ఆయుధాల కేసులో

# మార్కెట్ సతీష్‌కు జైలుశిక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇన్‌స్పెక్టర్‌ను చంపేందుకు రివాల్వార్‌తో తిరుగుతూ పట్టుబడిన కేసులో సైదాబాద్‌కు చెందిన మార్కెట్ సతీష్‌కుమార్ అలియాస్ మార్కెట్ సత్యా (34)తో పాటు అతని ముగ్గురు అనుచరులకు గుల్బర్గా (కాలిబుర్గి) మూడవ అదనపు, సెషన్స్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధించింది. అలాగే నిందితులు ఉపయోగించిన కారు యజమానికి రూ.5 లక్షల జరిమానా విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్‌కు చెందిన సతీష్‌కుమార్ 15 ఏళ్ల క్రితం గుల్బార్గాలో స్థిరపడ్డాడు. ఇతనిపై హత్యా, హత్యాయత్నం, కిడ్నాప్, దోపిడీలు, దొంగతనాలు, అక్రమ ఆయుధాలు తదితర సుమారు 30కిపైగా కేసులు గుల్బార్గాలో ఉన్నాయి. ఇతను అక్కడ గ్యాంగ్ లీడర్‌గా ఎదగడంతో అతని ముగ్గురు అనుచరులు గతంలో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. దీంతో అతను ఆ భయంతో మూడేళ్ల క్రితం సైదాబాద్‌కు పారిపోయి వచ్చి కోట్ల రూపాయలతో ఇంటిని నిర్మించుకుని ఇక్కడి నుంచే కార్యక్రమాలు చేపడుతున్నాడు. అప్పటి స్టేషన్ బజార్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ రాజశేఖర హలగోడిని చంపడానికి సతీష్ గ్యాంగ్ కుట్ర పన్నారు. ఈ క్రమంలో 2016 జులై 4న నగరంలోని అటవీ శాఖ కార్యాలయం సమీపంలో కారులో రివాల్వార్‌తో సతీష్ అతని అనుచరులు తిరుగుతుండగా అతన్ని హలాగోధిని వద్ద వెంబడించిన గుల్బర్గా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి మహమూద్ ముజీర్ ఉల్లా దోషులు మార్కెట్ సత్య, అప్పుషా సతలింగయ్య, మల్లికార్జున సిద్దన్న తెంగలి, ఆకాశ భీమశ్యా గుత్తేదార్లకు శిక్షలు ఖరారు చేశారు. ఆయుధాలు ఉన్న కారు యజమాని నుంచి రూ.5 లక్షలు రికవరీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ గురులింగప్ప తేలి వాదనలు వినిపించారు.

# ఆప్‌తో పొత్తు లేదు కానీ..



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో పొత్తు లేదు కానీ తలుపులు మూసుకుపోలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎఐసిసి కోశాధికారి అజయ్ మాకెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జాతీయ స్థాయిలో 'ఇండియా'' కూటమి భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, ఆప్.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ప్రత్యర్థులు తలపడుతున్నాయి. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్‌కు కాంగ్రెస్ సపోర్ట్ చేసే అవకాశాలున్నాయా అని మాకెన్‌ను మీడియా అడిగినప్పుడు, అవసరమైతే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఉండొచ్చని, అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని ఆయన సమాధానమిచ్చారు. 'ఆప్‌తో పొత్తు తగదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. 2013లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు కాంగ్రెస్ సపోర్ట్ సరికాదని నేను అనుకుంటున్నాను. అయితే ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే'' అని మాకెన్ తెలిపారు. కేజ్రీవాల్ 'యాంటీ నేషనల్' అంటూ గతంలో చేసిన వ్యాఖ్యలపై అడిగినప్పుడు, తాను తన వ్యక్తిగత అభిప్రాయం చెప్పానని, దానికి కట్టుబడి ఉంటానని అన్నారు. 2013లో ఆప్‌కు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం, 2024లో జతకట్టడం వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరిగిందని ఆయన చెప్పారు. ఢిల్లీ ప్రజలు సమస్యలు ఎదుర్కోవడం వల్ల బీజేపీకి లబ్ధి చేకూరుతుందనేది తన నిశ్చితాభిప్రాయమని అన్నారు. కేజ్రీవాల్‌కు ఢిల్లీలో ప్రాముఖ్యత పెరిగితే అది బీజేపీకే కలిసొస్తుందని, బీజేపీతో పోరాడాలంటే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉండటం అవసరమని అన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా లేకపోతే బీజేపీతో పోరాడటం కష్టమని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజకీయంగా ఢిల్లీకి అంతగా ప్రాధాన్యం లేని విషయాన్ని ప్రశ్నించినప్పుడు, అది అందరికీ తెలిసినదేనని, ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు గెలుచుకున్న పార్టీనే కేంద్రంలో అధికారం ఏర్పాటు చేస్తుంటుందని, ఢిల్లీలో బీజేపీతో పోరాటంలో ఆప్ విఫలమవుతోందని చెప్పారు. హర్యానా, ఢిల్లీలో ఆప్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవాలని అనుకుందని, అయితే జైలు నుంచి విడుదల కాగానే హర్యానాలోని 90 స్థానాల్లోనూ తమ పార్టీ పోటీ చేస్తుందని కేజ్రీవాల్ ప్రకటించారని గుర్తు చేశారు. అప్పటికే పొత్తు చర్చలు అడ్వాన్స్‌డ స్థాయిలో ఉన్నాయని చెప్పారు. ఢిల్లీ విషయంలో కూడా లోక్‌సభ ఎన్నికలు కాగానే ఢిల్లీలో సొంతంగా పోటీ చేస్తామని కేజ్రీవాల్ ప్రకటించారని అన్నారు. ఢిల్లీలో షీలాదీక్షిత్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ మొత్తం 7 లోక్‌సభ స్థానాలను సొంతంగా గెలుచుకుందని, బీజేపీ నిలువరించిందని చెప్పారు. ఎప్పుడైతే ఆప్ ఢిల్లీలో అధికారంలోకి వచ్చిందో, ఢిల్లీలోని లోక్‌సభ స్థానాలన్నింటినీ బీజేపీ గెలుచుకుని కేంద్రంలో అధికారంలోకి వస్తోందన్నారు. అప్పుడు బీజేపీతో ఉన్నది ఎవరు? అని అజయ్ మాకెన్ ప్రశ్నించారు.

## రైతుల డిమాండ్లపై చర్చించేందుకు 14న సమావేశం



**చండీగఢ్ :** నిరసన తెలుపుతున్న రైతుల డిమాండ్లను చర్చించడానికి ఫిబ్రవరి 14న చండీగఢ్‌లో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించిందని కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు శనివారం తెలిపారు. ఈ ప్రకటన తర్వాత రైతులు నాయకులు ప్రతిపాదిత సమావేశంలో పాల్గొనేందుకు వీలుగా వైద్య సహాయం తీసుకోవాలని గత 54 రోజుల నుంచి నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్‌కు విజ్ఞప్తి చేశారు. జాయింట్ సెక్రటరీ ర్యాంక్ అధికారి ప్రియ రంజన్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం ఖనౌరిలో దల్లేవాల్‌ను కలిసి సంయుక్త కిసాన్ మోర్చా (నాన్‌పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. అంతకుముందు, పంజాబ్, హర్యానా మధ్య ఖనౌరి, శంభు సరిహద్దు పాయింట్ల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు శనివారం కేంద్ర ప్రభుత్వం నుండి ఒక ప్రతిపాదన వచ్చిందని, దానిపై తాము చర్చిస్తామని చెప్పారు.



## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/వంగూర్ :** 2025 సంవత్సరం ప్రజాపక్షం క్యాలెండర్‌ను శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు ఇబ్రహీం, అంజయ్య, కానిస్టేబుల్ రాంబాబు, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని డిండిచింతపల్లి గ్రామానికిచెందిన కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త బీసులింగయ్య(85) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయచైర్మన్ రాజేందర్, యూత్‌కాంగ్రెస్ అసెంబ్లీ క్యామమల్లయ్య బీసులింగయ్య పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్, రాజశేఖర్, కుర్మయ్య, తిరుపతయ్య, సాయిబాబు ఉన్నారు.

## క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడిగా జిపి



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** క్లాస్మేట్ అధ్యక్షుడిగా ఆలంపల్లి ప్రదీప్ కుమార్ ను క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్,రాష్ట్ర కమిటీ సభ్యులు బాద్మి రవి శంకర్ మేడి శెట్టి రామకృష్ణ సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకోవడం జరిగింది. సెక్రెటరీ గా కట్ట వెంకటేష్, ట్రెజరర్ గా కృష్ణ యాదవ్, ఈ కార్యక్రమంలో బాచి, కొదండ రామయ్య, ఆలంపల్లి సురేష్, రామకృష్ణ పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జడ్చర్ల కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగినది.

## ఇండ్ల పథకంలో ఘర్షణ



**ప్రజాపక్షం/అచ్చంపేట :** పట్టణంలోని ఇందిరమ్మ ఇండ్లకాలనీలో ఉచితఇండ్ల పంపిణీలో వివాదం చోటుచేసుకొని కత్తిపోట్లకు దారితీసింది. కాలనీవాసుల వివరాల ప్రకారం అచ్చంపేట మున్సిపల్ కేంద్రంలో రాజీవ్‌నగర్‌కాలనీలో 2008లో ఇందిరమ్మ ఇండ్లపేరుతో కాంగ్రెస్‌ప్రభుత్వం పేదలకు 50గజాలచొప్పున ఇండ్లు పంపిణీచేశారు. ఇక్కడిస్థలాలో కొందరు బినామిలు సిండికేట్‌గా మారి అతితక్కువ ధరకుకొని లక్షలలో అమ్ముతున్నట్లు తెలిసింది. ఈసంఘటనలో సంతోష్, రామకృష్ణ అనేవ్యక్తులు డబ్బులవిషయంలో కొద్దిరోజులుగా ఘర్షణపడుతున్నట్లు తెలిసింది. శనివారం ఉదయం సంతోష్ అనే వ్యక్తి రామకృష్ణ అనేవ్యక్తికి డబ్బులు ఇవ్వాలని ఘర్షణపడ్డారు. ఈఘర్షణలోభాగంగా సంతోష్‌అనేవ్యక్తి సమీపంలో ఉన్న కిరాణదుకాణంలో ఉన్న కత్తితో రామకృష్ణపై ఆరుసార్లు గాయపర్చినట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణను నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

## కలెక్టర్‌ను సన్మానించిన నిఖిల్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఊర్కొండ :** ప్రభుత్వ సంక్షేమపథకాల అమలులో క్షేత్రస్థాయి మండల పర్యటనలోభాగంగా మండలానికివిచ్చేసిన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్‌ని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మాదారం మాజీసర్పంచ్ ధ్యాపనిఖిల్‌రెడ్డి మండలకేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్‌జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, జిల్లెల్ల మాజీసర్పంచ్ రాములు ఉన్నారు.

## మూర్ఛ వ్యాధితో రైతు మృతి

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** పొలం పనులు చేస్తుండగా మూర్ఛ రావడంతో పొలంలోనే రైతు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం మండల పరిధిలోని వల్లభాపూర్ తండాకు చెందిన కాట్రావత్ సోమ్లా (36) అనే రైతు తన సొంత వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఒక్క సారిగా మూర్ఛ రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతునికి భార్య కొద్ది కాలం క్రితం మరణించింది.కుమారుడు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రాష్ట్ర స్థాయి చెస్ విజేతకు సన్మానం



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ వనపర్తి జిల్లా బెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అండర్ 11 ఇయర్స్ స్థాయి చెస్ పోటీలలో వనపర్తి పట్టణంకు చెందిన 29వ వార్డుకు చెందిన రవిచంద్ర శిరీష కుమారుడు రవీష్ చంద్ర, జూనియర్ చెస్ 11 సంవత్సరాలలో జరిగిన చెస్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందాడు. స్థానిక బారాస జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ స్థానిక కౌన్సిలర్ భార్గవి ప్రేమ్ నాథ్ రెడ్డి అభినందించారు. జిల్లా భారత రాష్ట్ర సమితి అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడారు. రవిచంద్ర తాతయ్ విశ్వమోహనాచారి, సత్యనారాయణ చారి, సత్యనారాయణగౌడ్ , మాధవరావుపల్లి , శ్రీనివాసులు, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా సంక్షేమ పథకాల సర్వే

### వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి





**ప్రజాపక్షం / పాన్‌గల్ :** సంక్షేమ పథకాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేవిధంగా అధికారులు సర్వే చేయాలని సూచించారు. శనివారం పాన్‌గల్ మండలం చింతకుంట పర్యటించి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. సంక్షేమ పథకాల లబ్దిదారుల తుది జాబితా వివరాలు వెల్లడించేందుకు, అభ్యంతరాలు స్వీకరించేందుకు జనవరి 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలు ఏ రోజు ఏ గ్రామంలో నిర్వహిస్తున్నారో ముందుగానే చాటింపు వేయించాలని ఆదేశించారు. పాన్‌గల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ క్షేత్ర స్థాయిలో సిబ్బంది సర్వే చేసేందుకు ఎలాంటి డాక్యుమెంట్లు, ఆధారాలు ఇచ్చి పంపించారు. ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలను గుర్తించారు. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే పై ఆరాతీశారు. కలెక్టర్ వెంట పాన్‌గల్ , తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవిందరావు, వ్యవసాయ శాఖ అధికారిరాజవర్ధన్‌రెడ్డి,అధికారులుతదితరులు ఉన్నారు.

### అవకతవకలకు తావివ్వొద్దు

**వీపనగండ్ల:** సర్వే ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం వీపనగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో సర్వే నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి వ్యవసాయేతర ఉపయోగించే భూములలో చేపల చెరువులు, ఇండ్ల స్థలాల కోసం వేసిన వెంచర్లు తదితర వాటిని గుర్తించి సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం గోవర్ధనగిరి గ్రామ సమీపంలో కొనసాగుతున్న చేపల చెరువును పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పలువురు భూ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మప్ప, తహసీల్దార్ వరలక్ష్మి , ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిపిఆర్వో సీతారాం, వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ , డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, భూకొలత అధికారి శివ తదితరులు ఉన్నారు.

## ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచండి

**ప్రజాపక్షం /జడ్చర్ల :** జడ్చర్ల లోని వంద పడకల ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలని రోగులకు మరింత మెరుగైన సేవలను అందించడానికి కావలసిన ఏర్పాట్లను చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ లో దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యంగా ఆస్పత్రిలో డాక్టర్లు ఇతర సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాలానగర్ లోని 30 పడకల ఆసుపత్రికి అవసరమైనటువంటి ఉద్యోగులను భర్తీ చేయాలని ఇతర సౌకర్యాలను మెరుగుపరచాలని అనిరుధ్ కోరారు. వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. దీని పై మంత్రి స్పందిస్తూ జడ్చర్లలో వైద్య సదుపాయాలను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇతర శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీహరి ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**ప్రజాపక్షం/అచ్చంపేట :** శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి తిరుగుప్రయాణం చేస్తుండగా అచ్చంపేట మండలం హాజీపూర్‌చౌరస్తా వద్ద శ్రీశైలం హైదరాబాద్ జాతీయరహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... శ్రీశైలంవెళ్లి తిరుగుప్రయాణం చేస్తుండగా కర్ణాటకకు చెందిన కారులో ఒకే కుటుంబానికిచెందిన 12మంది దైవదర్శనానికి చేరుకొని తిరుగు ప్రయాణం చేస్తున్నారు. వీరు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందినవారు. అచ్చంపేట మండలం హాజీపూర్ గ్రామం వద్ద శ్రీశైలం హైదరాబాద్ రహదారివద్ద ఈప్రమాదం జరిగింది. హైదరాబాద్‌వైపు నుండి రంగాపూర్ జాతరకు వస్తున్న కారు కర్ణాటకకు వెళ్లే వాహనాలను ఢీకొనడంతో బిలాల్ (28)అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. కర్ణాటకకు చెందిన విష్ణుకాంత్, విజయలక్ష్మి ,వాసవి, మంజు, జగదీష్ అనే వ్యక్తులు గాయపడగా అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మహిళల ఆర్థిక అక్షరాస్యతకు ప్రాధాన్యత



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** గ్రామీణ ప్రజలందరూ బ్యాంకులు అందిస్తున్న సేవల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికార శాఖ కేంద్రం ఫైనాన్షియల్ లిట్రసి సుమ అన్నారు. శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా ఘనపూర్ మండలంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన , సుకన్య సమృద్ధి యోజన మొదలగు, పథకాల గురించి వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా 10 ఏళ్ల లోపు బాలికలకు పొదుపు ఖాతాలను తెరవాలని సూచించారు. సైబర్ క్రైం, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్ , బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ బాలలకు 1098, సైబర్ క్రైమ్ సంబంధించి 1930, మహిళలకు గృహహింస 181, పోలీస్ 100, వయోవృద్ధులు 14567 టోల్ ఫ్రీ నంబర్లు వాటి ఉపయోగాల గురించి మహిళకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారక కేంద్రం స్పెషలిటి ఫైనాన్షియల్ లిట్రేసి సుమ, జిల్లా మహిళఆ సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మ, ఏపిఎం రాంబాబు, సఖి కేంద్రం కేస్ వర్కర్ శ్రావణి, మిషన్ పరివర్తన కమ్యూనిటి ఎడ్యుకేటర్ సాయి లీల, విఓఏలు, ఈసీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమా చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం / పెబ్బేరు :** బున్యాధిపూర్ గ్రామానికి చెందిన సువర్త చనిపోవడం జరిగింది. వాళ్ల కొడుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భీమా కింద వారి కుటుంబానికి 5 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే మేఘారెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ , మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ , శ్రీహరి , బీరం రాజశేఖర్ రెడ్డి, రాజాగౌడ్ , శ్యాంసుందర్ , మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు జారీ

### కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు జారీకి ప్రభుత్వం సిద్ధమైందని కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు ప్రకటన చేశారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని 1వ వార్డు రాయిగడ్డ, నడింగేరి వార్డులలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందుతుందన్నారు.కుల సర్వే సమాచారం ఆధారంగానే కొత్త రేషన్ కార్డులు వస్తాయని, ఎలాంటి అపోహాలు వద్దని మండ్ల దేవన్న నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా దేవన్న మాట్లాడుతూ జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం రేషన్ కార్డు ఇందిరమ్మ ఇంటి సర్వేకు ఐదు మంది కమిటీ సభ్యులు ఉంటారు. 21 తేదీ నుండి 24 తేదీ వరకు వార్డు సభల్లో, గ్రామ సభలో సర్వే జరుగుతుందన్నారు. ప్రజా పాలన కొనసాగిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి సారాధ్యంలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లను అందజేయాలని సంకల్పంతో ముందుకు వెళ్తున్నారన్నారు. పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని, ఆ విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదని దేవన్న స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## చెప్పేది ఒకటి .... చేసేది మరొకటా!

### కలెక్టర్‌ను నిలదీసిన కొట్ర గామస్తులు



**ప్రజాపక్షం/వెల్దండ :** ప్రభుత్వం చెప్పేది ఒకటైతే అధికారులుచేసేది మరొకటి ఎందుకని ప్రజలు ప్రశ్నించారు. వెల్దండ మండలం కొట్రగ్రామంలో శనివారం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పర్యటించారు. ఈ సందర్భంగా బిజెపి మాజీ మండలఅధ్యక్షుడు జూలూరి బాలస్వామితోపాటు గ్రామస్తులు కలెక్టర్‌తో మాట్లాడారు. ప్రజాపాలనలో దాదాపు 800మంది రేషన్‌కార్డులకోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 40మందిపేర్లురావడం వింతగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా గృహజ్యోతి పథకంలోభాగంగాజీరో కరెంటుబిల్లుకేవలం 20శాతంమందికి మాత్రమే వస్తుందని, అదేవిధంగా ఫ్రీ సిలిండర్ జాడేలేదని కలెక్టర్‌ముందు వాపోయారు. కలెక్టర్‌కు తమగోడును వినిపిస్తుంటే అక్కడ ఉన్న కొంతమంది అధికారులు బాలస్వామితో వాగ్వాదానికిదిగడం ఆశ్చర్యానికి గురిచేసింది. కార్యక్రమంలో గ్రామ యువనాయకులు వసంతపు రాజు, సత్యం ఉన్నారు.

## అందరికీ రుణపడి ఉంటా : కసిరెడ్డి నారాయణరెడ్డి





**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శనివారం పట్టణంలోని పాలమూరుచౌరస్తాలో కాంగ్రెస్ పార్టీనాయకులు ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా కాంగ్రెస్‌పార్టీనాయకులు, కార్యకర్తలు పాలమూరుచౌరస్తాలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కేక్‌కట్‌చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు గజమాలశాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో మహిత ఆస్పత్రి రుంగి ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదానశిబిరం ఉచితవైద్యశిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలు తనపైచూపించిన అభిమానానికి ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. తనపుట్టినరోజున వైద్యశిబిరాలు, సేవా కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చురామకృష్ణ ఎమ్మెల్యేకు శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, మార్కెట్‌కమిటిచైర్మన్ మనీలాసంజుయాదవ్, మాజీసర్పంచులు భూపతిరెడ్డి, జిల్లెల్లరాములు, కౌన్సిలర్లు గోరటిశ్రీనివాస్, ఎజాజ్, బాలునాయక్, రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్‌అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మిర్యాలశ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, జమ్ములశ్రీకాంత్, సంతుయాదవ్, మార్కెట్‌డైరెక్టర్లు రమాకత్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను మండలకాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఇందిరాగాంధీ విగ్రహంవద్ద జన్మదినం సందర్భంగా ఉచితవైద్య శిబిరాలు ఏర్పాటుచేసి భారీకేక్‌కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, మట్టవెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్‌యాదవ్, భూపతిరెడ్డి, కొయ్యలపుల్లయ్య, మట్టనారాయణగౌడ్, కష్ణముదిరాజ్, నారాయణ, ఆలీసాబ్, తిరుగుడురాజు ,ఎర్రశ్రీనుముదిరాజ్, ముదిగొండ రమేష్, కిష్టాల్, మట్టభరత్‌గౌడ్, జక్కులచిన్నజంగయ్యయాదవ్, జక్కులశ్రీనివాస్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, పురుషోత్తమచారి పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని మండల పరిధిలోని కల్వరాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు ,కార్యకర్తలు అభిమానులునిర్వహించారు. సీనియర్ నాయకులు బిచ్చారెడ్డి, వెంకటేశ్వర్లు, తెలుగు శ్రీను, రామచంద్రయ్య, నర్సింహ, బాలవెంకటయ్య, కృష్ణయ్య, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలో అభివృద్ధికి అన్ని విధాలా సహకారం





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధిః** భగవంతుని సేవ లో అందించాలి అని నూతనంగా ఎంపికైన మన్యం కొండ దేవస్థానం పాలకమండలి సభ్యులతో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం లోని మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పాలకమండలి నూతన సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భగవంతుని సేవ లభించడం ఇది పూర్వ జన్మ సుకృతం అని, భగవంతునికి చేరువగా చేరి సేవ చేసుకొని అవకాశం చాలా అరుదుగా మాత్రమే లభిస్తుందన్నారు. మన్యం కొండ దేవస్థానాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకుందామన్నారు.దేవాలయ చైర్మన్ అలహరి మధుసూదర్ చారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లు అనిల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, బాక్ల కాంగ్రెస్ అధ్యక్షులు సూధాకర్ రెడ్డి, ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, మన్యం కొండ దేవస్థానం పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

### కాలనీలను అభివృద్ధి చేస్తాం

మహబూబ్ నగర్ పట్టణంలోని కాలనీలను అభివృద్ధి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని కోయిల్ కొండ ఎక్స్ రోడ్, వార్డు నెంబర్ 15 లో సైడ్ డ్రైనేజీ కోసం 13 లక్షల రూపాయల తో నిర్మించనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కౌన్సిలర్ లతా, లక్ష్మణ్ నాయక్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఎఈ అంజిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు శామ్యూల్ దాసరి, శంకర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### కులమతాలకు అతీతంగా..

కులమతాలకు అతీతంగా పట్టణం లోఅభివృద్ధి చేస్తున్నామనిఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ లోని వీరన్న పేట వార్డు నెంబర్ 14 లోని అభయాంజనేయ స్వామి దేవాలయం ఆవరణ లో 3.50 లక్షల రూపాయల తో నిర్మించిన షెడ్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కౌన్సిలర్‌గా అంజయ్య, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, బండి మల్లేష్ యాదవ్, లీడర్ రఘు, డీలర్ రఘు,క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు శామ్యూల్ దాసరి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్ నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ లోని వార్డు నెంబర్ 11 న్యూ బాలాజీ నగర్‌లో నిర్మించనున్న సిపి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కౌన్సిలర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ ఉన్నారు.

# క్రీడ

## షో కేస్

## కార్ ర్యాలీ.. అంత ఈజీ కాదు



కార్ రేస్ లేదా కార్ ర్యాలీలో పాల్గొనడమంటే ప్రమాదాలతో చెలగాటం ఆడడమే. ప్రాణాలకు తెగించడమే. గంటలు పడిన లేదా మంచులో కూరుకుపోయిన అత్యంత సంక్లిష్టమైన రోడ్లపై, వేగంగా వాహనాన్ని నడపడం, ఎలాంటి ప్రమాదానికి గురికాకుండా లక్ష్యాన్ని చేరుకోవడం అనుకున్నంత సులభం కాదు. కొన్ని చోట్ల కొండ మలుపులు ఉంటాయి. మరికొన్ని చోట్ల మట్టి, బురద... డ్రైవింగ్‌కు ఏమాత్రం అనుకూలించని రోడ్లపై, నైపుణ్యం.. పట్టుదల.. ధైర్యంతోపాటు అంతులేని ఆత్మవిశ్వాసం ఉంటేతప్ప డ్రైవింగ్ చేయలేరు. ఇంతటి కష్టతరమైన ర్యాలీ విందు అందించడానికి మొనాకో సిద్ధమవుతున్నది. ప్రతిష్టాత్మక మోంటేకార్లో కార్ ర్యాలీ ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకూ జరుగుతుంది. ర్యాలీ ఆటోమొబైల్ మోంటేకార్లో అని కూడా వ్యవహరించే ఈరేస్ వరకూ 92 పర్యాయాలు జరిగింది. ప్రపంచంలోని అతి పురాతన కార్ రేస్‌లలో ఇది ఒకటి. 93వ ర్యాలీకి ఆతిథ్యమివ్వడానికి మొనాకో సిద్ధమైంది. ర్యాలీ కార్ల కోసం ఒక ప్రణాళికా బద్ధమైన మోటార్ రేసింగ్ ఈవెంట్‌గా మోంటేకార్లోను పేర్కొంటారు. ఈ ఏడాది ప్రపంచ ర్యాలీ చాంపియన్‌షిప్ (డబ్ల్యుఆర్‌సి)లో ఇది ప్రారంభ రౌండ్. దీని తర్వాత డబ్ల్యుఆర్‌సి2, డబ్ల్యుఆర్‌సి3 ఈవెంట్స్ ఉంటాయి. మొత్తం 14 రేస్‌లలో డ్రైవర్ల ప్రదర్శన ఆధారంగా సగటు టైమింగ్, పాయింట్లను లెక్కించి, విజేతను ప్రకటిస్తారు. ఈ రేస్‌లలో మైనస్ పాయింట్లు కూడా ఉంటాయి. కాగా, ప్రోవెన్స్ అల్పెన్‌కోట్ డి అజార్ (ఫ్రాన్స్)లో జరిగే మోంటేకార్లో ర్యాలీలో మొత్తం 18 దశలు ఉంటాయి. పోవెన్స్ అల్పెన్‌కోట్ డి అజార్‌లోని థోర్డ్‌లో రేస్ ప్రారంభమై, ఆల్పెస్‌మారిటైమ్స్ (ఫ్రాన్స్)లోని కల్ డి టురినిలో ముగుస్తుంది. ర్యాలీ దూరం 343.80 కిలోమీటర్లు (213.63 మైళ్ళు). రేస్‌లో పాల్గొనడానికి 70 మంది డ్రైవర్లు, సహాయకులు ర్యాలీలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నారు. రేసర్ల సామర్థ్యానికి పరీక్ష పెట్టే మోంటేకార్లో ర్యాలీని ప్రత్యక్షంగా లేదా టివిల్లో పరోక్షంగా వీక్షించడం కోసం లక్షలాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు.



# ఓ శతకం... ఓ సున్నా..



కెరీర్‌లో తొలి టెస్టు మ్యాచ్ ఆడుతూ, ఒక ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించడం, మరో ఇన్నింగ్స్‌లో సున్నాకే అవుట్ కావడం అరుదు. పురుషుల క్రికెట్‌లో కొంత మంది బ్యాట్స్‌మెన్ కనిపిస్తారు. కానీ, మహిళల టెస్టు క్రికెట్‌లో ఈ విధంగా సెంచరీ చేసి, డకౌట్ అయిన తొలి బ్యాట్స్‌ఉమన్‌గా ఇంగ్లాండ్‌కు చెందిన మెయా బుచర్ రికార్డు సృష్టించింది. 2024 డిసెంబర్ 15 నుంచి 17 వరకు దక్షిణాఫ్రికాలోని బ్లూఫోంటెన్‌లో జరిగిన ఏకైక టెస్టులో ఆమె ఈ ఘనత సాధించింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌ను 9 వికెట్ల నష్టానికి 395 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మెయా 154 బంతులు ఎదుర్కొని, 22 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 126 పరుగులు సాధించింది. ఆమెతోపాటు నాట్ సివర్ బ్రంట్ కూడా సెంచరీ (128) నమోదు చేయడంతో ఇంగ్లాండ్‌కు ఈ భారీ స్కోరు సాధ్యమైంది. అనంతరం బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 281 పరుగులకే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 114 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 281 పరుగులు చేసి, ప్రత్యర్థి ముందు 351 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన మెయా 19 బంతులు ఎదుర్కొన్నప్పటికీ, ఒక్క పరుగు కూడా చేయకుండానే అవుటైంది. కెరీర్ తొలి టెస్టులో ఈ విధంగా ఒక సెంచరీ, ఒక డకౌట్ నమోదు చేసిన తొలి మహిళగా చరిత్ర లిఖించింది.

### పురుషుల్లో విశ్వనాథ్ ఫస్ట్..

పురుషుల విభాగంలో తమతమ తొలి టెస్టు, ఒక ఇన్నింగ్స్‌లో సెంచరీ, మరో ఇన్నింగ్స్ సున్నా నమోదు చేసిన తొలి బ్యాట్స్‌మన్ గుంతప్ప విశ్వనాథ్. అతను కాన్పూర్ వేదికగా 1969 నవంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో అతను టెస్టు కెరీర్ ప్రారంభించాడు. తొలి ఇన్నింగ్స్‌లో పరుగుల ఖాతా తెరవకుండానే అలాన్ కన్నోలీ బౌలింగ్‌లో, ఇయాన్ రెడ్‌పాథ్ క్యాచ్ అందుకోగా అవుటయ్యాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. 25 ఫోర్ల సాయంతో 134 పరుగులు సాధించి, ఆష్లే మిల్లెట్ బౌలింగ్‌లో ఎల్‌బిగా వెనుదిరిగాడు. ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆ తర్వాత దక్షిణాఫ్రికాకు చెందిన ఆండ్రూ సైమండ్స్ (వెస్టిండీస్‌పై బ్రిడ్జిటౌన్‌లో/ 1992 ఏప్రిల్), పాకిస్తాన్ ఆటగాడు మహమ్మద్ వాసిం (న్యూజాలాండ్‌పై లాహోర్‌లో/ 1996 నవంబర్), ఇంగ్లాండ్ క్రికెటర్ కీటన్ జెన్నింగ్స్ (భారత్‌పై ముంబయిలో/ 2016 డిసెంబర్) ఆ జాబితాలో చేరారు. తాజాగా, ఈనెల 2 నుంచి 6వ తేదీ మధ్య, బులవాయోలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌తో టెస్టుల్లో అరంగేట్రం చేసిన అఫ్గానిస్థాన్ ఆటగాడు ఇస్మత్ ఆలం మొదటి ఇన్నింగ్స్‌లో రెండు బంతులు ఎదుర్కొని, సున్నాకే అవుటయ్యాడు. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో 101 పరుగులు చేశాడు. ఈ జాబితాలో ఐదో బ్యాట్స్‌మన్‌గా అతని పేరు చేరింది.




# గవాస్కర్‌కు అవమానం.. బిసిసిఐ మౌనం

అన్ని రకాలుగానూ ఆటగాళ్లను ఎప్పుడూ వెనకేసుకొచ్చే భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) క్రికెట్ దిగ్గజం, ప్రస్తుత కామెంటేటర్ సునీల్ గవాస్కర్ విషయంలో మాత్రం ఎందుకో మౌనం వహించింది. జట్టు కూర్పు, ఆటగాళ్ల ప్రదర్శనపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించడమే అతని చేసిన నేరమేమో! వివరాల్లోకి వెళితే, ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లిన భారత జట్టు అక్కడ ఐదు మ్యాచ్‌ల బార్డర్–గవాస్కర్ టెస్టు సిరీస్ ఆడింది. ఈనెల 3వ తేదీన ప్రారంభమై, 5వ తేదీకే ముగిసిన చివరి, ఐదో టెస్టులో భారత్ 6 వికెట్ల తేడాతో పరాజయాన్ని ఎదుర్కోగా, ఆస్ట్రేలియా సిరీస్‌ను 3:1 ఆధిక్యంతో సొంతం చేసుకుంది. విజేత జట్టుకు ట్రోఫీని అలాన్ బార్డర్‌తో ఇప్పించిన క్రికెట్ ఆస్ట్రేలియా (సిఎ) ఈ ట్రోఫీలో భాగమైన గవాస్కర్‌ను అవమానించింది. గవాస్కర్ అక్కడ లేకపోతే, పిలవడం కష్టమని సిఎ భావించినా ఎవరూ తప్పుపట్టేవారు కారేమో. కానీ, చివరి మ్యాచ్ జరిగిన సిడ్నీ స్టేడియంలోనే గవాస్కర్ కామెంటేటర్‌గా ఉన్నాడు. బార్డర్–గవాస్కర్ టెస్టు సిరీస్ ట్రోఫీని బార్డర్‌తోపాటు గవాస్కర్‌తో కలిపి ఇప్పించి ఉంటే బాగుండేది. కానీ, సిఎ ఆ కనీస మర్యాదను కూడా పాటించలేదు. ఆసీస్‌కు ట్రోఫీని ఇస్తున్న సమయంలో మైదానంలోనే ఉన్న గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'బోర్డర్ తో కలిసి ఇచ్చేందుకు సంతోషించేవాడినని.. తనకు ఆహ్వానం లేకపోవడం నిరుత్సాహానికి గురి చేసిందని వ్యాఖ్యానించాడు.నేను ఇక్కడే ఉన్నా. ఆస్ట్రేలియా సిరీస్ ను కైవసం చేసుకుంది. అదేమీ నాకు ఇబ్బందికరం కాదు. వారు బాగా ఆడారు. విజయం సాధించారు. కానీ, ట్రోఫీని బోర్డర్ తో కలిస నేను కూడా అందిస్తే బాగుండేది. అయితే, నేను కేవలం భారతీయుడినే కాబట్టి పిలవలేదేమో' అని వ్యాఖ్యానించాడు. ఇంత జరిగినా, బిసిసిఐ ఇప్పటి వరకూ ఈ విషయంపై స్పందించలేదు. సిఎ వైఖరిని ఖండించలేదు. బిసిసిఐది ఇష్టారాజ్యమని, నచ్చిన వారిని నెత్తిన పెట్టుకొని, నచ్చని వారిని నిర్లక్ష్యం చేసే అలవాటును ఇంకా మార్చుకోలేదని మరోసారి స్పష్టమైంది.



# ఆకట్టుకుంటున్న మహిళల క్రికెట్

మలేసియా వేదికగా జరుగుతున్న మహిళల అండర్–19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడాభిమానులను అలరిస్తున్నది. మహిళలు లేదా పురుషుల జాతీయ క్రికెట్ జట్లలో అత్యధిక శాతం మంది సభ్యులు అండర్–19 జట్టు నుంచే ఎంపిక కావడం ఆనవాయితీగా వస్తున్నది. అందుకే, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ఆధ్వర్యంలో శనివారం (జనవరి 18) ప్రారంభమైన అండర్–19 ప్రపంచ కప్‌ను క్రికెట్ అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఫిబ్రవరి 2వ తేదీతో ఈ టోర్నమెం ట్ ముగుస్తుంది. ఆతిథ్య దేశం హోదాలో మలేసియాకు ఇందులో పాల్గొ నే అర్హత లభించింది. అదే విధంగా గత టోర్నీల్లో ఆడిన కారణం గా, 10 దేశాలు, ప్రాంతీయ క్వాలిఫయింగ్ పోటీలను పూర్తి చేసుకొన్న మ రో 5 దేశాలు కలిపి మొత్తం 16 దేశాలు ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి.




### బరిలో ఉన్న జట్లు

మొనాకో (ఆతిథ్య దేశం) ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, భారత్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్ (గత టోర్నీల్లో ఆడిన జట్లు).నేపాల్, నైజీరియా, సమోవా, స్కాట్‌లాండ్, అమెరికా (ప్రాంతీయ క్వాలిఫయింగ్ రౌండ్‌ను పూర్తి చేసిన జట్లు).

**వేదికలు :** బయూమాస్ ఓవల్ (పండమరాస్), జొహర్ క్రికెట్ అకాడెమీ ఓవల్ (జొహర్), వైఎస్‌డి–యుకెఎం క్రికెట్ ఓవల్ (బాంగి), బోమియో క్రికెట్ గ్రౌండ్ (సరావక్).

### తొలి విజేత భారత్



మొదటి మహిళల అండర్–19 ప్రపంచ కప్ 2023లో, దక్షిణాఫ్రికా వేదికగా జరిగింది. తొలి విజేత భారత్. పోచెఫ్‌స్ట్రూమ్‌లో 2023 జనవరి 29న జరిగిన ఫైనల్‌లో దారుణంగా విఫలమైన ఇంగ్లాండ్ 17.1 ఓవర్లలో 68 పరుగులకే కుప్పకూలింది. ర్యానా మెక్‌డొనాల్డ్ గే 19 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిదంటే, మిగతా బ్యాట్స్‌విమెన్ పరిస్థితిని ఊహించుకోవచ్చు. ఆమెతోపాటు నియామ్ హాలెండ్ (10), అలెక్సా స్టోన్‌హౌస్ (11), సోఫియా స్మాలే (11) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. భారత బౌలర్లలో టిటాస్ సాధు 4 ఓవర్లలో కేవలం 6 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టింది. అర్చనా దేవి 3 ఓవర్లలో 17 పరుగులకు 2, పార్శ్వి చోప్రా 4 ఓవర్లలో 13 పరుగులకు 2 చొప్పున వికెట్లు కూల్చారు. మమతా కశ్యప్, కెప్టెన్ షఫాలీ వర్మ, సౌమ్య యాదవ్ తలా ఒక్కో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 14 ఓవర్లలో మూడు వికెట్లకు 69 పరుగులు సాధించి, ఏడు వికెట్ల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది. షఫాలీ వర్మ 15, శ్వేతా షెహ్రావత్ 5, గొంగడి త్రిష 24 పరుగులు చేసి అవుట్‌కాగా, భారత్ లక్ష్యాన్ని చేరే సమయానికి సౌమ్య తివారీ 24, హర్షిత బసు పరుగుల ఖాతా తెరవకుండా క్రీజ్‌లో ఉన్నారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు టిటాస్ సాధు దక్కించుకుంది. ఈ టోర్నమెంట్‌లో శ్వేతా షెహ్రావత్ (భారత్) 297 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా బౌలర్ మ్యాగీ క్లార్క్ అత్యధికంగా 12 వికెట్లు పడగొట్టింది. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు ఇంగ్లాండ్ క్రీడాకారిణి గ్రేస్ షివెన్స్‌కు లభించింది. ప్రతిష్టాత్మకమైనీ టోర్నమెంట్ రెండో ఎడిషన్ మలేసియాలో ప్రారంభం కాగా, 2027లో జరిగే మూడో విడత చాంపియన్‌షిప్‌కు నేపాల్, బంగ్లాదేశ్ సంయుక్తంగా ఆతిథ్యమిస్తాయి.

## ఘనంగా గడ్డం వెంకట్‌రెడ్డి వర్ధంతి




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లాలో సిపిఐ, ఎఐటియుసి కార్మిక సంఘాల ఏర్పాటులో గడ్డం వెంకట్‌రెడ్డి కీలకమైన కృషి చేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ కాలనీలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో సిపిఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి అమరులు గడ్డం వెంకట్‌రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు శిల్పలింగం బృందం గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో భూమయ్య, ఓమయ్య, రాజేశ్వర్, రాజన్న, స్వరూపరాణి, రఘురాం, అంజలి, రంజిత్, నర్సింగ్‌రావు, సాయిలు, రాందాస్, వెంకటేశ్వర్లు, సురేష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్‌ను దేశబహిష్కరణ చేయాలి


### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మ ణచారిభవనంలో భారతకమ్యూనిస్టుపార్టీ సిపిఐ జిల్లాకార్యవర్గ సమావేశం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఆర్.ఇందిరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ మూడో సారి అధికారంలోకి వచ్చినటు వంటి బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో దేశ హోంశాఖమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ని ఏకవచనంతో మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపర్చడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానపర్చినట్లు అందుకుగాను అమిత్‌షాను ప్రధానమంత్రి నరేంద్రమోదీకీ భారత రాజ్యాంగం మీద ఏమైనా ప్రేమ ఉంటే కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షాను మంత్రిపదవినుండి తొలగించాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా రాష్ట్రీయసేవ్‌సంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయం మీద గత కొన్ని సంవత్సరాలుగా జాతీయజెండా ఎగురవేయలేదు, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ భారత దేశంలో అల్లర్లను సృష్టిస్తూ విచ్చలవిడిగా కాషాయం , దేవుడిముసుగులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దేవుని కలిస్తే ఏడుజన్మలకు పుణ్యఫలం వస్తుందని ఓ మంత్రి అంటాడు, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ భారతదేశానికి రాలేదంటాడు, ఆర్‌ఎస్‌ఎస్ ముసుగులో పాలిస్తున్నటువంటి కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరుచుకుని భారతరాజ్యాంగం మీద ఇష్టమున్నట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునే ప్రసక్తిలేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు హెచ్.ఆనంద్‌జి, జి.వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్, సిపిఐజిల్లా కార్యవర్గసభ్యులు తన్నీరు నర్సింహ్మ, పెబ్బేటివిజయుడు పాల్గొన్నారు.



# అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

- నియోజకవర్గాన్ని ఆదర్శంగా మలుస్తాం
- విమానాశ్రయం, కార్పొరేషన్ కల సాకారం కాబోతోంది
- క్రీడాభివృద్ధికి ప్రాధాన్యత : ఎంఎల్‌ఎ కూనంనేని
- రూ.45 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/కొత్తగూడెం:** కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రధాన ఎజెండా అని అవదుల్లేని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శవంతంగా మలుస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పునరుద్ఘాటించారు. స్థానిక మున్సిపాలిటి 27వ వార్డులో గల ప్రగతి మైదానంలో రూ.20లక్షలు, రూ.25 లక్షలతో చేపట్టనున్న ఎంపవర్మెంట్ అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణాన్ని పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజా అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వివిధ పథకాల్లో నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నామని, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావుండబోదమని, సమస్యలు లేని నియోజ వర్గాన్ని తీర్చిదిద్దేంత వరకు విశ్రమించేదే లేదన్నారు. నిర్లక్ష్యానికి గురైన క్రీడా రంగంపై దృష్టి సారించినట్లు చెప్పారు. అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలను, ఓపెన్ జిమ్ములను అభివృద్ధి చేయడంతో పాటు పంచాయతీల వారీగా క్రీడాకారులకు కావాల్సిన ఏర్పాటు చేసి క్రీడాలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండే విధంగా కొత్తగూడెం విమానాశ్రయం నిర్మాణం, హరిత హోటల్, అభివృద్ధికి బాటలు వేసే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం తన కలని, వాటిని సాకారం చేయడం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తేవాలని అధికారులకు సూచించారు. ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, చైర్‌పర్సన్ సీతాలక్ష్మీ, తహశిల్దార్ పుల్లయ్య, మున్సిపల్ కమీషనర్ శేషాంజన్ స్వామి, డిఇ రవీందర్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, విజయ్ కుమార్, రూక్మేందర్, వేణు, లక్ష్మ ణ్, నాయకులు మునిగడపిఇ వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, నెరేళ్ల శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, లింగేష్, జోసఫ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాయకుల మృతి పార్టీకి తీరని లోటు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



**పజాపక్షం/భీమదేవరపల్లి :** తెలంగాణ ఉద్యమకారుడు దళిత బహుజన నాయకుడు చెప్యాలా ప్రభాకర్‌కు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శిచారు. చాడ వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి. కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపే మల్లేష్, నాయకురాలు గూడెం లక్ష్మి ఉన్నారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిన్ననాటి నుండే అభ్యుదయ భావాలు కలిగిన చెప్యాల ప్రభాకర్ చిన్నతనంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి తెలంగాణ ఉద్యమంలో తమతో పాటుగా అనేక పోరాటాలలో తన వంతు సహకారం అందించారని అన్నారు. అలాంటి మహానేత చనిపోవడం బాధాకరం అని, ఆయన లేని లోటు ఈ ప్రాంత ప్రజలకు కాక కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు, హనుమకొండ జిల్లాకు తీరని లోటుగా బాధాకరం వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఈ ప్రాంత ప్రజలకు పేద ప్రజలకు బడుగు బలహీన వర్గాలకు విద్యా వైద్యం ఉపాధి ఇళ్ల స్థలాలు ఇండ్లు దక్కేవరకు ప్రజా ఉద్యమాలు చేపట్టాలని చాడ వెంకట రెడ్డి తెలిపారు.

### చిట్టి గోపాల్‌రెడ్డి కుటుంబానికి చాడ పరమార్శ

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** సీనియర్ జర్నలిస్టు చిట్టిగోపాల్ రెడ్డి మరణం చాల బాధకరమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో చిట్టి గోపాల్ రెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరమార్శించి అయన చిత్రపటానికి పూల మాల వేసి ఘననివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ గోపాల్‌రెడ్డికి ఆయనతో ఉన్న అనుబంధాన్ని అయన గుర్తు చేసుకున్నారు. గోపాల్‌రెడ్డి జర్నలిస్టుగా, కాకుండ , వివేకనంద విద్యలయం ఏర్పటు చేసి ఎంతో మందికి విద్యనందిచిన గోప్ప వ్యక్తని అన్నారు. గోపాల్‌రెడ్డి మరణం ఈ ప్రాంతప్రజలకు తీరని లోటని పేర్కోన్నారు. అయన కుటుంబానికి సిపిఐ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లాసిపిఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి, మండల కార్యదర్శి గడిపె మల్లెశ్, జాగీరు సత్యానారయణ, సంజీవరెడ్డి సిపి ఐ నాయకులు తదితరులు పాల్గోన్నారు.



# లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణకు కమ్యూనిస్టులు కృషి

### సిపిఐ అధ్యయన తరగతుల్లో రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంగళ్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కమ్యూనిస్టుల కృషి చేయాలని రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.వెంగళ్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన ప్రజాసంఘాల నిరంతర రాజకీయ అధ్యయన తరగతులకు వెంగళ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతతత్వ హిందూ రాజ్యాన్ని స్థాపించడం కోసం బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ చేపడుతున్న విధానాలను వ్యతిరేకించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలని అన్నారు. ఇందుకోసం దేశంలో ప్రత్యామ్నాయ శక్తులుగా కమ్యూనిస్టులు ఎదగాలని సూచించారు. కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు రాయితుల పేరిట.. ఆర్థిక వ్యవస్థను కట్టబెట్టడం లాంటివి కేంద్ర ప్రభుత్వం దుందుడుకు చర్యలకు నిదర్శనం అన్నారు. దేశంలో విద్య వైద్యం ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం.. కృషి చేయాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని నిరంతరం యువతలో అభివృద్ధి చేయాలన్నారు. కొఠారి కమిషన్ సిఫారసులను అమలు చేస్తే ఎంతో మేలు అని, ఈ దేశం దారిద్ర దిగువ రేఖకు ఉండి దుర్భర జీవితం గడుపుతున్న ప్రజలను దూరం ఉంచేది ఒక విద్య మాత్రమేనని, కానీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ విద్య మీద నిరంతరం బడ్జెట్లో తగ్గించుకుంటూ పోతున్నారన్నారు. నూతన విద్యా విధానం2020 చట్టాన్ని తీసుకువచ్చి విద్యను పూర్తిగా అన్ని వర్గాలకు దూరం చేస్తున్నారని, ఇది దేశ అభివృద్ధికి ప్రజలను చేయడమేనని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్య ముసుగులో కార్పొరేట్ సంస్థల కనసన్నల్లో రాజకీయాల కొనసాగుతున్నాయన్నారు. దేశ సంపద కొద్ది మంది చేతు ల్లో ఉండడం.. ప్రజలను అభివృద్ధికి ఆమడ దూ రం పెట్టడంలో భాగమేనని అన్నారు.రైతుల ఆత్మహత్యలు 1990 నుండి ఇప్పటివరకు పరంపరగా కొనసాగుతున్నాయని, రైతులు పండించిన పంట లు ఇచ్చి గిట్టుబాటు ధరలు కల్పిస్తూ వ్యవసాయరంగాన్ని కాపాడుకోవాలన్నారు. కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ద్వారా నిరుద్యోగం నిరంతరం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ క్లాసులలో సిపి ఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మ ణ్, మునగాల బిక్షపతి, భాషబోయిన సంతోష్, యేషబోయిన శ్రీనివాస్, జక్కు రాజు గౌడ్, బత్తిని సదానందం, వేల్పుల సారంగపాణి, రాసమల్ల దీన, మాలోత్ శంకర్ నాయక్, గోకల రాజయ్య, ఇల్లందల రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'

### మాజీ ఎంఎల్‌ఎ ఉజ్జిని యాదగిరిరావు

**ప్రజాక్షం/చింతపల్లి :** ప్రతి నిత్యం ప్రజా సమస్యలు వెలికి తీస్తూ ప్రజల గొంతుకగా ప్రజాపక్షం పత్రిక పనిచేస్తుందని మునుగోడు మాజీ ఎంఎల్‌ఎ ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల పరిధిలోని ఘడియగౌరారం గ్రామంలో 'ప్రజాపక్షం పత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం యాదగిరిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రలజకు మధ్య పత్రికలు వారధిగా పని చేసి, ప్రజాసమస్యలు పరిష్కరించుటకు కృషి చేయాలన్నారు. కొద్దికాలంలోనే ప్రజాపక్షం పత్రిక ప్రజల మన్ననలు పొందడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, నాయకులు వింజమూరి నరసింహా, ప్రజాక్షం రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కౌన్సిలర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: సీసీ రోడ్డు నిర్మాణం పనులను స్థానిక కౌన్సిలర్ కృష్ణవేణి ప్రారంభించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు సోలీపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కృష్ణవేణి మాట్లాడుతూ సోలీపూర్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసేం దుకు కృ షి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మహానగరి

## గొప్ప నాయకుడు ఎన్‌టిఆర్



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : ప్రపంచానికి తెలుగువారి ఖ్యాతిని చాటి చెప్పిన గొప్ప మహోన్నత, మహనీయుడు నందమూరి తారకరామారావు అని ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తనయుడు దేవిరెడ్డి గౌతమ్‌రెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురంలోని పనామా వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళిలర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రశేఖర్, బిఆర్‌ఎస్ నాయకులు లగ్గొని శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవ చేయడం అభినందనీయం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : స్వచ్ఛంద సంస్థలు ప్రజా సేవ చేయడం అభినందనీయం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం వనస్థలి క్రాంతి క్లబ్ సర్వసభ్య సమావేశం మధురా రెసిడెన్సీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మెంబర్‌గా మొద్దు లచ్చిరెడ్డి సభ్యత్వం పొంది లయన్స్‌క్లబ్ మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. లయన్స్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ సాధు శ్యాం ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించగా, క్లబ్ అధ్యక్షుడు నందిరాజు లక్ష్మీ నారాయణ మెంబర్‌కు అంతర్జాతీయ పిన్ అందచేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవ, సమాజ సేవ చేయడం తనకెంతో ఇష్టమని, భవిష్యత్‌లో లయన్స్ క్లబ్ వారు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. అనంతరం నిరుపేద పిల్లలకు బెడ్స్ అందించడానికి పదివేల రూపాయలను విరాళం క్లబ్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్ వాసుదేవ రావు, క్లబ్ కార్యదర్శి సాధు కృష్ణ, కిషోర్, కోశాధికారి మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : సిఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారని, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతుందని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన ఎల్‌బి నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మధుయాష్కీని సంప్రదించగా... స్పందించిన ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. సదరు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ ఎల్‌బి నగర్ సద్గురు నగర్‌కు చెందిన కె. కైలాష్ (60వేలు), వనస్థలిపురం శ్రీరాంనగర్ కాలనీ చెందిన శక్తి రోహాన్ (40వేల ఐదు వందలు), లక్ష్మమ్మ (60వేలు), హయత్ నగర్‌కు చెందిన షెక్ అశ్వక్ (25వేలు) చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, కొండోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళకు లయన్స్‌క్లబ్ చేయూత




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : సమాజంలో ప్రతి ఒక్కరు సేవా గుణం కలిగి ఉండాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ హోప్ & హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం చందానగర్ హుడా కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న అల్మాస్‌గూడకు చేందిన ఉమాదేవి అనే మహిళకు లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ ఫౌండర్ కొండ విజయ్ కుమార్, కో ఆర్డినేటర్ రమణ ఆధ్వర్యంలో బాధిత మహిళకు రూ.10 వేలు అర్థిక సహయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ క్లబ్ ద్వార రానున్న రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బర్కా మల్లేష్ యాదవ్, కోశాధికారి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, రాజశేఖర్, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : మాదాపూర్‌లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగాంగా శ్రీమతి నిర్మల ప్రభాకర్, డైరెక్టర్ కనక దుర్గ నృత్య విభావరి పాలక మండలి వారి ఆధ్వర్యంలో శిష్య బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు, భరతనాట్య నృత్య ప్రదర్శన ప్రదర్శించి శిల్పారామం సందర్శకులను ఏంతగానో అలరించారు. కార్యక్రమంలోని నృత్య ప్రదర్శనలో శ్లోకం, వినాయక స్తోత్రం, లింగాష్టకం, అన్నమచార్య కీర్తన, అలరులు కురియగా, శబ్దం, ఘంటము పూయరుగా, జతిపర్వం, అయిగిరి నందిని అంశాలను నృత్య రూపకంలో నృత్యించి శిల్పారామం కు విచ్చేసిన సందర్శకులను ఏంతగానో అలరించారు. నృత్యప్రదర్శనలో సంహిత, సహస్ర, పూర్వి, రితిక, దిత్య, ఆద్య, కనిష్క, నికిత, నక్షత్ర, ఆరోహి, కృతిక మొదలైన వారు ప్రదర్శనలతో అందరిని అకట్టుకున్నారు. నాట్య గురువులు రంగమని, నిర్మల, వ్కెట్ రెడ్డి, జివిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కనుమ భోగ రాజు, కమలరత్నం లు విచ్చేసి కళాకారులను అభినందించారు.

## ఐకమత్యంగా ముదిరాజ్‌లు

ప్రజాపక్షం/కొందుర్గు: ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఉండాలని బుల్లితెర నటుడు బిత్తిరి సత్తి అలియాస్ కావలి రవికుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పండగ సాయన్న ముదిరాజ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ముదిరాజ్‌లు తమ పిల్లలను తప్పని సరిగా చదివించాలని, చదువుతోనే సమాజంలో మార్పు వస్తుందని, ముదిరాజ్‌లు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో పండుగ సాయన్న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం, షాద్‌నగర్ పట్టణంలో పండుగ సాయన్న విగ్రహాన్ని నెలకొల్పడం ఎంతో సంతోషకరమని అన్నారు.కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు మంగ మధు, వెంకటేశ్, ఎ పైలయ్య, కావలి యాదయ్య, సున్నాల శ్రీనివాస్, కావలి దశరథ,జి వేణుగోపాల్, కొమరబండ శ్రీశైలం, కావలి తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు ప్రతిష్ట పెంచాలి

డిజిపి డాక్టర్ జితేందర్




ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో పోలీసు ప్రతిష్ట మరింత పెంచే దిశగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని డిజిపి డాక్టర్ జితేందర్ అధికారులు, సిబ్బందిని కోరారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించేందుకు తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ వినూత్న, సమగ్ర విధానానికి శ్రీకారం చుట్టారు. ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడమే కాకుండా, పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించడం ఆయన ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా శనివారం డిజిపి కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి దాదాపు 41 మంది పోలీసు అధికారులు శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ...ఈ విధానం ద్వారా ప్రజలపై పోలీస్ విభాగాన్ని మరింత ప్రజా మైత్రిగా మార్చడం, అలాగే సుస్థిర శాంతి, భద్రతను కాపాడేలా చేయడం ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుండి కొంతమంది పోలీసు అధికారులను ఎంపిక చేసి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. దశలవారీగా ఈ శిక్షణ రాష్ట్రంలోని పోలీసు అధికారులు అందరికీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిజిపి స్వయంగా పాల్గొని, విధానాలు, ముఖ్యమైన అంశాలపై అధికారులతో ప్రత్యక్షంగా చర్చించారు. ప్రతి అధికారికి ఒకరోజు పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా అధికారుల పనితీరు మెరుగుపడడమే కాకుండా, వారి నైపుణ్యాలను మరింతగా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు..

**శిక్షణలో ప్రాధాన్యతనిచ్చిన ముఖ్యమైన అంశాలు**

**పోలీసు ప్రతిష్ట పెంపొందించడం:** ప్రజలతో మెలగడంలో సత్ప్రవర్తనను ప్రోత్సహించడం, ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం.

**మహిళల భద్రత:** మహిళల భద్రతను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు, మహిళలపై జరుగుతున్న హింసను నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు.

**పోలీసుల ప్రవర్తన:** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల సిబ్బంది ప్రవర్తనకు ప్రత్యేక శ్రద్ధ, ప్రజలతో మిత్రుత్వంగా వ్యవహరించాల్సిన విధానాలపై అవగాహన.

**సివిల్ విభాగాల జోక్యం:** సివిల్ విభాగాల పనుల్లో పోలీసులు జోక్యం చేసుకోకుండా ఉండే విధంగా ప్రత్యేక మార్గదర్శకాలు.

**పోలీసుల నడవడిక:** ప్రజల్లో పోలీసులపై గౌరవం పెంచుకునేలా వారి ప్రవర్తనను మారుస్తూ, మంచి పేరు తెచ్చుకోవడంపై దృష్టి పెట్టడం, డిజిపి కార్యాలయంలో శనివారం నాడు జరిగినఈ కార్యక్రమంలో అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, ఎఐజి రమణ కుమార్, అడిషనల్ డిసిపిలు అశోక్ ,సత్యనారాయణ, సైక్రోనీ శిక్షణ బృందం తదితరులు పాల్గొన్నారు.

## షేక్‌పేట్ డివిజన్‌లో మేయర్ పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్: నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం వెంకటేశ్వర నగర్ కాలనీ, షేక్ పేట్ డివిజన్‌లోని పలు కాలనీలలో కార్పొరేటర్లు కల్పన రెడ్డి, మహమ్మద్ రషీద్, ఎంఎల్‌ఎ దానం నాగేందర్ తో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ సింగిడి కుంట ప్రాంతంలో టిఆర్‌ఎస్ భవన్ నుండి బంజారా లేక్ వరకు గల నాలా 2.5 కిలోమీటర్ల నాలా పై సుమారు 30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులు పరిశీలించారు. డ్రెయిన్ నాలా పనులతో పాటుగా త్రాగు నీటి పైప్ లైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మేయర్ వాటర్ వరక్స్ శాఖ అధికారులను ఆదేశించారు. డ్రైన్ పూర్తయిన తర్వాత వాటర్ పైప్ లైన్ కోసం తిరిగి తవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. బాక్స్ డ్రైన్ నిర్మాణంలో రోడ్డు చిన్నగా ఉన్న నేపథ్యంలో నిర్మాణ సమయంలో కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ పర్యటనలో భాగంగా జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, ఎస్ఎన్‌డిపి సిఇ కోటేశ్వర రావు, జోనల్ ఎస్ఇ రత్నాకర్, డిసి రజనీ కాంత్ రెడ్డి, ఇఇ విజయ్ కుమార్, జోనల్ యుబిడి, యుసిడి, ఏఎం అండ్ హెచ్ఒ భార్గవ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగి మున్సిపాలిటీలో 7.60కోట్లతో అభివృద్ధి

ప్రజా పక్షం/ నార్సింగి: మున్సిపాలిటీ పరిధిలో రూ.7.60 కోట్లతో మున్సిపాలిటీ సాధారణ నిధులతో పూర్తిచేసిన పనులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం ప్రారంభించారు. నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్ బాబు , ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టిపిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డిలతో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముం దంజలో నడపడానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నమన్నారు.

## టౌన్‌ప్లానింగ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించిన కె.ఇలంబర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : టౌన్‌ప్లానింగ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ జిహెచ్‌ఎంసి డైరీని కమిషనర్ కె. ఇలంబర్తి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు కవీనాథ్ మేహ్రా, ప్రధాన కార్యదర్శి పి.బాలనందస్వామి, సలహాదారులు ఎం.రజింత్ కుమార్, రాజేంద్ర కుమార్, దేవేందర్, శ్రీధర్, ఆరీఫ్, మహేందర్, నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.




## హామీలు నెరవేరే వరకు పోరాటానికి సిపిఐ సిద్ధం

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే. రామస్వామి



ప్రజాపక్షం/షాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చే వరకు సిపిఐ పోరాటానికి సిద్ధం అవుతుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే. రామస్వామి అన్నారు. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ అనుబంద గ్రామమైన నారాయణ దాస్ గూడ గ్రామంలో సిపిఐ వంద రోజుల సంబరాలు నిర్వహించారు. అనంతరం సిపిఐ పార్టీ జెండాను అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న కాన్పూర్ పట్టణంలో ప్రారంభం జరిగిందన్నారు. సిపిఐ పార్టీ ప్రారంభం నుండి నేటి వరకు నిరు పేద ప్రజల పక్షాన న్యాయం కోసం పని చేస్తుందని చెప్పారు. తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమంలో నైజాం రాజుకు వ్యతిరేకంగా పోరాటం చేసి పేద ప్రజలకు అండగా నిలిచిందన్నారు. ఈ నెల 28న చేవెళ్ల కెజిఆర్ గార్డేన్‌లో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సిపిఐ నాయకులు ప్రజలు తరలిరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియూ జిల్లా వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి సత్తి రెడ్డి, గ్రామ కార్యదర్శి బీరప్ప, శ్రీకాంత్, నాయకులు రాంచెందర్, నర్సింలు, లలిత తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ కృషి

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య




ప్రజాపక్షం/షాబాద్ : నిరు పేదలకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం కృషి చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం షాబాద్ ముదిరాజ్ భవనంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సభ అధ్యక్షతన మండల కార్యదర్శి నక్కల జంగయ్య సభ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 28న చేవెళ్ల జనరల్ బాడి సమావేశం ఎర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా సిపిఐ రాష్ట కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హజరు అవుతున్నట్లు తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొహినాబాద్, శంకర్‌పల్లి, నవాబ్ పేట్ మండలాల నుండి సిపిఐ నాయకులు ప్రజలు పాల్గొని కార్యక్రమాని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండ మోసం చేస్తునందుకు స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట సమితి సభ్యుడు రామస్వామి, నాయకులు రాములు, శ్రీశైలం, నారాయణ, తదితరులు ఉన్నారు.

## కెసిఆర్ సారధ్యంలోనే దర్గా అభివృద్ధికి నిధులు


రూ.50కోట్లు.. 50ఎకరాల భూమి కేటాయించాం : మహమూద్ అలీ



ప్రజాపక్షం/కొత్తూరు: మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సారధ్యంలోనే జహంగీర్ ఫీర్ దర్గాకు రూ.50కోట్ల నిధులు కేటాయించడంతో పాటు 50ఎకరాల భూమిని గుర్తించామని తెలంగాణ రాష్ట్ర మాజీ హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. శనివారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో జెపి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాబాకు ఛాదర్ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహమూద్ అలీ మాట్లాడుతూ దర్గాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు పర్యాటకులను అకట్టుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలోనే రూ.50కోట్లు కేటాయించడంతో పాటు అందుకు అనుగుణంగానే 50ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిపారు. దర్గా అభివృద్ధి పేరుతో స్థానిక వ్యాపారుల పొట్ట కొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వివరించారు. దర్గా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు తీసుకువచ్చి దర్గాలో ఉపాధి పొందుతున్న వ్యాపారుల పొట్ట కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని తిప్పి కొట్టేందుకు ప్రభుత్వంలో చర్చలు జరపనున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే దర్గా అభివృద్ధి విషయంలో పూర్తి వాస్తవాలను గ్రహించి మాట్లాడితే బాగుటుందని, నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. దర్గాకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు మిషన్ భగీరథ నీటిని సైతం తీసుకువచ్చామని గుర్తు చేశారు. యాభై ఏళ్ళు అధికారంలో ఉన్న కాంగ్రెస్, 17 ఏళ్ళు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న దర్గాకు చేసిందేమి లేదన్నారు. అన్ని వర్గాలకు సముచిత న్యాయం, వివిధ మందిరాలతోపాటు దర్గాను అభివృద్ధి చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రణాళికలు సిద్ధం చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మసీ ఉల్లా ఖాన్, బిఆర్‌ఎస్ నేతలు వి.నారాయణరెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మిట్టునాయక్‌తోపాటు బిఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

## యాదవులు రాజకీయాల్లో రాణించాలి

రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్ యాదవ్



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికూడ రఘునాథ్ యాదవ్ అన్నారు. శనివారం అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన చింతల రవీందర్ యాదవ్‌ను షాద్‌నగర్ యాదవ సంఘం నేతలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదిన జైపూర్‌లో నిర్వహించిన అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యవర్గ సమావేశంలో తెలంగాణ నుండి యాదవ యువకుడు చింతల రవీందర్ యాదవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. యాదవుల అభ్యున్నతికి, వారి శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తూ అందరిని ఏకతాటిపైకి తెచ్చే విధంగా కృషి చేస్తున్న చింతల రవీందర్ యాదవ్‌కు రాష్ట్ర అధ్యక్ష పదవీ రావడం సంతోష కరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువత అధ్యక్షుడు లక్ష్మీ పతి యాదవ్, షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు షాబాద్ మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు నక్క బాల్‌రాజ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పద్మారం వెంకటేష్ యాదవ్, సుధాకర్ యాదవ్, యువత ఉపాధ్యక్షుడు జావాజీ శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను తప్ప దోవ పట్టిస్తున్న కెటిఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలి

చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీంభరత్




ప్రజాపక్షం/షాబాద్ : దీక్ష పేరిట రైతులను తప్పుతొవ పట్టిస్తున్న బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీంభరత్ అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం బిఆర్‌ఎస్ రైతు నిరసన దీక్ష స్థలం అపవిత్రమైందని సభ ప్రాంగాణాని కాంగ్రెస్ నాయకులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఇంచార్జ్ పామెన భీంభరత్ మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో చేసిన అప్పులను కట్టెందుకు కాంగ్రెస్ ప్రభుత్వంకు తలకు మించిన భారంగా మారిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారికిగా తప్పని సరిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. జనవరి 26 నుండి రైతులకు రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఖాతలో నగదు జమ చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న సంక్షేమాలను చూసి ఓర్వలేక అనేక ధర్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఏర్పడి అప్పుల రాష్టంగా అవతరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మెన్ పీసరి సురేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సీనియర్ నాయకులు తమ్మళి రవీందర్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకే తొలగింపు

ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న మహిళ

కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న వారి భరతం పట్టండి సారూ..



ప్రజాపక్షం/షాద్‌నగర్/నందిగామ:ఎమ్మెల్యే సారూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకే తన పేరు ఓటర్ జాబితాలో లేకుండా తొలగించారంటూ ఓ మహిళ మొరపెట్టుకుంది. శనివారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, మొదళ్ళగూడ, వీర్లపల్లి, మాజీద్ మామిడిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ సర్వేలను స్వయంగా పరిశీలించారు. మొదళ్ళగూడ గ్రామంలో ఇందిరమ్మ సర్వే నిర్వహిస్తున్న సమయంలో పరిశీలిస్తుండగా గ్రామానికి చెందిన సక్కుబాయి అనే మహిళ వచ్చి మొరపెట్టుకుంది. తాను ఎమ్మెల్యే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయలేదని, కాంగ్రెస్‌కు ఓటు వేశానని ఓటర్ జాబితా నుండి తొలగించారని ఎమ్మెల్యే ముందుకు తన గొడు వెల్లవోసుకుంది. దాంతో చలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంబంధిత రెవిన్యూ శాఖ అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే విచారణ చేసి ఆ మహిళలకు ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం నందిగామ మండల పరిధిలోని మాజీద్ మామిడిపల్లిలో చేకూర్తి సుదర్శన్, వాలీబాల్ అసోసియేషన్, గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో క్రీడలకు పెద్దపీఠ వేయడంతోపాటు ప్రోత్సాహం అంధిస్తుందని పేర్కొన్నారు.

### అర్హులందరికి రేషన్ కార్డులు

అర్హులైన పేదలందనికి రేషన్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం నందిగామ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులతోపాటు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, ఎంపిడిఓ సుమతి, ఎంపివో తేజసింగ్, మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహా, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా సర్వేకు సహకారం

మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్

ప్రజాపక్షం/షాద్‌నగర్: రైతు భరోసా సర్వేకు ప్రజలందరు సహకరించేందుకు కృషి చేయాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఎలికట్ట, చౌలపల్లి, చింత గూడెం, మధురాపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు సాగుకు యోగ్యం కానీ భూములకు సంబంధించిన ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఎఒ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా పథకం సర్వేకు రైతులు, ప్రజలందరు సహకరించాలని సూచించారు. అర్హులైన రైతులందరికి పథకం వర్తించేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. వ్యవసాయ అధికారులతోపాటు మండల రెవిన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి సాగుకు యోగ్యమయ్యే భూములను గుర్తిస్తున్నట్లు తెలిపారు. సాగుకు యోగ్యం కానీ వెంచర్లు, పరిశ్రమలకు సంబంధించిన భూములు, మైనింగ్ భూములను, రోడ్లకు, గుట్టలకు సంబంధించిన భూములను పరిశీలించినట్లు వివరించారు. ప్రణాళిక బద్దంగా నివేధికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు.



## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాబురావు తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి విఠల్ ఫీడర్‌ను 11 గంటల నుండి 11.30 గంటల వరకు నిలిపివేయడంతో బిఎన్‌రెడ్డి నగర్,ఫేస్1,ఫేస్ 4 ఫీడర్‌ను 11.30 నుండి 12 గంటల వరకు నిలిపివేయడంతో బిఎన్ రెడ్డి,ఫేస్ 1, ఐకామ్ ఫీడర్‌ను 12.30 నుండి 1 గంట వరకు నిలిపివేయడంతో పారిశ్రామికవాడ ఫేస్1 ప్రాంతంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఇ కోరారు.

# మహానగరి

## మహిళా కాంగ్రెస్ విభాగ కార్యదర్శిగా సునీత



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మహిళా కాంగ్రెస్ విభాగ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా మెరుగు సునీత నియమితులయ్యారు. దమ్మాయిగూడకి చెందిన సునీత గతంలో రెండు పర్యాయాలు జిల్లా కార్యదర్శిగా పనిచేసారు. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి లు శనివారం నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడు తూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ పటిష్టతకు కృషి చేస్తానని, అన్ని ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషిచేస్తానన్నారు.



## చర్లపల్లిలో ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకుని చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో టిడిపి జిల్లా సంయుక్త కార్యదర్శి రుద్రగోని రాంచందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించి పండ్లను పంచిపెట్టారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడని, ప్రజలే దేవుళ్ల సమాజమే దేవాలయమని చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్‌టిఆర్ అని అన్నారు. ఎన్‌టిఆర్‌కు భారతరత్న బిరుదును ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కీసర ప్రేమ్‌గౌడ్, రాగీరు నాథం, తైదల బీరప్ప, గడ్డం కృష్ణ, ఉత్తిష్ణ, పి శ్రీనివాస్, కుమార్ కడియాల, తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో:** శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో మున్సిపల్ టిడిపి అధ్యక్షులు కొండా జంగారెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగువారి ఆత్మ గౌరవం కాపాడిన వ్యక్తి ఎన్‌టిఆర్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, రుద్రగోని రాంచందర్‌గౌడ్, రాములు యాదవ్, మల్లేష్‌యాదవ్, నీరుగొండ సతీష్, సదా తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్‌లో :** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు కీ॥ శే నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదురుపల్లి చౌరస్తాలో కమ్మ సేవ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించి న ఉచిత మెడికల్ క్యాంప్, అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవ సంఘం సభ్యులు బొడ్డు రవి శంకర్, మాజీ కౌన్సిలర్ రంగారావు, ఎస్.వీరబాబు, సురేష్, వేను, అమోగ నరేంద్ర, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, 130 డివిజన్ అధ్యక్షులు సోమన్న శ్రీధర్ రెడ్డి, హరి కిరణ్ పటేల్, శ్యామ్, నర్సింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి దోహదం

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి దోహదపడుతాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్ రెడ్డి అన్నారు. కెపిహెచ్‌బి కల్చర్ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ సిఎం వాలీబాల్ టోర్నమెంట్ కప్ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డిని అభినందిస్తూ క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బి.సంజీవరావు, ఎ–బ్లాక్ ప్రెసిడెంట్ పి. నాగిరెడ్డి, బి.బ్లాక్ ప్రెసిడెంట్ తుమ్మా వేణు, అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ మెయినుద్దీన్, కెపిహెచ్‌బి డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, నరసింహ, కొండల్ రెడ్డి, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.




## పనికిరాని వస్తువులు వినియోగంలోకి ....

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఇళ్లలో వాడి పడేసే పనికిరాని వస్తువులను తిరిగి వినియోగంలోకి తీసుకొని వచ్చే లక్ష్యంగా జిహెచ్ఎంసి పారిశుధ్య సిబ్బంది మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో పాత వస్తువులను శనివారం సేకరించారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రీ యూజ్, రీ సైక్లింగ్, రెడ్యూస్ పేరిట (RRR) సెంటర్లకు ప్రత్యేక వాహనాల్లో సానిటేషన్ సిబ్బంది తరలించారు. పాత పుస్తకాలు, ప్లాస్టిక్ బాటిల్స్, కూలర్లు, ఫ్రిడ్జిల్లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులుమయ వంటి ఇళ్లల్లో పనికి రాకుండా ఉండే వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు తరలించటం ద్వారా తిరిగి మరో రూపంలో వినియోగించుకొనేలా మార్చుకోవచ్చని సానిటరీ సూపర్‌వైజర్ గిరి, శ్రీనివాసరెడ్డిలు తెలిపారు.

## నిరుపయోగంగా దుకాణ సముదాయం

### అధికారుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/నవాబుపేట:** షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో సుమారు 36ఏండ్ల క్రితం వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండల కేంద్రంలో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య దుకాణాల సముదా యం నిరుపయోగంగా మారింది. ఉపయోగం లేకపోవడం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోంది. నిరుద్యోగులకు అద్దె ప్రాతిపదికన కేటాయించి ఎస్సీ కార్పొరేషన్ కు ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో నవాబ్‌పేట్ మండల కేంద్రంలో 1989 సం.లో ఇంద్రారెడ్డి హయాంలో ఈ దుకాణాల సముదాయం మరమ్మతు చేయించకపోవడంతో కొన్ని ఏండ్లుగా అద్దె ఆదాయం ఎస్సీ కార్పొరేషన్ కోల్పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందింఉపయోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బ్యాంకుల్లో మరింత పటిష్ట భద్రత

### ఆధునిక టెక్నాలజీని అంది పుచ్చుకోవాలి

### రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** బ్యాంకులు తమ భద్రతలో భాగంగా పటిష్టమైన భద్రతా సిబ్బందికి తోడు అవసరమైన సంఖ్యలో ఆధునిక టెక్నాలజీ తో కూడిన సిసిటివి కెమెరాల వ్యవస్థను మరింత గా మెరుగు పరచుకోవాలని రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు సూచించారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన బ్యాంక్ దోపిడీ సంఘటనల నేపథ్యంలో శనివారం కమిషనరేట్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకింగ్ వ్యవస్థ పై ప్రజలకు మరింత విశ్వాసం కలిగించటంతో పాటు తమ సంస్థల వద్ద అన్ని రకాలుగా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంకులు, ఎటిఎంల వద్ద ఏదైనా దోపిడీలు, చోరీలకు నేరస్తులు పాల్పడే సందర్భంగా సమీప పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు బ్యాంకు సిబ్బందికి వెంటనే తెలిసేలా అలారంతో పాటు సాంకేతికతతో కూడిన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంకింగ్ రంగం అనేది సొసైటీ మనుగడ, పలు రకాల వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల గమనానికి మూల స్థంభంలాంటిందన్నారు. ప్రజలు తమ కష్టార్జితాన్ని నగదు, బంగారం రూపంలో బ్యాంకుల్లో భద్రపరచుకొంటారని, వాటిని కాపాడటమే తమ బాధ్యతగా బ్యాంకు అధికారులు గుర్తించాలన్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, రాయపర్తి, మంగుళూరులో చోటు చేసుకొన్న బ్యాంకు దోపిడీ సంఘటనల్లో ఆయా బ్యాంకుల లోపభూయిష్టమైన భద్రతా వ్యవస్థలో స్పష్టంగా కనపడుతోందని, ఇలాంటి బలహీన భద్రత, అజాగ్రత్త లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవటం ద్వారా నేరాలు జరుగకుండా కాపాడుకోగలుగుతారని కమిషనర్ అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 489 పోలీసు అధికారులు సందర్శించి గుర్తించిన లోపాలను ఆయా బ్యాంకు అధికారులకు వివరించి మెరుగుపరచుకోవాలని సూచించామన్నారు. పాతకాలం నాటి అలారం వ్యవస్థను ఆధునీకరించుకోవాలని, సిసిటివి కెమెరాలను అవసరమైన సంఖ్యలో పెంచాలని, డేటా ఫుటేజి పూర్తిస్థాయిలో భద్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సిసిటివి ఫుటేజి పోలీసుల దర్యాప్తులో కీలకంగా ఉంటుందని, బ్యాంకు ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు, క్యాష్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూంలతో సహా అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో 24/7 పనిచేసే సిసి కెమెరాలు అమార్చాలని, ఫుటేజ్ క్లౌడ్ నిలువ, బ్యాటరీతో పనిచేసే స్టోరేజి కలిగిన రహస్య కెమెరాలను అమర్చాలన్నారు. తెలంగాణా ప్రజా భద్రతా చట్టంలో నిర్దేశించిన నిబంధనలను బ్యాంకింగ్‌రంగం తప్పని సరిగా పాటించాలని, ట్రెజరీ యొక్క సాంకేతిక భద్రత, ఆర్‌బిఐ సూచించిన కనీస ప్రమాణాల కంటె ఏ మాత్రం తక్కువగా ఉండరాదని కమిషనర్ పేర్కొన్నారు. అక్రమ చొరబాట్లను నిరోధించటానికి కిటికీలకు గ్రిల్స్, వాహనదాడులను నిరోధించటానికి కంచెలు, గేట్లు, వాహన బ్యారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అనధికారిక యాక్సెస్ నిరోధించటానికి ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న సాంకేతికను అందిపుచ్చుకోవాలని, ఆధునిక భద్రతా పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఏటిఎంలలో నగదు నింపే ప్రక్రియలో వినియోగించే వాహనాలకు రక్షణగా నిర్దేశిత నియమాలకు అనుగుణం గా సుశిక్షితులైన సిబ్బందిని కాపలాగా పంపాలని ప్రత్యేకంగా సూచించారు. యాద్రాద్రి డిసిపి రాజేష్ చంద్ర, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్‌కుమార్, మల్కాజిగిరి డిసిపి పద్మజ, క్రైమ్ విభాగ డిసిపి అరవింద బాబు, మహేశ్వరం డిసిపి సునీతా రెడ్డి, ఎస్ఓటి 1 డిసిపి రమణారెడ్డి, ఎస్ఓటి2 డిసిపి మురళీధర్, ఐటి సెల్ ఎసిపి నరేందర్‌గౌడ్ తదితరులు, పలు బ్యాంకు ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఆలయ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** జగద్గిరిగుట్ట ఆలయ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగకుండ చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర జరుగుతున్న కబ్జాల విషయంపై పరిశీలనకు విచ్చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని జగద్గిరిగుట్ట కు చెందిన అన్ని పార్టీలకు చెందిన నాయకులతో కలిసి పరికి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని సర్వే చేయిస్తానన్నారు. చెరువును కబ్జా చేస్తున్న వారిని ఖచ్చితంగా జైలుకు పంపిస్తామన్నారు. బుధవారం నాడు పరికి చెరువు అంశంపైన సమావేశం ఏర్పాటు చేస్తానని, ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పరికి చెరువు పరిరక్షణకు ఒక గ్రూపు తయారు చేసి ఎప్పటికప్పుడు చెరువు పూడ్చివేతపై సమాచారం ఇవ్వాలని కోరారు. పరి కి చెరువును బాలకృష్ణ అనే వ్యక్తి కబ్జా చేస్తున్నాడని, స్థానికులు తెలుపగా బాలకృష్ణ కబ్జా చేస్తే ఖచ్చితంగా అరెస్టు చేస్తామని హెచ్చరించారు. కుల సంఘాల పేరుతో కొందరూ డబ్బులు వసూలు చేయడం, స్థలాలను అమ్ముకోవడం లాంటివిజరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని, వాటిపైన కూడా సమగ్ర సమాచారాన్ని సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధ్యులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్, సిపిఐ నాయకులు యాదగిరి, వంశీ, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, సాయి పంతులు, ఆంజనేయులు, చారి, బిజెపి నాయకులు, స్థానిక బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చర్లపల్లి జైలు సందర్శించిన లీగల్ సెల్ అథారిటీ సభ్యులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ జైళ్ల శాఖ ఖైదీల సంస్కరణలతో పాటు వారికి ఉపాధి కల్పించడంలో ముందున్నాయని తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ పంచాక్షరి, మేడ్చల్ జిల్లా లీగర్ సెల్ సర్వీసెస్ డి కిరణ్‌కుమార్‌లు చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని పర్యటించారు.ఈ సందర్భంగా జెలులో ఉన్న ఆసుపత్రి బ్లాక్,.జనరల్ కిచెన్ బ్లాక్, ఫ్యాక్టరీ యూనిట్, నర్సరీ పలు ప్రాంతాలలో వారు పరిశీలించారు. జైలులో చేపడుతున్న సంస్కరణలు చాలా బాగున్నాయని జైలు అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి జి.రామచంద్రం, ఉప పర్యవేక్షణాధికారులు డి.కాళిదాస్, శశికాంత్, రత్నం, జైలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఆహార వస్తువుల ముడి సరుకు సరఫరా చేయుటకు టెండర్లు :** హైదరాబాద్ మహనగర్‌లోని చర్లపల్లి కేంద్ర కారాగారం, వ్యవసాయ క్షేత్రం చర్లపల్లి, హైదరాబాద్ ప్రత్యేక మహిళా కారాగారం, కేంద్ర కారాగారం హైదరాబాద్ నాలుగు జైళ్ల లో 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను ఆహార వస్తువులు, మిస్లేనియస్ వస్తువులు, ఫ్యాక్టరీ సెక్షన్ కొరకు కావలసిన ముడి సరుకులు సరఫరా చేయుటకు 29వ తేదీ బుధవా రం టెండర్లు చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్వహిస్తున్నామని పర్యవేక్షణాధికారి జి రాంచంద్రం తెలిపారు. టెండర్లను 10 తేదీ నుండి 28వ తేదీ సాయంత్రం 5గంటలవరకు పని దినాలలో ఫారంలను విక్రయించాబడుతాయని తెలిపారు. ఇతర వివరాలకు 9494632101, 9494632 113, 949549502, 9848394001,9866922657 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



## మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలి :ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/కాప్రా :** హౌసింగ్ బోర్డు డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో అనుకూలంగా ఉన్న ప్రభుత్వ బండబావి స్థలంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డిలతో కల్సి ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గతంలో ఈ ప్రాంతంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అప్పటి జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ సందర్శించినప్పటికి ఆ ప్రతిపాదన మూలన పడిందన్న విషయాన్ని ఎమ్మెల్యేకు తెలిపారు. డిఇలు రవీందర్, ఉమా మహేశ్వరి, రూప, ఎఇ లింగారావు, భారత్, స్థానిక నేతలు భాస్కర్, నరసింహగౌడ్, రాకేష్, వేణుగౌడ్, శ్రీనివాస్, నిసార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కోసం రైతులతో చర్చ : కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**వికారాబాద్ జిల్లాని కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం పోలేపల్లి గ్రామంలోని అసైన్డ్ భూములకు సంబంధించిన రైతులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రత్యేక చర్చలు జరిపరు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారమ్‌సి నోటిఫికేషన్ ను నవంబర్ 29,2024న 60రోజుల పాటు 27.01.2025 వరకు సమ్మితి అవార్డు కోసం జారీ చేయబడిందన్నారు. రైతుల నుండి సెకరించే సమయంలో ఎమైన అభ్యంతరాలు తదితరు అంశలపై రైతులతో చర్చించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో 34మంది రైతులు హాజరయ్యా రు. పోలేపల్లి గ్రామంలో మొత్తం 73.39 ఎకరాల భూమి ఉందని దీనిపై రైతులతో చర్చించి రైతుల సమ్మతాన్ని పొందినట్లు కలెక్టర్ తెలిపారు. ఎకరానికి 20లక్షలు 150గజాల ఇంటిస్థలం తో పాటు ఇందిరమ్మ ఇల్లు ,ఇంటికి ఒక ఉద్యోగం కల్పించనున్నట్లు కలెక్టర తెలిపా రు. ఈ కార్యాక్రమంలో తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ ఉమాహరతి, శైలజ, రామ్‌రెడ్డి శ్రీదర్‌రెడ్డి ,దుద్యాల తహసీల్దార్ కిషన్ తదితరులు పాల్గోన్నారు.




**అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందచేతపై జూమ్ ద్వారా జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలకు అందచేయాలని అన్నారు. రైతు భరోసా ,ఇందిరమ్మ ఇల్లు ,ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పరిశీలన ప్రక్రియను పూర్తిచేసి ఆదివారం మధ్యాహ్నం లోపు నివేదికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. సాగు వినియోగంలో లేని భూముల ను కూడా గుర్తించి నివేదికలు రూపోందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ ట్రైనింగ్ కలెక్టర్ ఉమాహరతి, డిపిఓ జయసుధ, మోహన్‌బాబు, వ్యవసాయ శాఖ అధికారి ఎడిఎ స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.



## షాపూర్‌నగర్‌లో సిపిఐ శాఖ సమావేశం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్‌నగర్ లో శనివారం సీపీఐ శాఖ సమావేశం కె.స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి అధ్యక్షులు ఎండి. యూసుఫ్, ఎఐటియుసి నియోజకవర్గం అధ్యక్షులు వి.హరినాథ్ రావు, మేడ్చల్ జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షులు రాములు, కుత్బుల్లాపూర్ మండల సిపిఐ కార్యదర్శి నర్సింహారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాల ప్రకారం సభ్యులందరి చేత ప్రమాణం చేయించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి బక్కర్ మల్లేష్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, సుంకిరెడ్డి, వి.మహేందర్, చంద్రమౌలి, ఎం.రమేష్, కె.మహేష్ పెద్ద ఎత్తున్న సభ్యులు పాల్గొన్నారు.



## ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి ‘ప్రజాపక్షం’

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న ప్రజాపక్షం దినపత్రిక 2025 క్యాలెండర్‌ను శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య స్వగ్రామం చించల్ పేట్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ‘ప్రతి అక్షరం ప్రజలపక్షం, ప్రజలకొరకు’ అనే నినాదంతో ప్రజాపక్షం దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతుకను వినిపిస్తున్నదని, ప్రభుత్వం ప్రజలకు మధ్య వారధిగా పత్రికలని, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరవేయడంలో వాటి పాత్ర కీలకమని ఎంఎల్ఎ అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, డైరెక్టర్లు ఎండి ఖాధీర్, నర్సింహా రెడ్డి, తలారి కుమార్, చిట్టెపు రాజశేఖర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కే.వెంకటేశం, బలరాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతి



**ప్రజాపక్షం/కాప్రా :** విద్యుద్ఘాతంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఉదంతం నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హబ్సిగూడలోని సైంటిస్టు కాలనీ విజయలక్ష్మి ఆర్కేడ్ భవనం మూడవ అంతస్తులో గతంలో శుభ నందిని ఛిట్ ఫండ్ సంస్థ ఓ ప్లాట్‌లో అద్దెకు ఉంటూ ఇటీవలే ఖాళీ చేసారు. అదే ప్లాట్‌ను తిరిగి చాక్లెట్ కంపనీ కోసం అద్దెకు తీసుకొన్న తాటి రవి గతంలో చిట్ ఫండ్ సంస్థ ఏర్పాటు చేసి తీయకుండా ఉన్న హోర్డింగ్‌ను తొలగించాలంటూ చెప్పటంతో ఎదురుగా ఉన్న మోతి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న జాతోత్ బాలు(36), అతడి బంధువైన గుగులోత్ మల్లేష్‌తో కల్సి శనివారం దాన్ని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11కెవి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుద్ఘాతానికి గురైన వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను శవపంచనామా నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## చర్లపల్లి హత్య కేసు ఛేదించిన పోలీసులు

### తొమ్మిది మంది నిందితులు అరెస్టు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఇటీవల చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యకు గురైన జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి కేసును పోలీసులు ఛేధించారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి పారిశ్రామికవాడ ఒమేగా అండ్ మహాలక్ష్మి ప్లాస్టిక్ కంపెనీలో పనిచేస్తున్న మృతుడు బాబుషాల్ తుడు సహా మరో తొమ్మిదిమంది జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఏ1 లుఖిరామ్, ఏ2 రాసిలాల్ సోరెన్,ఏ3 అభిలాష్‌బాస్కీ, ఏ4 ఉత్తమ్ హన్సా, ఏ5 కోసలేందర్ సోరెన్, ఏ6, సికిందర్ మారాండి, ఏ7సికిందర్ ముర్మ, ఏ8 సందీప్ ముర్ము, ఏ9 గులాబ్ ముర్ములు కంపెనీకి చెందిన గదులలో నివాసముంటున్నారు. మృతుడు తానే పెద్దగా భావించి వారిపై అధికారం చెలాయిస్తూ వారిని భయాందోళనకు గురిచేసి మీ అంతు చూస్తానని బెదిరించేవాడు. మృతుడిపై కోపం పెంచుకున్న వారు పీడ వదిలించుకోవాలని నిర్ణయించుకుని చర్లపల్లి కనకదుర్గ వైన్స్ షాపులో మద్యం సేవించి లింక్‌వెల్స్ గ్రౌండ్‌లో మరోసారి మద్యం సేవించి విచక్షణారహితంగా బండరాయితో తలపై కొట్టి హత్య చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. కేసు ఛేధించిన పోలీసులను రాచకొండ సిపి సుధీర్‌బాబు, డిసిపి పద్మజా,ఏడిసిపి వెంకటరమణ,ఏసిపి మహేష్‌లు అభినందించారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి : స్పీకర్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్నా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ బిడ్జి నిర్మాణంలో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు ఎలాంటి నష్టం జరగకుండా పరిహారాన్ని అందించి న్యాయం చేకురుస్తారన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రజలకు ఉపయోగపడే రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరగాలని లక్షలాది మంది ప్రజలకు ఉపయోగపడే ఇటాంటి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని స్పీకర్ కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి ఆర్‌డిఓ వాసు చంద్ర , తహసీల్దార్ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గోన్నారు.

# క్రీడ



# సిరాజ్‌పై వేటు..

## ఛాంపియన్స్ ట్రోఫీ.. భారత జట్టు ప్రకటన

ఛాంపియన్స్ ట్రోఫీ 2025తో పాటు ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో బరిలోకి దిగే భారత జట్టును చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రకటించాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి శనివారం మీడియా సమావేశంలో పాల్గొన్న అజిత్ అగార్కర్.. 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టు వివరాలను వెల్లడించాడు. గాయంతో బాధపడుతున్న జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ అప్‌డేట్ కోసం వేచి చూస్తున్నామని తెలిపాడు. ఫిట్‌నెస్ సాధించకపోతే ఇంగ్లండ్‌తో తొలి రెండు వన్డేలకు బుమ్రా అందుబాటులో ఉండడని చెప్పాడు. అతని స్థానంలో హర్షిత్ రాణా ఆడుతాడని పేర్కొన్నాడు. రోహిత్ శర్మకు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్ వ్యవహరిస్తాడని స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో కరుణ్ నాయర్ నిలకడగా రాణిస్తున్నా.. ప్రస్తుత పరిస్థితుల్లో జట్టులో అతనికి చోటు లేదని అజిత్ అగార్కర్ తెలిపాడు. అద్భుత ప్రదర్శనతో అతను తమ దృష్టిని ఆకర్షించాడని, ఎవరైన గాయపడితే అతన్ని పేరును పరిశీలిస్తామని చెప్పాడు.

అందరూ ఊహించినట్లుగానే జట్టులో ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు. మహమ్మద్ సిరాజ్ మినహా సీనియర్ ఆటగాళ్లందరికి అవకాశం దక్కగా.. కుర్రాళ్లకు మరో సారి నిరాశే ఎదురైంది. విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రిత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా జట్టులో చోటు దక్కించుకున్నారు.

ఆస్ట్రేలియా పర్యటనలో దారుణంగా విఫలమైన మహమ్మద్ సిరాజ్‌పై వేటు పడింది. అతని స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం కల్పించారు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డికి రిజర్వ్ ప్లేయర్‌గా అవకాశం దక్కింది. అతనితో పాటు ఆవేశ్ ఖాన్, వరుణ్ చక్రవర్తి ట్రావెలింగ్ రిజర్వ్‌లో ఉన్నారు. సంజూ శాంసన్‌కు కూడా నిరాశే మిగిలింది. స్పిన్ ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యత ఇవ్వడంతో సిరాజ్‌కు జట్టులో అవకాశం దక్కలేదని తెలుస్తోంది.

**భారత జట్టు:**

రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్

**రిజర్వ్ ప్లేయర్స్:**

నితీష్ కుమార్ రెడ్డి, ఆవేశ్ ఖాన్, వరుణ్ చక్రవర్తి

**ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు:**

రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్, హహర్షిత్ రాణా(రిజర్వ్ ప్లేయర్).

## డిఫెండింగ్ ఛాంపియన్‌కే ఎక్కువ అవకాశం

సునీల్ గావస్కర్



ఫిబ్రవరి 19 నుంచి ఎనిమిది దేశాలు తలపడే ఛాంపియన్స్ ట్రోఫీ మొదలుకానుంది. చివరిసారిగా 2017లో ఈ టోర్నీ జరిగింది. ఇప్పుడు పాకిస్థాన్ ఆతిథ్యంలో మళ్లీ సిద్ధమైంది. అయితే, భారత్ ఆడే మ్యాచులు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. తాజాగా టీమ్‌ఇండియా తన స్క్వాడ్‌ను ప్రకటించింది. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ విజేతగా ఎవరు నిలుస్తారనేదానిపై విశ్లేషించాడు. తీవ్ర పోటీ ఉన్నప్పటికీ.. డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలిచిన పాక్‌కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించాడు. ''ఛాంపియన్స్ ట్రోఫీలో ఫేవరెట్లు అనే ట్యాగ్‌లైన్‌ను హోమ్ టీమ్‌కే ఇవ్వాలి. వారి దేశంలో పాక్‌ను ఓడించడం తేలికైన విషయం కాదు. స్వదేశంలో జరిగిన గత వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు భారత్ వెళ్లిన సంగతి గుర్తు పెట్టుకోవాలి. తుది పోరులో ఓడినప్పటికీ.. వరుసగా మ్యాచ్‌లను గెలుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు కూడా పాక్‌కు అలాంటి అవకాశమే ఉంది. స్వదేశంలో ఆ జట్టును ఓడించడం కష్టసాధ్యమే. అందుకే, దాయాది దేశాన్ని ఫేవరెట్‌గా భావిస్తున్నా'' అని గావస్కర్ వెల్లడించాడు.

## సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్‌రౌండర్ విధ్వంసం!



సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ అభినవ్ మనోహర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటకకు ప్రాతినిధ్యం వహిస్తున్న అభినవ్ మనోహర్.. విదర్భతో శనివారం జరిగిన ఫైనల్లో 42 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 79 పరుగులు చేశాడు. అతని విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 348 పరుగులు చేసింది. రవిచంద్రన్ సమరణ్(92 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. కృష్ణన్ శ్రీజిత్(74 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 78) హాఫ్ సెంచరీతో రాణించాడు. విదర్భ బౌలర్లలో దర్శన్ నల్కండే(2/67), నచికేత్ భుటే(2/70) రెండేసి వికెట్లు తీయగా.. యశ్ ఠాకూర్, యశ్ కదమ్ తలో వికెట్ తీసారు. 188 స్ట్రైక్‌రేట్‌తో అభినవ్ మనోహర్ బ్యాటింగ్ చేయడం కర్ణాటకకు కలిసొచ్చింది. అభినవ్ మనోహర్ విధ్వంసకర బ్యాటింగ్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్ 2025 వేలంలో రూ.30 లక్షల కనీస ధరతో అందుబాటులోకి వచ్చిన అభినవ్ మనోహర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.3.20 కోట్లకు కొనుగోలు చేసింది.


# రీల్

## దుమ్ము లేపుతున్న సంక్రాంతికి వస్తున్నాం..




మన టాలీవుడ్ మోస్ట్ లవబుల్ సీనియర్ స్టార్ హీరో మెయిన్‌గా ఫ్యామిలీ హీరో విక్టరీ వెంకటేష్ మళ్ళీ తన ఫామ్ చూపిస్తున్నారని చెప్పాలి. తనకి సరైన సినిమా పడితే ఎలా ఉంటుందో మళ్ళీ టాలీవుడ్ చూస్తుంది. ఇలా తాను హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం సంక్రాంతికి వస్తున్నాం ఈ సంక్రాంతికి వచ్చి భారీ వసూళ్లతో అదరగొడుతుంది. మరి కేవలం మూడు రోజుల్లోనే 100 కోట్ల మార్క్ దాటేసిన ఈ సినిమా ఇపుడు నాలుగు రోజుల్లో ఏకంగా 131 కోట్లకి పైగా గ్రాస్‌ని రాబట్టి సెన్సేషన్‌ని సెట్ చేసింది. మరి వీక్ డేస్‌లో కూడా వరల్డ్ వైడ్‌గా 30 కోట్ల మెటా గ్రాస్ వస్తుంది అంటే ఆడియెన్స్ ఏ రేంజ్‌లో ఈ సినిమాకి పట్టం కడుతున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. దర్శకుడు అనీల్ రావిపూడి, వెంకీ మామ కాంబినేషన్‌లో ఇది బిగ్గెస్ట్ గ్రాసర్‌లా మారే సూచనలు చాలా కనిపిస్తున్నాయి. ఇక ఈ వీకెండ్ సహా ఫుల్ రన్‌లో సంక్రాంతికి వస్తున్నాం చిత్రం ఈజీగా 200 కోట్ల గ్రాస్ క్లబ్ లోకి చేరిపోయేలా కూడా ఉందని చెప్పాలి. మొత్తానికి మాత్రం మళ్ళీ అనీల్, వెంకీ మామ కాంబినేషన్ దిల్ రాజు అండ్ కోకి మళ్ళీ కాసుల వర్షం అందిస్తుంది అని చెప్పవచ్చు.

## పవన్‌కి పోటీగా నితిన్ సినిమా..




ఈ ఏడాదిలో మన తెలుగు సినిమా నుంచి రిలీజ్‌కి రానున్న అవైటెడ్ చిత్రాల్లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా హరిహర వీరమల్లు కూడా ఒకటి. ఆల్రెడీ మార్చి 28కి ఈ సినిమాని మేకర్స్ లాక్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాతో పాటుగా మళయాళం నుంచి ఎంపురాన్ అలాగే విజయ్ దేవరకొండ భారీ సినిమా కూడా ఆ సమయానికి లైన్‌లో ఉన్నాయి. మరి లేటెస్ట్‌గా ఈ రేస్‌లో యూత్ స్టార్ నితిన్ జాయిన్ అయ్యాడని చెప్పాలి. నితిన్ అలాగే దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో చేస్తున్న అవైటెడ్ సినిమానే రాబిన్ హుడ్. గత డిసెంబర్‌లోనే రిలీజ్ కావాల్సి ఉన్న ఈ సినిమాని మేకర్స్ వాయిదా వేసి ఇపుడు కొత్త డేట్ అనౌన్స్ చేశారు. దీనితో ఈ సినిమా కూడా మార్చ్ 28న రిలీజ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మరి అదే రోజున నితిన్ అభిమాన హీరో పవన్ కళ్యాణ్ చేస్తున్న పాన్ ఇండియా సినిమా హరిహర వీరమల్లు కూడా ఉంది. మరి తన సినిమాకి పోటీగా ఈ సినిమాని అనౌన్స్ చేయడం ఇపుడు గమనార్హం. మరి ఈ రెండు వస్తాయా లేక ఒకటి ఆగుతుందా అనేది చూడాలి.



## ప్రియాంక వచ్చింది.. మహేష్ కోసమేనా?

మహేష్ బాబు– రాజమౌళి కాంబోలో రూపొందుతున్న చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇటీవల హైదరాబాద్ లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరిగింది. ఆ తరవాత రెండు రోజుల పాటు షూట్ కూడా చేశారు. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలు కాబోతోంది. ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంకా చోప్రా నటిస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. చిత్ర బృందం అధికారికంగా ప్రకటించలేదు కానీ, ప్రియాంక దాదాపు ఖరారైనట్టే. ఇప్పుడు ప్రియాంక చోప్రా హైదరాబాద్‌లో లాండ్ అయ్యింది. ఇటీవల టొరెంటో వెళ్లింది ప్రియాంకా. అక్కడ్నుంచి దుబాయ్, దుబాయ్ నుంచి హైదరాబాద్ ప్రయాణం అవుతున్నట్టు ఇన్ స్టాలో ఓ పోస్ట్ పెట్టింది. దాంతో.. మహేష్ సినిమా కోసమే ప్రియాంకా హైదరాబాద్ వస్తున్నట్టు ఫ్యాన్స్ కూడా బలంగా ఫిక్సయిపోయారు. ఆమధ్య ప్రియాంక లుక్ టెస్ట్ లోనూ పాల్గొందని, ఇక నేరుగా షూటింగ్ మొదలెట్టేస్తారని ప్రచారం జరుగుతోంది. వచ్చే వారం షూటింగ్ మొదలయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే హైవే రూట్‌లో.. ఈ సినిమా కోసం ప్రత్యేకమైన సెట్ తీర్చిదిద్దుతున్నారు. అక్కడే షూటింగ్ జరగబోతోందని ఇన్ సైడ్ వర్గాల టాక్.

## 'డాకు మహారాజ్' వసూళ్లు రూ.100 కోట్లు



నందమూరి స్టార్ హీరో గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రమే డాకు మహారాజ్. దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కించిన ఈ క్రేజీ యాక్షన్ చిత్రం బాలయ్య కెరీర్లో మరో పెద్ద హిట్‌గా నిలిచింది. అయితే ఈ చిత్రం ఆల్రెడీ 100 కోట్ల గ్రాస్ ని క్రాస్ చేయగా ఇపుడు సక్సెస్ ఫుల్‌గా 66 రోజుల రన్‌ని కంప్లీట్ చేసుకుంది. మరి ఈ 6 రోజుల్లో డాకు మహారాజ్ సాలిడ్ నెంబర్ 124 కోట్ల గ్రాస్‌ని అందుకున్నట్టుగా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. దీనితో డాకు మహారాజ్ మంచి స్టడీ వసూళ్లతో దూసుకెళ్తుంది అని చెప్పవచ్చు. ఇక ఈ వీకెండ్‌లో మళ్ళీ పుంజుకునే ఛాన్స్ ఉందని కూడా చెప్పాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటించింది. అలాగే శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వశి రౌటేలా తదితరులు నటించారు. మరి ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ సహా ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహించారు.

# రాష్ట్రాన్ని విధ్వంసం చేసినవారే ప్రభుత్వంపై విమర్శలా?

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
### తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో 92 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు




ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసి, అధోగతి పాలు చేసిన వారే, ప్రజాప్రభుత్వంపైన విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా 15వ తేదీ తర్వాత జీతాలు చెల్లించే పరిస్థితి నుంచి ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించే పరిస్థితికి తీసుకొచ్చామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ కూడా అమలు చేయలేదని అబద్ధాల మీద పుట్టిన రాజకీయ పార్టీ గత పదేళ్లుగా అధికారం ఉన్నప్పుడు ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా ప్రజలకు భ్రమలు కల్పిస్తూ బతికిందని, ఇప్పుడు మళ్లీ అదే అబద్దాలతో ప్రజా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం,రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో 92మంది అభ్యర్థులకు జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌గా, తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థలో 20 మంది అభ్యర్థులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి భట్టి విక్రమార్క శనివారం నియామక పత్రాలను అందజేశారు. విద్యుత్ శాఖ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డి.ఎ కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాది లోపు 56వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలో భాగంగా అధికారంలోకి రాగానే రాష్ట్ర మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆరు గ్యారంటీలపై విమర్శలు చేసే వారు ఆర్‌టిసి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతుందో లేదో, తెలుసుకునేందుకు బస్సులో వారికి సంబంధించిన మహిళలను పంపిస్తే తెలుస్తుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రైతు బంధు డబ్బులు ఇవ్వకుండా బిఆర్ ఎస్ ఎగ్గొట్టిన డబ్బులను అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ఒకే రోజు రూ.7,624 కోట్లు జమ చేసిందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములు అన్నింటికీ రైతు భరోసా ఇస్తున్నామని, రూ.8400 కోట్లను రైతు భరోసా కోసం వెచ్చించడానికి ప్రాథమిక అంచనా వేసి, ఈ నెల 26 నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయబోతున్నామని పునరుద్ఘాటించారు. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ. 12వేలు ఇస్తామని, ఈనెల 26 తర్వాత మొదటి విడత ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేస్తామని వెల్లడించారు.

మూడు ఎకరాలు భూమి, ఇంటికో ఉద్యోగం, ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు తగ్గకుండా సాగునీరు ఇస్తామని ఇచ్చిన హామీలను గత పాలకులు విస్మరించారని విమర్శించారు. గత పాలకుల తరహా కాకుండా ఇచ్చిన ప్రతి మాటకూ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. గత పాలకుల తరహాలో తాము విలాసాలకు, అనవసర ఖర్చులకు ప్రజాధనాన్ని ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టబోమన్నారు. సంపద సృష్టించి, ఆ సృష్టించిన సంపదను ప్రతి ఒక్కరికి పంచడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ రాష్ట్రానికి లక్ష కోట్లు పెట్టుబడులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దావోస్ వెళ్లారన్నారు. ఈ పర్యటనలో రూ. లక్ష కోట్లకు తగ్గకుండ పెట్టుబడులు తీసుకురవాడానికి కావాల్సిన ప్రణాళికలు తయారు చేసుకొని దావోస్ వెళ్లారని వివరించారు. హైదరాబాద్ నగరాభివృద్ధి, ఫ్యూచర్ సిటీ ఏర్పాటు, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో కొత్తగా రానున్న పరిశ్రమలు, హౌజింగ్ టౌన్ షిప్‌ల ఏర్పాటుతో పెరుగనున్న విద్యుత్ డిమాండ్ ను పరిగణలోకి తీసుకొని 2029 30 సంవత్సరం నాటికి 22,448 మెగావాట్లు, 2034 35 నాటికి 31,809 మెగావాట్ల పీక్ డిమాండ్ కు అనుగుణంగా నిరంతరం నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడానికి ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసి, కసరత్తు మొదలుపెట్టిందని భట్టి వివరించారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ న్యూ ఎనర్జీ పాలసీని తీసుకురాకుండా గాలికి వదిలేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. గత మార్చి1వ తేదీ నుంచి అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల రూ. 148.5 కోట్లు చెల్లిస్తున్నదని, ఇప్పటి వరకు విద్యుత్ శాఖకు రూ. 1485 కోట్లను చెల్లించినట్టు వివరించారు.

### 25 గ్రామాలకు సోలార్ పైలెట్ ప్రాజెక్ట్

రాష్ట్రంలో 25 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సోలార్ గ్రామాలుగా మార్చబోతున్నామని, ఆగ్రామాల్లో వ్యవసాయ పంపు సెట్లకు, గృహాలకు రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు ప్రక్రియ మొదలైందని భట్టి విక్రమార్క అన్నారు. వైద్య శాఖలో ఏర్పాటు చేసిన అంబులెన్స్ తరహాలో విద్యుత్ శాఖలో కూడా అత్యవసర వాహనాలను ఏర్పాటు చేశామని, ఇందులో ఒక ట్రాన్స్‌ఫార్మర్, తీగలు,ఇతర పరికరాలు ఉంటాయని వివరించారు. విద్యుత్‌కు సంబంధించి ఏమైనా సమస్యల ఉంటే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే ఆ ప్రదేశానికి వచ్చి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తారని వివరించారు.

### గత ప్రభుత్వ అప్పులను తీర్చి.. సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం

మంత్రి తుమ్మల నాగేశ్వర్

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల అప్పులను తీర్చి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రూ. 2 లక్షల రుణ మాఫీ చేశామని, గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేసిన రుణ మాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క సంవత్సరం లోనే చేసిన రుణమాఫీ ఎక్కువ అని తెలిపారు. గత రబీకి సాగుచేసిన విస్తీర్ణంలో ఈ రబీకి కూడా సాగు విస్తీర్ణం ఉంటుందన్నారు. శ్రీశైలం, నాగార్జున రెండు రాష్ట్రాలకు చెందిన ప్రాజెక్టులని, నీటి వాటా విషయంలో జాగ్రత్తగా ఉండాలని, రైతులకు ఇబ్బంది పడకుండా నిరంతర విద్యుత్తు జరిగేలా చూడాలని ఆయన సూచించారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉప సంఘం సమావేశం : భట్టి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఒక్కొక్కటిగా మంజూరు చేస్తున్నామని, పెండింగ్ సమస్యలను ఫిబ్రవరి మొదటి వారంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేసి, వాటిని పరిష్కరిస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాలకు హామీనిచ్చారు. ఉద్యోగులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోస నిచ్చారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగ సంఘాలతో క్యాబినెట్ సబ్ కమిటీ సమా వేశాన్ని ఏర్పాటు చేయాలని టిఎన్‌జిఒ అధ్యక్షుడు మారంజగదీశ్వర్, ఎస్.ఎం.హుస్సేని ముజీబ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిప్యూటీ సిఎంతో శనివారం సమావేశమయ్యారు.ఈ సమావేశంలో అసోసి యేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నగర శాఖ అధ్యక్షులు కట్కూరి శ్రీకాంత్, కార్యదర్శి పంతులు హరికృష్ణ, తెలంగాణ నాలుగో తరగతి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, మార్కెటింగ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ముక్రం, ఇరిగేషన్ ఫోరం రాష్ట్ర కోశాధికారి పి. శ్రీనివాస్, ఎపి నుండి తెలంగాణకుకు కేటాయించబడ్డ తెలంగాణ ఉద్యోగులు మహేందర్, ఖాజా, వహీద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చినట్టు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు.

## ప్రతి అర్హుడికీ రేషన్ కార్డు అందజేయాలన్నదే లక్ష్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రతి అర్హుడికి రేషన్ కార్డు అందజేయలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియఅని, అర్హులైన చివరి వ్యక్తికి అందే వరకు రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతూనే వుంటుందన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూఇపుడు కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అందరికీ రేషన్ కార్డులు అందుతాయని భరోసా ఇచ్చారు. పాత రేషన్ కార్డులు తీసేస్తారని జరుగున్న ప్రచారంలో నిజం లేదని కొట్టిపారేశారు. పాత రేషన్ కార్డులు అలాగే ఉంటాయని స్పష్టం చేశారు. కులగణన, సోసియా ఎకనమిక్ సర్వే, పాత రేషన్ కార్డుల ఆధారంగా పేర్లు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. వీటిల్లో ఎవరికైనా కార్డులు రాకపోతే గ్రామ సభలలో మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చాని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ట్రంప్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

విపరీతమైన చలిగాలులు వీస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ చలిగాలుల భయంవల్ల ప్రమాణ స్వీకారోత్సవం సంప్రదాయవిరుద్ధంగా జరుగుతున్నది. 1841లో విలియం హెన్రీ హారిసన్ (58) దేశాధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆరుబయట విపరీతమైన చలిగాలులమధ్య సుదీర్ఘ ప్రారంభోత్సవ ప్రసంగం చేశారు. దీంతో ఆయన న్యుమోనియా బారినపడ్డారు. సరిగ్గా నెలరోజుల తర్వాత అదేరోజున ఆయన న్యుమోనియా వల్ల మరణించారు. ఆ విధంగా అమెరికా చరిత్రలో అతితక్కువకాలం 30 రోజులు అధ్యక్షపదవిలో కొనసాగిన నాయకుడుగా హెన్రీ హారిసన్ మిగిలిపోయారు. రోనాల్డ్ రీగన్ కూడా 1985లో చలిగాలుల భయంతో ఇండోర్‌లోనే ప్రమాణ స్వీకారం చేశారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 20వ తేదీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని క్యాపిటల్ భవనం లోపల హాలులోకి మార్పు చేశారు. ప్రారంభోత్సవ పరేడ్ కూడా లోపలే జరుగుతుంది. లైవ్ టెలికాస్ట్‌ను అందరికీ అందుబాటులోకి తెస్తారు. కరోనా మహమ్మారివల్ల 2020లో జో బైడెన్ ప్రమాణ స్వీకారోత్సవానికి 1,000 మందిని మాత్రమే అనుమతించారు. కానీ నిర్వాహకులు ఈసారిమాత్రం 2.20లక్షల టిక్కెట్లు ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిమిత్తం విక్రయిస్తామని ప్రకటించారు. వీరంతా బయట గ్రౌండ్స్‌లో ఉండి లైవ్ టెలీకాస్ట్‌ను చూడవచ్చు. ప్రజలు తమ తమ సొంత నిర్ణయాలు తీసుకోవాలని, చాలా దిట్టంగా దుస్తులు ధరించి వచ్చే వారువస్తారనీ, ఎందుకంటే ఇది ఒక చరిత్రాత్మకసంఘటన అనీ నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలలో వేలాది మంది వాషింగ్టన్ నగరానికి వచ్చే అవకాశం ఉంది.

### పీపుల్స్ మార్చ్

ఎనిమిదేళ్ళక్రితం ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు మొదటి సారి వేలాదిమంది మహిళలు ''ఉమెన్ మార్చ్'' నిర్వహించారు. కానీ ఇప్పుడు దాని పేరు మార్పుతో ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ఒకరోజుముందు అమెరికా కాలమానం ప్రకారం శనివారంనాడు ''పీపుల్స్ మార్చ్'' జరుగుతుంది. ఆనాడు వాషింగ్టన్‌తోపాటు దేశ వ్యాప్తంగా లక్షలమంది ప్రదర్శన చేశారు. కానీ రాజధానిలో ఐదులక్షలమంది ఉమెన్స్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఈసారి అందులో పదోవంతు మాత్రమే ఈ పీపుల్స్ మార్చ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. ఫెమినిజం థీమ్‌తో ఈ ఉమెన్ మార్చ్ జరుగుతుంది. మహిళలు అనేక సమస్యలను ఈసారి తమ ప్రదర్శనలో వెల్లడించాలనుకుంటున్నారు. పునరుత్పత్తి సమస్యలు, ఎల్‌జిబిటిక్యూ హక్కులు, వలసలు, వాతావరణం, ప్రజాస్వామ్యం వంటి అనేక అంశాలను ఈసారి ప్రదర్శనల సందర్భంగా మహిళలు ప్రస్తావించదలిచారు. ఈ పీపుల్స్ మార్చ్ చాలా అసాధారణమైనదని, అనేక విస్తారమైన సమస్యలను ఈ మార్చ్ ద్వారా ఒకే ఛత్రం కింద ప్రస్తావిస్తామని ఓక్లాండ్ యూనివర్సిటీలో సోషల్ మూమెంట్స్‌పై పరిశోధన చేస్తున్న సోషియాలజీ ప్రొఫెసర్ జో రీగర్ పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com